జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.
అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు
94402 31967

రంగారెడ్డి మంగళవారం 13 అక్టోబర్ 2026 సంపుటి : 17 సంచిక : 85 పేజీలు : 8 వెల : 1/- RNI NO.APTEL/2010/36516

శ్రీ పరాభవ నామ సంవత్సరం, మాసం : జ్యేష్ఠ మాసం, గ్రీష్మ ఋతువు, ఉత్తరాయణం, సూర్య చంద్రుల సమయాలు సూర్యోదయం : 5:28 , సూర్యాస్తమయం : 6:32 , చంద్రోదయం : 3:38 చంద్రాస్తమయం : 3:07 పంచాంగం, తిథి : శుద్ధ ద్వాదశి రా. 10:31 వరకు, తర్వాత త్రయోదశి, నక్షత్రం: విశాఖ రా. 8:10 వరకు, తర్వాత అనూరాధ, యోగం : సిద్ధం మ. 1:19 వరకు, తర్వాత సాధ్యం, కరణం: బవ ఉ. 9:47 వరకు, తర్వాత బాలవ రా. 10:31 వరకు, తర్వాత కౌలవ

Published From RANGAREDDY, WARANGAL, KAMMAM, NALAGONDA http://www.prajajyothinews.com Mail : prajajyothidaily@gmail.com

# దసరా రద్దీ

హైదరాబాద్: దసరాను పురస్కరించుకుని ప్రయాణికుల రవాణా సౌకర్యార్థం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ ఆర్టీసీ) నడుపుతున్న ప్రత్యేక బస్సు సర్వీసులకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. దసరా రద్దీ నిర్వహణ, అదనపు బస్సుల ఆపరేషన్లపై టీజీఎస్ ఆర్టీసీ ఎండీ వై. నాగిరెడ్డి సోమవారం అధికారులతో జూమ్ సమీక్షా సమావేశం నిర్వహించారు. పండుగ వేళ ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని, సర్వీసులను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ దసరా సందర్భంగా టీజీఎస్ ఆర్టీసీ రికార్డు స్థాయిలో సర్వీసులను నడుపుతూ మెరుగైన రవాణా సౌకర్యాన్ని అందించింది. గత ఏడాది (2025) దసరా తొలి మూడు రోజుల్లో 922 అదనపు బస్సులను నడపగా... ఈ ఏడాది అక్టోబర్ 9, 10, 11 తేదీలలో గతంతో పోలిస్తే 495 బస్సులు అదనంగా, అంటే మొత్తం 1,417 ప్రత్యేక బస్సులను అందుబాటులోకి తెచ్చారు. అదేవిధంగా తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'మహాలక్ష్మి' ఉచిత బస్సు ప్రయాణ పథకం ద్వారా దసరా పండుగ వేళ మహిళలకు భారీగా ఆర్థిక ప్రయోజనం చేకూరుతోంది.

గత ఏడాది దసరా సమయంలో రోజుకు సగటున రూ. 13.02 కోట్లు ఆదా కాగా, ఈ ఏడాది దసరా రద్దీ సమయంలో మహిళలు రోజుకు రూ. 13.73 కోట్ల మేర ఆదా చేసుకోగలినట్లు ఆర్టీసీ ప్రకటించింది.పండుగ ముందు రద్దీని దృష్టిలో ఉంచుకుని స్వంత ఊర్లకు ప్రయాణమయ్యే వారి కోసం ఈ నెల 15, 16, 17 తేదీల్లో కూడా రద్దీకి అనుగుణంగా అదనపు బస్సులను నడపాలని అధికారులను ఎండీ వై. నాగిరెడ్డి ఆదేశించారు. ప్రభుత్వం అందిస్తున్న మహాలక్ష్మి పథకంలో భాగంగా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ రెగ్యులర్ ప్రత్యేక బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం యథావిధిగా అమల్లో ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ప్రయాణికులు ముందస్తు రిజర్వేషన్ కోసం ష్ఠ్ఠ్.స్త్రంతీష్ఎబం.ఱఅ వెబ్‌సైట్‌ను ఉపయోగించుకోవచ్చని, ఇతర వివరాలు మరియు ప్రయాణ సమాచారం కోసం ఆర్టీసీ కాల్ సెంటర్ నంబర్లు 040-69440000, 040-23450033 లలో సంప్రదించాలని సూచించారు.



# అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయండి



ఎంఎంసీ కమిషనర్‌ను కోరిన ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జీ పరమేశ్వర్‌రెడ్డి

# డ్రగ్స్‌కు దూరంగా.. సంస్కృతికి చేరువగా!

చేవెళ్ల వివేకానంద కళాశాలలో నిషా ముక్త్ యువ, బతుకమ్మ సంబరాలు

డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి విద్యార్థుల ప్రతిజ్ఞ

బతుకమ్మ వేడుకల్లో సందడి.. స్వచ్ఛ భారత్‌లో శ్రమదానం





# నీళ్లు లేక ఎండుతున్న వరి పైరు .. ట్యాంకర్లతో నీరు పోస్తున్న రైతు!



రోజుకు రూ.1,000 అద్దెతో ట్యాంకర్ల ద్వారా పంటకు నీరు

వర్షాభావం.. తగ్గిన భూగర్భ జలాలు.. అప్రకటిత విద్యుత్ కోతలతో అన్నదాతకు కష్టాలు

20 రోజులు నీరు పోస్తేనే పంట బతుకుతుందంటూ రైతు ఆవేదన

# పారిశుద్ధ్య కార్మికుల సేవలు మరువలేనివి

శంషాబాద్ మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ సుష్మారెడ్డి

ప్రతి పేదవాడు సంతోషంగా పండుగ జరుపుకోవాలనేది ఆశారాం బాబా లక్ష్యం

యోగి వేదన్ సేవాసమితి ఉపాధ్యక్షులు బాలపురం జేసురాజు



# పారిశుద్ధ్య కార్మికుల సేవలు మరువలేనివి

**శంషాబాద్ మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ సుష్మారెడ్డి**

**ప్రతి పేదవాడు సంతోషంగా పండుగ జరుపుకోవాలనెదే ఆశారాం బాబా లక్ష్యం**

**యోగి వేదన్ సేవాసమితి ఉపాధ్యక్షులు బాలపురం జేసురాజు**

**శంషాబాద్ లోని ఆశారాం బాబా ఆశ్రమంలో జిహెచ్ఎంసి పారిశుధ్య కార్మికులకు ఉచితంగా బట్టలు, స్టీల్ పాత్ర పంపిణీ**

**పాల్గొన్న శంషాబాద్ మున్సిపల్ మాజీ చైర్పర్సన్ సుష్మారెడ్డి, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దూడల వెంకటేష్ గౌడ్, ఆశ్రమం నాయకులు**





రాజేంద్రనగర్, అక్టోబర్ 12 (ప్రజా జ్యోతి) పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని శంషాబాద్ మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ సుష్మా రెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ సర్కిల్ పరిధిలోని సంతు శ్రీ ఆశారాం బాబా ఆశ్రమంలో యోగి వేతన సేవాసమితి ఆధ్వర్యంలో సోమవారం శంషాబాద్ జిహెచ్ఎంసి సర్కిల్ పారిశుద్ధ కార్మికులకు ఉచితంగా బట్టలు స్టీల్ పాత్ర పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శంషాబాద్ మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ సుష్మా రెడ్డి, శంషాబాద్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దూడల వెంకటేష్ గౌడ్ పాల్గొని యోగి వేదన సేవాసమితి అధ్యక్షుడు ముత్యం సింగ్, ఉపాధ్యక్షుడు బాలాపూర్ జేసురాజు తో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిహెచ్ఎంసి పారిశుధ్య కార్మికులు నిత్యం ఉదయాన్నే లేచి నగరాన్ని ఎంతో అభివృద్ధి చేయడంలో వారి పాత్ర ఎంతో కీలకమైనది అన్నారు. వారి సేవలను ఎవరు మరువలేరన్నారు. అలాంటి వారికి ఆశ్రమం ద్వారా బట్టలు పంపిణీ చేయడం ఎంతో శుభ పరిణామం అన్నారు. ప్రతి ఒక్కరు దసరా పండుగను సంతోషంగా జరుపుకోవాలని అన్నారు ఈ కార్యక్రమం ఏర్పాటు చేసిన వారికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. యోగి వేదన్ సేవాసమితి ఉపాధ్యక్షులు బాలపురం జేసురాజు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సంతోషంగా పండుగను జరుపుకోవాలని ఉద్దేశంతో శ్రీ సంతు శ్రీ ఆశారాం బాబా ముఖ్య ఉద్దేశం అని అన్నారు. గత 25 సంవత్సరాలుగా ప్రతి దసరా దీపావళికి పేదవారికి ఉచితంగా బట్టలు పంపిణీ చేయడం ఆనవాయితీగా వస్తుంది అన్నారు. ప్రతి ఒక్కరూ అల్యూమినియం పాత్రలో వండుకొని తినడం వల్ల అనేక అనారోగ్యమైన జబ్బులు రావడం జరుగుతున్నాయి అన్నారు. దాన్ని దృష్టిలో ఉంచుకొని వారికి స్టీల్ పాత్రను పంపిణీ చేయడం జరిగిందన్నారు. ప్రతి సంవత్సరం నిరుపేదలకు ఆదివాసీలకు సేవ చేయడం జరిగిందని, ఈసారి జిహెచ్ఎంసి పారిశుద్ధ కార్మికులకు 198 మందికి ఈరోజు ఉచితంగా బట్టలు పంపిణీ చేయడం జరిగింది అన్నారు. పారిశుద్ధ కార్మికులు ఆనందంగా, ఆరోగ్యంగా ఉంటేనే నగరం ఎంతో అందంగా ఉంటుందన్నారు. వారి సేవలను గుర్తించి ఈరోజు వారిని సత్కరించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పారేపల్లి శ్రీనివాస్ గౌడ్, ఆశారాం బాబా ఆశ్రమానికి చెందిన నాయకులు జై సి రంజన్, అశ్విని, విజయ్, నవీన్, మనోజ్, ఉమేష్, శరత్చంద్ర తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ నుంచి బిఆర్ఎస్ లోకి ఎవరు వెళ్లలేదు

**కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎల్లారం శేఖర్ రెడ్డి వెల్లడి**

**బిఆర్ఎస్ లో అంతర్గత పోరు**

**మేకగూడ పిఎసిఎస్ చైర్మన్ అంబటి ప్రభాకర్**

**పెంజర్ల లో కాంగ్రెస్ పార్టీ పటిష్టంగా ఉంది**

**గ్రామ సర్పంచ్ ఎర్రోళ్ల జగన్**

**కొత్తూరులో మీడియా సమావేశంలో వెల్లడి**



**కొత్తూరు అక్టోబర్ 12 (ప్రజా జ్యోతి)** కాంగ్రెస్ పార్టీ నుంచి బిఆర్ఎస్ లో ఏ ఒక్కరు కూడా వెళ్లలేదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎల్లారం శేఖర్ రెడ్డి చెప్పారు.సోమవారం కొత్తూరు మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు.కాంగ్రెస్,బిజెపిల నుంచి 54 మంది బిఆర్ఎస్ లో చేరారని నిన్న కొన్ని వార్తాపత్రికల్లో వచ్చిందని చెప్పారు.అది శుద్ధ అబద్ధం అని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో కార్యకర్తలు అంతా సంతోషంగా ఉన్నారని ఎవరికీ ఏ ఇబ్బందులు లేవని చెప్పారు. తమ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కార్యకర్తలను కంటికి రెప్పలా చూసుకుంటున్నారని ఇతర పార్టీల్లో చేరాల్సిన అవసరం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు లేదని వివరించారు.బిఆర్ఎస్ పార్టీలో అంతర్గత పోరు

మేకగూడ పిఎసిఎస్ చైర్మన్ అంబటి ప్రభాకర్

షాద్నగర్ నియోజకవర్గంలో బిఆర్ఎస్ పార్టీలో అంతర్గత పోరు కొనసాగుతుందని పిఎసిఎస్ చైర్మన్ అంబటి ప్రభాకర్ అన్నారు.కేవలం అంజయ్య యాదవ్ వర్గంలోని బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి వర్గంలో చేరారు.తప్ప కాంగ్రెస్ నుంచి ఎవరు బిఆర్ఎస్ లో చేరలేదని ఆయన స్పష్టం చేశారు.వాళ్ల అంతర్గత సమస్యను తమ పార్టీపై రుద్దడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు.కాంగ్రెస్ పార్టీ వాళ్ళు ఎవరికీ బిఆర్ఎస్ లో చేరే అవసరం లేదన్నారు.పెంజర్ల లో కాంగ్రెస్ పార్టీ పటిష్టంగా ఉంది సర్పంచ్ ఎర్రోళ్ల జగన్ కాంగ్రెస్ పార్టీ పెంజర్ల లో పటిష్టంగా ఉందని ఆ గ్రామ సర్పంచ్ ఎర్రోళ్ల జగన్ స్పష్టం చేశారు.నిన్న బిఆర్ఎస్ కండువా కప్పుకున్న వారు ఎవరు కూడా కాంగ్రెస్లో లేరని వారు కేవలం బిఆర్ఎస్ పార్టీ వారు మాత్రం ఒక వర్గం నుంచి ఇంకొక వర్గంలో చేరారని జగన్ చెప్పారు.తమ గ్రామాభివృద్ధికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రత్యేకంగా కృషి చేస్తున్నారని తమ గ్రామం నుంచి ఎవరు కాంగ్రెస్ పార్టీ లీడర్ అని ఆయన వివరించారు. ఇప్పటికైనా వారి అంతర్గత విషయాన్ని కాంగ్రెస్ మీదకు రుద్దవద్దని సర్పంచ్ ఎర్రోళ్ల జగన్ చెప్పారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు దేశాల రమేష్,లింగారం సురేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# చట్టసభల్లో భట్రాజుల సత్తా చాటాలి!

**రాజకీయ, సామాజిక రంగాల్లో రాణిస్తూ ఐక్యతతో ముందుకు సాగాలి: బొల్లెపల్లి సీతారామరాజు**

**మేడ్చల్ జిల్లా భట్రాజు సంఘం ఆధ్వర్యంలో ఘనంగా ఆత్మీయ అభినందన సభ -- రాష్ట్రస్థాయి పదవులు చేపట్టిన ప్రతినిధులకు ఘన సన్మానం**





**కుత్బుల్లాపూర్ అక్టోబర్ 12 (ప్రజాజ్యోతి)** భట్రాజు సమాజం ఐక్యంగా ముందుకు సాగుతూ చట్టసభల్లో తమ గొంతుకను వినిపించాలని, రాజకీయ, సామాజిక రంగాల్లో సత్తా చాటాలని భట్రాజు సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి, రంగారెడ్డి జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు బొల్లెపల్లి సీతారామరాజు పిలుపునిచ్చారు. సమాజానికి ఉన్న విశిష్టమైన గుర్తింపును కాపాడుకుంటూ, ఐక్యతతో అభివృద్ధి పథంలో పయనించాలని ఆయన ఆకాంక్షించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సూరారంలోని కృషి ఉన్నత పాఠశాలలో ఆదివారం మేడ్చల్ జిల్లా భట్రాజు సంఘం (పశ్చిమ శాఖ) ఆధ్వర్యంలో ఆత్మీయ అభినందన, సన్మాన సభ ఘనంగా నిర్వహించారు. ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి ఎన్నికల్లో జిల్లా నుంచి రాష్ట్ర కార్యవర్గంలో వివిధ పదవులకు ఎన్నికైన, నియమితులైన ప్రతినిధులను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమానికి బొల్లెపల్లి సీతారామరాజుతో పాటు రాష్ట్ర సంఘం సహాధ్యక్షుడు వ్యాసభట్టు వెంకటరమణ రాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బొల్లెపల్లి సీతారామరాజు మాట్లాడుతూ.. భట్రాజు సమాజం పూర్వం నుంచి పండిత సమాజంగా విశిష్ట గుర్తింపును సంపాదించుకుందని పేర్కొన్నారు. ఆ ఘనమైన వారసత్వాన్ని భావితరాలకు అందించడంతో పాటు, సంఘ సభ్యులు అన్ని రంగాల్లో తమ ప్రతిభను చాటాలని సూచించారు. కులబంధువుల మధ్య ఐక్యత, పరస్పర సహకారం బలోపేతం కావాలని, రాజకీయాల్లోనూ సముచిత ప్రాతినిధ్యం సాధించే దిశగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. భట్రాజు సంఘానికి ప్రాధాన్యతనిస్తూ, సమాజ అభ్యున్నతికి కృషి చేసే ప్రభుత్వాలకు సంపూర్ణ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు.

సంఘ సేవకు గుర్తింపు.. రాష్ట్రస్థాయి బాధ్యతలు

గతంలో జిల్లా అధ్యక్షుడిగా సేవలందించి, తాజాగా రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నియమితులైన కూరపాటి కరుణాకర్ రాజు మాట్లాడుతూ.. గత రెండున్నర దశాబ్దాలుగా సంఘ బలోపేతానికి అంకితభావంతో కృషి చేస్తున్నానని తెలిపారు. తన సేవలను గుర్తించి రాష్ట్ర కార్యవర్గంలో కీలక బాధ్యతలు అప్పగించడం ఆనందంగా ఉందన్నారు. ఈ పదవి తనపై మరింత బాధ్యతను పెంచిందని, భట్రాజు సంఘ అభివృద్ధి, ఐక్యత, సంక్షేమం కోసం మరింత నిబద్ధతతో పనిచేస్తానని వెల్లడించారు.రాష్ట్ర కార్యవర్గంలో బాధ్యతలు చేపట్టిన ప్రతినిధులు రాష్ట్రస్థాయిలో వివిధ పదవులకు ఎన్నికైన, నియమితులైన వారిలో కూరపాటి కరుణాకర్ రాజు (రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు), సరికొండ శ్రీనివాసరాజు (కార్యదర్శి), చక్రాల రేవతి నంద్ (మ్యాగజైన్ కమిటీ వైస్ చైర్మన్), తంగెళ్ల రాధాకృష్ణ భట్ (జిల్లా--రాష్ట్ర సంబంధాల కమిటీ వైస్ చైర్మన్), సరస్వతి నరేందర్ రాజు (మీడియా సంబంధాల వైస్ చైర్మన్), శ్రీరామరాజు (కో-కన్వీనర్), తంగెళ్ల సుజాత (రాష్ట్ర మహిళా విభాగం ప్రచార కార్యదర్శి), బొల్లెపల్లి నాగరాజు (యువజన విభాగం ఉపాధ్యక్షుడు), తంగెళ్ల ప్రేమ్ సాయిభట్ (క్రీడల కమిటీ కార్యదర్శి) ఉన్నారు. వీరందరినీ సభలో ఘనంగా సన్మానించి, సంఘ నాయకులు, కులబంధువులు అభినందనలు తెలిపారు.సంఘ నాయకులు, మహిళా ప్రతినిధుల హాజరు ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి లోలభట్టు కృష్ణంరాజు, కార్యనిర్వాహక కార్యదర్శి పోరంకి శ్యాంప్రసాద్ రాజు, ఉపాధ్యక్షుడు ఊడుమూడి రాఘవరాజు, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు బల్ల కరుణాకర్ రాజు, కార్యదర్శి భల్లం మౌనిక సాయి, రంగారెడ్డి తూర్పు జిల్లా ఉపాధ్యక్షుడు కూరపాటి శ్యాంమోహన్ రాజు పాల్గొన్నారు. అలాగే సంఘ ప్రతినిధులు వి.వి.ఎల్. నరసింహరాజు, బాహటం కృష్ణార్జునరాజు, మోగసాటి సుధీర్ రాజు, భట్టు ప్రవీణ్ రాజు, పైడికొండల జనార్దన్ రాజు, సరస్వతి అశోక్ రాజు, వేమరాజు శేషంరాజు, దశరథ దురేందర్ రాజు తదితరులు హాజరయ్యారు. జిల్లా మహిళా అధ్యక్షురాలు ఏనుగుదాటి పరమేశ్వరి, ఉపాధ్యక్షురాలు కూరపాటి పద్మావతి, కోశాధికారి భల్లం ఉషారాణి, కార్యదర్శి వడాలి సీతతో పాటు పలువురు మహిళా ప్రతినిధులు పాల్గొన్నారు. ఐక్యత, సంఘటిత శక్తి, సమాజ అభ్యున్నతి లక్ష్యంగా సాగిన ఈ సభ ఉత్సాహభరిత వాతావరణంలో విజయవంతమైంది.

## ప్రజావాణి అర్జీలను వెంటనే పరిష్కరించాలి

**అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి**



**ఉప్పల్, అక్టోబర్ 12,(ప్రజాజ్యోతి):** ప్రజావాణి కార్యక్రమం లో ప్రజల నుండి వచ్చిన అర్జీలను ఏమాత్రం ఆలస్యం చేయకుండా నిబంధనల ప్రకారం వెంటనే పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరం లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో డిఆర్ఓ మాలతి తో కలిసి అదనపు కలెక్టర్ అర్జీదారుల నుండి వినతులను స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమం లో రెవెన్యూ, పంచాయతీ రాజ్, సివిల్ సప్లైస్, మున్సిపల్ తదితర శాఖలకు సంబంధించి మొత్తం 88 దరఖాస్తులు ప్రజల నుండి స్వీకరించినట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భం గా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన బాధితుల సమస్యలకు ప్రాధాన్యతనిచ్చి వేగంగా పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఆన్ లైన్ లో వెంట వెంట నమోదు చేయాలని సంబంధిత అధికారులకు అదనపు కలెక్టరు సూచించారు.సమావేశం లో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎల్‌నినో ఎఫెక్ట్.. ఆరుతడి పంటలే మేలు!

**రైతు నేస్తం కార్యక్రమంలో సీఎస్ సంజయ్ జాజూ సూచన**



**చేవెళ్ల అక్టోబర్ 12(ప్రజా జ్యోతి):** ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగ్గి, ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశాలున్న నేపథ్యంలో రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజూ సూచించారు. నీటి లభ్యతను బట్టి పంటలను ఎంపిక చేసుకోవాలని, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సాగు ప్రణాళికలు రూపొందించుకోవాలని తెలిపారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో ఆయన పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. తక్కువ నీరు.. మెరుగైన ఆదాయం అధిక నీరు అవసరమయ్యే వరి, చెరకు, పసుపు పంటలకు బదులుగా తక్కువ నీటితో సాగు చేయగల మొక్కజొన్న, జొన్న, కుసుమ, శనగ, ఇతర పప్పుధాన్యాల సాగుకు ప్రాధాన్యమివ్వాలని సీఎస్ సూచించారు. నీటి కొరతను దృష్టిలో పెట్టుకుని పంటల ఎంపిక చేసుకుంటే నష్టాలను తగ్గించుకోవచ్చని తెలిపారు. సరైన ప్రణాళికతో సాగు చేస్తే రైతులు మెరుగైన ఆదాయం పొందే అవకాశం ఉంటుందన్నారు. వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటిస్తూ రానున్న వానాకాలం సాగుకు ముందుగానే సిద్ధం కావాలని రైతులకు సూచించారు.ఈ కార్యక్రమంలో చేవెళ్ల రెవెన్యూ డివిజనల్ అధికారి పార్థసింహా రెడ్డి, వెటర్నరీ అసిస్టెంట్ ఆలూరు ప్రశాంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ అధికారులు, శంకర్ లాల్ వ్యవసాయ విస్తరణ అధికారులు, ఇతర శాఖల అధికారులు, గ్రామ ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## కమ్యూనిటీ భవన నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలి...: బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్



**కుత్బుల్లాపూర్ అక్టోబర్ 12(ప్రజా జ్యోతి )** 132 – జీడిమెట్ల డివిజన్ వెస్ట్ ఎం.ఎన్.రెడ్డి నగర్ లో బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ అధికారులతో కలిసి పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా అసంపూర్ణంగా నిలిచిపోయిన కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణ విషయంపై కాలనీవాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ....కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణ పనులను వెంటనే చేపట్టి పనులను త్వరితగతిన పూర్తి చేసి భవనాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు నాగేశ్వర్ రావు, చీఫ్ అడ్వైసర్ రాముడు యాదవ్, ఉపాధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి క్రిష్ణ పటేల్, కోశాధికారి రాజు, కాలనీ యూత్ అధ్యక్షులు రాజు యాదవ్, కాలనీ వాసులు మురళి, బస్వరాజు, శేఖర్ గౌడ్, నర్సింహ, క్రిష్ణ, స్థానిక బిఆర్ఎస్ నాయకులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# శంషాబాద్ లో రోడ్ల మరమ్మతులు, పొంగిపొర్లుతున్న డ్రైనేజీపై చర్యలు తీసుకోవాలి

**కొత్వాల్ గూడ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కొనమొల శ్రీనివాస్**

**శంషాబాద్ జిహెచ్ఎంసి జోనల్ కమిషనర్ చంద్రకళకు వినతి పత్రం అందజేసిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు**



రాజేంద్రనగర్, అక్టోబర్ 12 (ప్రజా జ్యోతి) శంషాబాద్ లో రోడ్ల మరమ్మతులు, పొంగిపొర్లుతున్న డ్రైనేజీపై చర్యలు తీసుకోవాలని కొత్వాల్ గూడ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కొనమొల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. కొత్వాల్ గూడ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కొనమొల శ్రీనివాస్ ఆద్వర్యంలో శంషాబాద్ జిహెచ్ఎంసి సర్కిల్ కొత్వాల్ గూడ డివిజన్ లోని శంషాబాద్ నుండి రాలగూడ వరకు చేపడుతున్న రోడ్డు విస్తరణతో డ్రైనేజీ పొంగిపొలుతున్న తీరు, కాలనీలో పేరుకుపోయిన చెత్తాచెదారం, డ్రైనేజీ రోడ్డు పైన పారుతున్న మురికి నీరు పై సోమవారం శంషాబాద్ జిహెచ్ఎంసి జోనల్ కమిషనర్ చంద్రకళకు వినతిపత్రం అందజేసిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా శంషాబాద్ నుండి రాళ్ల కూడా వరకు జరుగుతున్న రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా తవ్విన కారణంగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా ధ్వంసం అయిందని దీంతో రోడ్డుపై మురికి నీరు ఏరులై పారుతుంది అన్నారు. గతంలో ఎన్నోసార్లు అధికారులకు విన్నవించిన పట్టించుకోలేదు అన్నారు. ఇప్పటికైనా తక్షణమే అధికారులు స్పందించి డివిజన్లో పలు కాలనీలో పొంగిపొడుతున్న అందుగురించి పేరుకుపోయిన చెత్తాచెదారం రోడ్ల మరమ్మతులు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో బిఆర్ఎస్ పార్టీ పక్షాన పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

దీనిపై జోనల్ కమిషనర్ చంద్రకళ తక్షణమే అధికారులతో నివేదిక తెప్పించుకొని సమస్య లేకుండా చూస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ నాయకులు బుచ్చిరెడ్డి, జైసింహ, బైరమోని మల్లేష్, రాజేందర్, పరంధాములు, విజయ్ గౌడ్, హనుమంతు, సాగర్, మురళి గౌడ్, చరణ్, కార్తీక్, రమేష్, రాథోడ్, సుదర్శన్ గౌడ్, చంద్రశేఖర్, ప్రవీణ్ గౌడ్, మోహిన్, శివ, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

# నిజాంపేట్ సర్కిల్ ఫుడ్ సేఫ్టీ అధికారులు మొద్దు నిద్ర విడాలి.

**సిపిఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలాభిందెల శ్రీనివాస్.**




**కుత్బుల్లాపూర్ అక్టోబర్ 12(ప్రజా జ్యోతి )** నిజాంపేట్ సర్కిల్ పరిదిలో మటన్, చికెన్ షాపులు ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు చేయాలనీ సీపీఐ ఆధ్వర్యంలో నిజాంపేట్ సర్కిల్ ప్రజావానిలో పిర్యాదు చేయడం జరిగింది. అనంతరం సీపీఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలాభిందెల శ్రీనివాస్ మాట్లాడుతూ నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని మటన్, చికెన్ ఆదివారం మిగిలిన మాంసాన్ని ఫ్రిజ్ లో పెట్టి తిరిగి సోమవారం రోజు షాప్ వారు అమ్ముతున్నారు అని స్థానిక ప్రజలు తెలియజేశారు అని కనుక వెంటనే ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీ నిర్వహించి ప్రజల ఆరోగ్యం మీద ప్రభావం పడకుండా చూడాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున నిరసన నిర్వహిస్తాము అని వారు గుర్తు చేశారు. ఈ కార్యక్రమం సీపీఐ నాయకులు ఆశి. యాదయ్య, పొన్నాకంటే దస్తగిరి, కాట్రగడ్డ వాసు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయండి





**ఎంఎంసీ కమిషనర్‌ను కోరిన ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ పరమేశ్వర్‌రెడ్డి**

**ఉప్పల్,అక్టోబర్ 12, ( ప్రజా జ్యోతి ):** ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గం లో అభివృద్ధి పనుల కు నిధులు మంజూరు చేయాలని నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ మందుముల పరమేశ్వర్‌రెడ్డి కోరారు. సోమవారం మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డిని పరమేశ్వర్‌రెడ్డి కలిసి అభివృద్ధి పనులపై చర్చించారు. ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని ఉప్పల్, కాప్రా, నాచారం సర్కిళ్ల పరిధిలో కొన్ని ముఖ్యమైన అభివృద్ధి పనులను తక్షణమే చేపట్టాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా పరమేశ్వర్‌రెడ్డి గుర్తు చేశారు. పలు ప్రాంతాల్లో సరైన రహదారులు లేవని, అవసరమైన చోట్ల కమ్యూనిటీ హాళ్లు కూడా లేవన్నారు. ప్రస్తుతం ఉన్న రహదారులు చాలా కాలంగా నిర్మించక పోవడం వల్ల దెబ్బతినడంతో స్థానికులు చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వీటిపై కమిషనర్ సానుకూలంగా స్పందించినట్టుగా పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు.

ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల వివరాలు

**వంపుగూడ డివిజన్-**

సాయిరాంనగర్, గోపాల్‌రెడ్డి నగర్ ప్రాంతాల్లోని అంతర్గత వీధుల్లో సీసీ రోడ్ల నిర్మాణం.

శాలివాహన, వంపుగూడ ప్రాంతాల్లోని అంతర్గత వీధుల్లో సీసీ రోడ్ల నిర్మాణం.

మైత్రి కాలనీలోని పొడిగింపు వీధుల్లో సీసీ రోడ్ల నిర్మాణం.

కాప్రా డివిజన్-నిర్మల్ నగర్, సిద్ధి కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణం.

సాయిపురి కాలనీ, గాంధీ నగర్‌లోని అంతర్గత వీధుల్లో సీసీ రోడ్ల నిర్మాణం.

వినాయక్ నగర్ ఫేజ్--1, ఫేజ్--2, వెంకటాద్రి కాలనీలోని అంతర్గత వీధుల్లో సీసీ రోడ్ల నిర్మాణం.

వినాయక్ నగర్ ఫేజ్--2లోని ఉషోదయ సూపర్ మార్కెట్ ఎదురుగా సీసీ రోడ్ల నిర్మాణం.

ఏ.ఎస్.రావు నగర్ డివిజన్

జీఆర్ రెడ్డి నగర్‌లో ప్లాట్ నంబర్ 92 నుంచి హనుమాన్ ఆలయం వరకు సీసీ రోడ్ల నిర్మాణం,

బకాసుర హోటల్ ఎదురుగా ప్లాట్ నంబర్ 127 నుంచి వాటర్ ట్యాంక్ సమీపంలోని మహేశ్ నగర్ బై లేన్ల వరకు సీసీ రోడ్ల నిర్మాణం.

భవానీ నగర్ కమ్యూనిటీ హాల్ నుంచి షటిల్ కోర్టు వరకు సీసీ రోడ్ల నిర్మాణం.

బీరప్పగడ్డ డివిజన్

సీతారామ కాలనీలో ఇంటి నంబర్ 2-19-59/194 నుంచి 2-19-59/206 వరకు సీసీ రోడ్ల నిర్మాణం.

బీరప్పగడ్డ నుంచి కలనీలయం క్లాత్ స్టోర్ లేన్ వరకు సీసీ రోడ్ల నిర్మాణం.

రాఘవేంద్ర కాలనీ రోడ్ నంబర్లు 1, 2, 3 మరియు హైకోర్టు కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణం.

హబ్సిగూడ డివిజన్

కాకతీయ నగర్, స్ట్రీట్ నంబర్ 2, జేఎస్ఎం కాలనీ ఈస్ట్ జంక్షన్ రోడ్డులో సీసీ రోడ్ల నిర్మాణం.

ఈ కార్యక్రమం లో మాజీ కార్పొరేటర్లు బొంతు శ్రీదేవి స్వర్ణరాజ్ శివమణి,పావని రెడ్డి డివిజన్ అధ్యక్షులు కంది శ్రవణ్ రెడ్డి,శ్రీహరి,టిల్లు యాదవ్,విఠల్ నాయక్ నాగరాజు,బాబు రావు నాగశేషు,మల్లారెడ్డి,కిషోర్ మల్లికార్జున్,తదితరులు పాల్గొన్నారు,

# ముస్లిం మైనారిటీ గ్రేవీ యార్డ్ లోనీ సీవరేజ్ పైప్ లైన్ నీ వెంటనే మరమ్మత్తు చేయండి

**బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్**



**ఉప్పల్,అక్టోబర్ 12, ( ప్రజాజ్యోతి ):** చిలుకానగర్ డివిజన్లోని ముస్లిం మైనారిటీ గ్రేవ్ యార్డ్ లోనీ సీవరేజ్ పైప్ లైన్ నీ వెంటనే మరమ్మత్తు చేయించాలని బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో కబరస్థాన్ కమిటీ అధ్యక్షులు అబ్బో భాయ్ వారి కమిటీ సభ్యులు తో కలిసి ప్రజావాణి లో ఎస్ సి రమేష్ బాబు కి అదేవిధంగా వాటర్ వర్క్స్ జీఎం సంతోష కు వినతిపత్రం ఇవ్వడం జరిగింది. అనంతరం ప్రవీణ్ ముదిరాజ్ వారితో మాట్లాడుతూ ముస్లిం గ్రేవి యార్డ్ లోని సీవరేజ్ పైప్ లైన్ డామేజ్ అయ్యి డ్రైనేజ్ మురికి నీటితో గ్రేవ్ యార్డ్ మొత్తం బురద మయంగా మారిందని ఎవరైనా చనిపోతే శవాన్ని పూడ్చి పెట్టడానికి కూడా చాలా ఇబ్బందికరంగా ఉందని వెంటనే డ్రైనేజీ పైప్లైన్ మరమ్మత్తు చేయాల్సిందిగా కోరడం జరిగింది. ఎస్సీరమేష్ బాబు జిఎం సంతోష్ సానుకూలంగా స్పందించి వెంటనే మరమ్మతుకు కావలసిన ప్రతిపాదనలు తయారు చేసి యుద్ధ ప్రాతి పదికను సీవరేజ్ పైపులన్నీ మరమ్మతులు చేపడతామని హామీ ఇవ్వడం జరిగింది. అదేవిధంగా జీఎం వాటర్ వర్క్స్ సంతోష్ మేనేజర్ కిష్టయ్య ని వెంటనే స్పాట్ పైకి పంపించి కావలసిన పైప్ లైన్ కు ప్రతిపాదనలు తయారు చేయాల్సిందిగా ఆదేశించడం జరిగింది. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఎద్దుల కొండల్ రెడ్డి, జల్లి మోహన్ మాస శేఖర్, మైనారిటీ కమిటీ సభ్యులు అల్తాఫ్, హనీఫ్,షఫీ, బిల్డర్ హనీఫ్, మహమ్మద్, ఫరీద్,బాబా,నజీర్, ఇర్ఫాన్, సద్దాం, అలీ, జలీల్, అబ్దుల్, తాహిర్, మొదలగు వారు పాల్గొన్నారు,

# నీటి సమస్యల పరిష్కారం, కొత్త పైప్‌లైన్ ఏర్పాటు అంశాలపై చర్చ

**ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**



**ఉప్పల్, అక్టోబర్ 12, ( ప్రజాజ్యోతి ):** ఉప్పల్ నియోజకవర్గ పరిధిలో నెలకొన్న నీటి సమస్యల పరిష్కారం, ప్రజలకు మెరుగైన తాగునీటి సరఫరా అందించడం తో పాటు కొత్త పైప్‌లైన్‌ల ఏర్పాటు అంశాలపై ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సంబంధిత అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా జలమండలి ఈడీ పంకజ , జీఎం సంతోష్ ని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కలిసి నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లోఎదురవుతున్న నీటి సరఫరా సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నీటి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి అవసరమైన ప్రాంతాల్లో కొత్త పైప్‌లైన్‌ల ఏర్పాటు కోసం తగిన చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు. ప్రజలకు నిరంతరాయంగా, సక్రమంగా తాగునీరు అందించేలా సంబంధిత అధికారులు సమన్వయం తో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. నియోజకవర్గ ప్రజల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

# వట్టినాగులపల్లి, గౌలిదొడ్డిలో తడి చెత్త, పొడి చెత్త పై అవగాహన

**నో బిన్ -- నో ట్రేడ్ అంశంపై వ్యాపారస్తులకు సూచనలు**

**వ్యాపార సముదాయాలలో రెండు డస్ట్ బిన్నులు తప్పనిసరి**

**పరిసరాలు పరిశుభ్రంగా ఉండేందుకు వ్యాపారస్తులు సహకరించాలి**

**నార్సింగి సర్కిల్ సానిటేషన్ ఇన్స్పెక్టర్ లచ్చిరాం**




**రాజేంద్రనగర్, అక్టోబర్ 12 (ప్రజా జ్యోతి)** పరిసరాలు పరిశుభ్రంగా ఉండేందుకు వ్యాపారస్తులు సహకరించాలని నార్సింగి సర్కిల్ సానిటేషన్ ఇన్స్పెక్టర్ లచ్చిరాం కోరారు. సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ రాజేంద్రనగర్ నియోజకవర్గం నార్సింగి సర్కిల్ పరిధిలోని వార్డు నం. 126, వట్టినాగులపల్లి, గౌలిదొడ్డిలో వ్యాపారస్తులకు తడి చెత్త, పొడి చెత్త మరియు హానికర చెత్త వేర్వేరుగా సేకరించడం, నిర్వహించడంపై ఆదివారం నార్సింగ్ సర్కిల్ సానిటేషన్ ఇన్స్పెక్టర్ లచ్చిరాం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నో బిన్ -- నో ట్రేడ్ అంశంపై వ్యాపారస్తులకు అవగాహన కల్పిస్తూ, ప్రతి వ్యాపార సంస్థలో తడి చెత్త, పొడి చెత్త కోసం రెండు ప్రత్యేక బిన్నులు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు వ్యాపారస్తులు మున్సిపల్ సిబ్బందికి సహకరించి, చెత్తను మూలస్థాయిలోనే వేరు చేసి అందించాలని అధికారులు కోరారు.

# ఎంఎంసీ కమిషనర్ వినయ్ కృష్ణ రెడ్డి కి వినతిపత్రం

**హబ్సీగూడ రోడ్ నంబర్ 2లోని కాకతీయ నగర్, జె ఎస్ ఎన్ కాలనీ ఈస్ట్ లో కొత్త రోడ్లు మంజూరు చేయాలని వినతి**

**మందుముల పరమేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎంఎంసీ కార్యాలయం లో కమిషనర్ ను కలిసి వినతిపత్రం అందజేసిన కంది శ్రవణ్ కుమార్ రెడ్డి**

**సానుకూలంగా స్పందించిన కమిషనర్ గారు.. త్వరలోనే పనులు చేపడుతామని హామీ**

**ఉప్పల్,అక్టోబర్ 12,( ప్రజాజ్యోతి ):** హబ్సీగూడ డివిజన్ కాకతీయ నగర్, జే ఎస్ ఎన్ కాలనీ వాసులు ఏళ్లుగా అనుభవిస్తున్న రోడ్డు సమస్య కు త్వరలోనే శాశ్వత పరిష్కారం లభించనుంది. కాలనీ వాసుల సమస్యను ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి దృష్టికి హబ్సీగూడ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ కంది శ్రవణ్ కుమార్ రెడ్డి తీసుకెళ్లడంతో ఆయన ఆధ్వర్యంలో నేడు ఎంఎంసీ కార్యాలయంలో కమిషనర్ వినయ్ కృష్ణ రెడ్డి ని కలవడం జరిగింది. రోడ్ల మరమ్మతులకు సంబంధించి నిధులు మంజూరు చేయాలని కోరుతూ ఎంఎంసీ కమిషనర్ వినయ్ కృష్ణ రెడ్డి కి వినతి పత్రం అందజేశారు. సానుకూలం గా స్పందించిన కమిషనర్ పరిశీలించి త్వరలోనే నిధులు మంజూరు చేసి, టెండర్ల ప్రక్రియ ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా తమ కాలనీ సమస్య పరిష్కారానికి కృషి చేసిన మందుముల పరమేశ్వర్ రెడ్డి కి, డివిజన్ ప్రెసిడెంట్ కంది శ్రవణ్ కుమార్ రెడ్డి కి కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉప్పల్ ఏ బ్లాక్ ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ చింతల బాబురావు తో పాటు హబ్సీగూడ నేతలు హాజరయ్యారు.



# కొత్వాల్ గూడ డివిజన్ బిఆర్ఎస్వి అధ్యక్షుడిగా కనకటి శివ నియామకం

**విద్యార్థులకు అండగా ఉండి వారి హక్కుల సాధనకై కృషి చేయాలి**

**కొత్వాల్ గూడ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కొనమొల శ్రీనివాస్**

**డివిజన్ బిఆర్వీస్ నూతన కమిటీకి నియామక పత్రాలు అందజేసిన కొత్వాల్ గూడ డివిజన్ అధ్యక్షుడు కొనమొల శ్రీనివాస్**



**రాజేంద్రనగర్, అక్టోబర్ 12 (ప్రజా జ్యోతి)** విద్యార్థులకు అండగా ఉండి వారి హక్కుల సాధనకై కృషి చేయాలని కొత్వాల్ గూడ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కొనమొల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గ్రేటర్ హైదరాబాద్ శంషాబాద్ సర్కిల్ కొత్వాల్ గూడ డివిజన్ బిఆర్ఎస్వి డివిజన్ కమిటీని కొత్వాల్ గూడ డివిజన్ పార్టీ అధ్యక్షుడు కొనమొల శ్రీనివాస్ ఆదివారం శంషాబాద్ లోని డివిజన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నియమించారు. డివిజన్ విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా కనకటి శివ,ప్రదాన కార్యదర్శిగా అమీర్ పేట్ చరణ్ దీప్,ఉపాధ్యక్షులుగా గొడుగు శ్యామ్ ప్రసాద్, అంతారం చరణ్,కార్యదర్శిగా సుశాంత్ లను ఏకగ్రీవంగా ఎన్నుకొని నియమించి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల పట్ల చేస్తున్న వ్యతిరేక కార్యక్రమాలను విద్యార్థులకు వివరించి వారికి అండగా నిలవాలని అన్నారు.ఇప్పటివరకు ప్రభుత్వం జీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్ లను బకాయిలను విడుదల చేయలేదని దానిపై పోరాడాలని సూచించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్వి డివిజన్ నూతన అధ్యక్షుడు కనకటి శివ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా ప్రకటించినందుకు ప్రతి ఒక్కరికి పేరుపేరునా ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నాను అన్నారు. నిరంతరం విద్యార్థుల సమస్య కొరకు విద్యార్థులకు అండగా ఉండి పోరాడుతానన్నారు. ప్రభుత్వం విడుదల చేయాల్సిన ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్ల బకాయిలు విడుదల చేసే వరకు టిఆర్ఎస్వి తరపున పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు బుచ్చిరెడ్డి, జయసింహ, మల్లేష్ బైరమోని, రాజేందర్, పరంధాములు, విజయ్ గౌడ్,రాచమల్ల హనుమంతు,సాగర్,మురళి గౌడ్, చరణ్, కార్తీక్, రమేష్ రాథోడ్, సుదర్శన్ గౌడ్, చంద్రశేఖర్, ప్రవీణ్ గౌడ్, మోషిన్, శివ, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

# అన్నరాయుని చెరువు కాలుష్య సమస్యను పరిష్కరించాలి







**మాజీ మంత్రి ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డికి వినతి పత్రం అందజేసిన మాజీ కౌన్సిలర్ అనిత సుధాకర్ రెడ్డి**

**కీసర/అక్టోబర్ /12 ప్రజా జ్యోతి** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఘట్కేసర్ సర్కిల్, నాగారం డివిజన్లో ఉన్న అన్నరాయుని చెరువు ఎగువ ప్రాంతాల నుంచి వచ్చి చేరుతున్న మురుగు నీటితో తీవ్రంగా కలుషితమైందని, చెరువును కాలుష్య కోరల నుంచి కాపాడి పునరుజ్జీవింపజేయాలని మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ప్రభుత్వ అధికారులను కోరారు.
చెరువు కాలుష్య సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిసర కాలనీల ప్రజలు స్థానిక మాజీ కౌన్సిలర్ కొమిరెల్లి అనిత సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మల్లారెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. సమస్య తీవ్రతను తెలుసుకున్న ఆయన తక్షణమే స్పందించి, అన్నరాయుని చెరువును కాలుష్యం నుంచి కాపాడేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని హైడ్రా కమిషనర్కు విజ్ఞప్తి చేశారు.ఎగువ ప్రాంతాల నుంచి చెరువులోకి చేరుతున్న మురుగు నీటిని అడ్డుకునేందుకు ప్రత్యేక ఫీడర్ కెనాల్ ఏర్పాటు చేసి, మురుగు నీటిని చెరువులోకి రాకుండా మళ్లించాలని వినతిపత్రంలో కోరారు. అలాగే చెరువులో పేరుకుపోయిన గుర్రపు డెక్కను తొలగించడంతో పాటు పూడిక తీయించి, చెరువు నీటి నాణ్యతను మెరుగుపరిచేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. చెరువు పరిసరాలను సుందరీకరించి, అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండేలా అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు.
ఎమ్మెల్యే ఆదేశాల మేరకు మాజీ కౌన్సిలర్ కొమిరెల్లి అనిత సుధాకర్ రెడ్డి కూడా ఇదే సమస్యపై మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్తో పాటు హైడ్రా కమిషనర్కు వినతిపత్రాలు సమర్పించారు. అన్నరాయుని చెరువును పరిరక్షించి, పరిసర ప్రాంతాల ప్రజలకు కాలుష్య సమస్య నుంచి ఉపశమనం కల్పించేలా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో కొమిరెల్లి సుధాకర్ రెడ్డి, కమ్మంపాటి యాకయ్య, పంజాల నర్సింహా గౌడ్, పంగ చంద్రయ్య, అబ్బోజు రాంసుదాకర్, విశాల్ తదితరులు పాల్గొన్నారు.

# రూ.20 లక్షల కోసం ఐదేళ్ల చిన్నారి దారుణ హత్య

**కౌకూర్లో కలకలం.. నీటి సంపులో చిన్నారి మృతదేహం**

**మాజీ వాచ్మెన్ విక్రమ్ అరెస్ట్: మల్కాజిగిరి సీపీ సుమతి**

**బోయిన్ పల్లి, అక్టోబర్ 12 (ప్రజాజ్యోతి):** రూ.20 లక్షల డబ్బు కోసం ఐదేళ్ల చిన్నారిని కిడ్నాప్ చేసి దారుణంగా హత్య చేసిన కేసును మల్కాజిగిరి పోలీసులు ఛేదించారు. ఈ కేసులో బిహార్కు చెందిన మాజీ వాచ్మెన్ విక్రమ్ను అరెస్టు చేసి రిమాండ్కు తరలించినట్లు మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ సుమతి వెల్లడించారు. బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలోని కౌకూర్ విల్లా ఆర్కిడ్స్ కమ్యూనిటీలో శనివారం ఈ ఘటన చోటుచేసుకుంది.

**ఉద్యోగం నుంచి తొలగించడంతో కుట్ర?**

పోలీసుల వివరాల ప్రకారం.. నిందితుడు విక్రమ్ గతంలో అదే కమ్యూనిటీలో వాచ్మెన్గా పనిచేశాడు. ఇటీవల విల్లా నిర్వాహకులు అతడిని ఉద్యోగం నుంచి తొలగించారు. ఈ క్రమంలో డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో చిన్నారిని కిడ్నాప్ చేసి, ఆమె తల్లిదండ్రుల నుంచి రూ.20 లక్షలు వసూలు చేయాలని పథకం వేసినట్లు పోలీసులు తెలిపారు.

**నీటి సంపులో మృతదేహం**

అక్టోబర్ 10న చిన్నారి అదృశ్యమైనట్లు ఫిర్యాదు అందడంతో బొల్లారం పోలీసులు కేసు నమోదు చేసి గాలింపు చేపట్టారు. పది ప్రత్యేక బృందాలతో కమ్యూనిటీ పరిసరాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో క్లబ్హౌస్ సెల్లార్లోని నీటి సంపులో చిన్నారి మృతదేహాన్ని గుర్తించారు. చిన్నారి కాళ్లు, చేతులు కట్టేసి నీటి సంపులో పడేసినట్లు పోలీస్ కమిషనర్ వెల్లడించారు.

**24 గంటల్లో నిందితుడి అరెస్ట్**

సీసీటీవీ ఫుటేజీ, ఫోన్ కాల్ వివరాలు, ఇతర సాంకేతిక ఆధారాల ఆధారంగా దర్యాప్తు వేగవంతం చేసిన పోలీసులు, మాజీ వాచ్మెన్ విక్రమ్ను అక్టోబర్ 11న అదుపులోకి తీసుకున్నారు. విచారణలో రూ.20 లక్షల కోసం చిన్నారిని అపహరించి హత్య చేసినట్లు నిందితుడు అంగీకరించాడని పోలీసులు తెలిపారు. కేసును వేగంగా ఛేదించిన పోలీసు బృందాన్ని ఉన్నతాధికారులు అభినందించారు.

**భద్రతా చర్యలు తప్పనిసరి**

గేటెడ్ కమ్యూనిటీల్లో వాచ్మెన్లు, సెక్యూరిటీ సిబ్బంది, ఇంటి పనివారిని నియమించుకునే ముందు వారి పూర్తి వివరాలను ధ్రువీకరించుకోవాలని పోలీసులు సూచించారు. 'మీ సురక్ష', 'నేను సైతం 2.0' కార్యక్రమాల్లో భాగస్వాములై సీసీటీవీ నిఘాను పటిష్ఠం చేసుకోవాలని నివాస సంక్షేమ సంఘాలకు పిలుపునిచ్చారు.

# అధికారంలో ఉన్న లేకున్నా డివిజన్ అభివృద్ధికి కృషి

**హయత్ నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి**

**కాలనీ అభివృద్ధికి సహకరించాలని హనుమాన్ నగర్ వాసుల విజ్ఞప్తి**



**అబ్దుల్లాపూర్ మెట్టు/ అక్టోబర్ 12 (ప్రజా జ్యోతి)** డివిజన్ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న నాయకులను హనుమాన్ నగర్ కాలనీవాసులు ఘనంగా సన్మానించారు. హయత్నగర్ డివిజన్లోని హనుమాన్ నగర్ కాలనీవాసుల ఆహ్వానం మేరకు కాలనీలో పర్యటించిన మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు గంగాని శ్రీనివాస్లను కాలనీవాసులు శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు.గత ఐదేళ్లుగా కాలనీ అభివృద్ధికి కళ్లెం నవజీవన్ రెడ్డి విశేష కృషి చేశారని, ప్రజలకు అందుబాటులో ఉంటూ పలు సేవలు అందించారని కాలనీవాసులు పేర్కొన్నారు. ప్రజలతో మమేకమై వారి సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతున్న నాయకులను ఈ సందర్భంగా అభినందించారు.

**పెండింగ్ పనులు పూర్తి చేయాలని విజ్ఞప్తి**

కాలనీలో ఇంకా పెండింగ్లో ఉన్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను చేపట్టడంతో పాటు పార్కు అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయడానికి కృషి చేయాలని కాలనీవాసులు కళ్లెం నవజీవన్ రెడ్డిని కోరారు.దీనిపై ఆయన సానుకూలంగా స్పందిస్తూ.. అధికారంలో ఉన్నా, లేకున్నా ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయడమే తన లక్ష్యమని తెలిపారు. హయత్నగర్ డివిజన్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని, కాలనీవాసుల సమస్యల పరిష్కారానికి తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు గంగాని శ్రీనివాస్, కాలనీ అధ్యక్షుడు విఠల్, కార్యదర్శి వెంకటేశం, ఉపాధ్యక్షుడు భాషని, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## దసరా నవరాత్రులు 2వ రోజు వేడుకలు



**కుత్బుల్లాపూర్ అక్టోబర్ 12(ప్రజా జ్యోతి )** ఆలయ ధర్మకర్త శ్రీ కొలన్ శ్రీనివాస్ రెడ్డి , లీడర్ కొలన్ నరసింహారెడ్డి ఆధ్వర్యంలో విజయోత్సవంతో ప్రారంభమైన విజయ దశమి మహోత్సవాలలో భాగంగా ఈ రోజున 2వ రోజు అమ్మవారు కుమారి అమ్మవారి అలంకారంలో నవ్వుతూ చిరుదరహాసంతో అనుగ్రహిస్తుంది. అమ్మవారిని దర్శించుకుంటే కన్నె పిల్లలందరికీ కూడా చక్కని భర్త లభించాలని వివాహం కానీ పురుషులకు మంచి భార్య రావాలని అమ్మవారిని వేడుకుంటే వివాహం జరుగుతుంది. మంచి కుటుంబంలోకి వెళ్తారు. కావున ఆలయ ధర్మకర్త కొలన్ శ్రీనివాస్ రెడ్డి మరియు నిజాంపేట్ ప్రగతి నగర్ 276 డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వెంకటేశ్వర రెడ్డి (తాతిరెడ్డి) అమ్మవారిని దర్శించుకుని. అందరికీ మంచి జరగాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో మౌలేశ్వర రావు, మధుసూదన్ రెడ్డి, కొలన్ లక్ష్మారెడ్డి, ఏలూరి సత్య (నాని), మేడ శ్రీనివాసరావు, సురేంద్ర కుమార్ యాదవ్, సాంబశివరావు, మహేష్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, ఆదిరెడ్డి, బాలకృష్ణ, మహేష్ యాదవ్ మరియు నిజాంపేట్ పెద్దలు గ్రామస్తులు మరియు భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం --- మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్



**కుత్బుల్లాపూర్ అక్టోబర్ 12(ప్రజా జ్యోతి )** షాపూర్నగర్లోని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ నివాస కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, సంక్షేమ సంఘాల సభ్యులు, కార్యకర్తలు మర్యాదపూర్వకంగా ఆయనను కలిశారు. ఈ సందర్భంగా దేవి శరన్నవరాత్రి వేడుకల పూజా కార్యక్రమాలకు హాజరు కావాల్సిందిగా ఆహ్వానించారు. అలాగే నియోజకవర్గంలోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రాలు సమర్పించారు. నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారం, అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ తెలిపారు.

## సీఎస్ఆర్ కాలనీలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన.. కమ్యూనిటీ హాల్ ప్రారంభం

**ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవి రెడ్డి సుధీర్ రెడ్డి**



**ఎల్బీనగర్ అక్టోబర్ 12 (ప్రజా జ్యోతి)** మన్సూరాబాద్ లెక్చరర్స్ కాలనీ డివిజన్ పరిధిలోని సీఎస్ఆర్ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్రెడ్డి శంకుస్థాపన చేశారు. నూతనంగా నిర్మించిన కాలనీ కమ్యూనిటీ హాల్ను ప్రారంభించారు.
కమ్యూనిటీ హాల్ కోసం స్థలాన్ని దానం చేసిన చంద్రశేఖర్ను, సొంత నిధులతో భవనాన్ని నిర్మించుకున్న కాలనీ వాసులను అభినందించారు. కాలనీలో మిగిలిన డ్రైనేజీ, తాగునీరు, సీసీ రోడ్ల పనులను త్వరగా పూర్తి చేయాలని నివాసులు కోరగా, అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జక్కిడి రఘువీర్ రెడ్డి మహిళా నాయకురాలు మల్లీశ్వరి, ఉద్యమకారుడు వెంకటరెడ్డి, నాయకులు చంద్రారెడ్డి, అనిల్కుమార్, కేకేఎల్ గౌడ్, నాగార్జున, కాలనీ అధ్యక్షుడు రజనీకాంత్, గౌరవ అధ్యక్షుడు సత్తిపండు, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, నివాసులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో ప్రజా సమస్యల పరిష్కారానికి వినతి పత్రం



**కుత్బుల్లాపూర్ అక్టోబర్ 12(ప్రజా జ్యోతి )** కుత్బుల్లాపూర్ హ్యాట్రిక్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ ఎల్పీ విప్ కేపీ. వివేకానంద్ సూచనల మేరకు, 125 -- గాజులరామారం డివిజన్ బీఆర్ఎస్ నాయకులు తెలంగాణ సాయి మరియు కస్తూరి బాలరాజు ప్రజావాణి కార్యక్రమంలో జోనల్ కమిషనర్ కలిసి, డివిజన్ పరిధిలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులకు సంబంధించి వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, డ్రైనేజీ సమస్యల పరిష్కారం, రహదారుల అభివృద్ధి, పార్కుల పరిరక్షణ తదితర అంశాలపై అధికారుల దృష్టికి తీసుకెళ్లి, క్రింది పనులను త్వరితగతిన చేపట్టాలని కోరారు. ప్రతిపాదించిన అభివృద్ధి పనులు:మహదేవపురం: ఎస్ బ్లాక్, ఎక్స్ బ్లాక్, జె బ్లాక్లలో డ్రైనేజీ లైన్లు, హెచ్ఎండబ్ల్యూఎస్ నీటి సరఫరా పైప్లైన్లు మరియు సీసీ రోడ్ల నిర్మాణం.మల్లారెడ్డి నగర్ ఫేజ్-1: డ్రైనేజీ లైన్ల ఏర్పాటు మరియు సీసీ రోడ్ల నిర్మాణ పనులు.మహదేవపురం:మాంట్రిడ్జ్ స్కూల్ సమీపంలోని పార్కు వెనుక భాగంలో రిటైనింగ్ వాల్ నిర్మాణం మల్లారెడ్డి నగర్ 60 అడుగుల రోడ్డు:

# విద్యార్థినులకు న్యాయం చేయాలి

బిమోల్ అంగోమ్నును కాంగ్రెస్ నుంచి సస్పెండ్ చేయాలి

చేవెళ్లలో బీజేపీ మహిళా మోర్చా నిరసన

రాహుల్ గాంధీ, బిమోల్ అంగోమ్మా దిష్టిబొమ్మల దహనం



**చేవెళ్ల, అక్టోబరు 12(ప్రజా జ్యోతి):** విద్యార్థినులపై లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న బిమోల్ అంగోమ్మాపై నిష్పక్షపాత విచారణ జరిపి విద్యార్థినిలకు న్యాయం చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఆయనను కాంగ్రెస్ నుంచి సస్పెండ్ చేయడంతోపాటు ఎంపీ పదవికి రాజీనామా చేయాలని కోరారు. ఈ మేరకు సోమవారం చేవెళ్ల మున్సిపల్ చౌరస్తాలో బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో నిరసన చేపట్టి, రాహుల్ గాంధీ, బిమోల్ అంగోమ్మా దిష్టిబొమ్మలను దహనం చేశారు. బిమోల్ అంగోమ్మాపై 11 మంది విద్యార్థినులను వేధించినట్లు ఆరోపణలు ఉన్నాయని నాయకులు పేర్కొన్నారు. మహిళల భద్రత విషయంలో నిర్లక్ష్యం తగదని, ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని మహిళల గౌరవం భద్రత విషయంలో నిర్లక్ష్యానికి తావివ్వరాదని ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కె.ఎస్. రత్నం కోరారు. విద్యాసంస్థల్లో విద్యార్థినులకు సురక్షిత వాతావరణం కల్పించాలని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి స్వర్ణలత రెడ్డి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు పడమటి మమత రెడ్డి డిమాండ్ చేశారు. మహిళల భద్రత విషయంలో కాంగ్రెస్ అందువ వైఖరిని విడనాడాలని పేర్కొన్నారు. ఈ నిరసనలో బీజేపీ చేవెళ్ల మున్సిపల్ అధ్యక్షుడు అత్తెల్లి అనంత్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీశైలం యాదవ్, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ వైభవ్ రెడ్డి, సీనియర్ నాయకులు ఆంజనేయులు గౌడ్, కుంచం శ్రీనివాస్, శర్వలింగం, వెంకట్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, మోహన్ రెడ్డి, మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఉమా, కౌన్సిలర్ మనీషా అనంత్ రెడ్డి, మీనాక్షి సత్యనారాయణ, మున్సిపల్ ప్రధాన కార్యదర్శి పత్తి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు పీసరి శ్రీకాంత్ రెడ్డి, నాగరాజు గౌడ్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతిక

మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

శంషాబాద్ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కొలన్ ప్రదీప్ రెడ్డి ఆధ్వర్యంలో శంషాబాద్ లో బతకమ్మ సంబరాలు పాల్గొన్న మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సునీత లక్ష్మారెడ్డి, మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మ దేవేందర్ రెడ్డి





రాజేంద్రనగర్, అక్టోబర్ 12 (ప్రజా జ్యోతి) తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతిక అని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. శంషాబాద్ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కొలన్ ప్రదీప్ రెడ్డి ఆద్వర్యంలో రంగారెడ్డి జిల్లా శంషాబాద్ లోని ప్రభుత్వ కళాశాల మైదానంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సునీత లక్ష్మారెడ్డి, మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి లు పాల్గొని బతుకమ్మలకు ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ బతుకమ్మ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, తెలంగాణ సంస్కృతి వైభవానికి ప్రతీక అని అన్నారు. తరతరాలుగా కొనసాగుతున్న బతుకమ్మ సంప్రదాయాన్ని భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు.వేడుకల్లో మహిళలు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని బతుకమ్మలను చుట్టూ తిరుగుతూ ఆటపాటలతో సందడి చేశారు. శంషాబాద్‌లో నిర్వహించిన ఈ వేడుకలు పండుగ వాతావరణాన్ని తలపించాయి. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమా, మాజీ జెడ్పీటీసీ ఏనాగు మురళీధర్ రెడ్డి,శంషాబాద్ మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ సుష్మారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ మంచర్ల మమత శ్రీనివాస్, మాజీ ఎంపీపీ చెక్కల ఎల్లయ్య, నాయకులు మంచర్ల శ్రీనివాస్, పరమేశ్వర్,కొనమొల శ్రీనివాస్,దీపా మల్లేష్, రాహుల్ అప్పా, యుగేందర్ రెడ్డి, రాజేందర్, బాత్కు మహేష్ యాదవ్, గుంటి చరణ్, రాఘవేందర్ రెడ్డి తదితర నాయకులు, కార్యకర్తలు, మహిళలు,యువకులు తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి బీమా భరోసా

రూ.6.30 లక్షల పరిహారం అందజేత

మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమతా వెంకట్ రెడ్డి, ఎస్సై కోటేశ్వరరావు చేతుల మీదుగా చెక్కు పంపిణీ



**చేవెళ్ల అక్టోబర్ 14(ప్రజా జ్యోతి):** కుటుంబ పెద్దను కోల్పోయి దుఃఖంలో ఉన్న బాధిత కుటుంబానికి జీవిత బీమా ఆర్థిక భరోసానిచ్చింది. చేవెళ్ల మండలం జాలగూడెం గ్రామానికి చెందిన అచ్చిన వెంకటయ్య ఇటీవల వడదెబ్బతో మృతి చెందారు. ఆయన శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీదారుడు కావడంతో సంస్థ రూ.6,30,637 బీమా పరిహారాన్ని మంజూరు చేసింది. ఈ మేరకు పరిహారం చెక్కును మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమతా వెంకట్ రెడ్డి, ఎస్సై కోటేశ్వరరావు బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమతా వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. అనుకోని ఆపదలు ఎదురైనప్పుడు జీవిత బీమా కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలుస్తుందన్నారు. కుటుంబ పెద్దను కోల్పోయిన సమయంలో వచ్చే ఆర్థిక ఇబ్బందులను కొంతవరకు అధిగమించేందుకు బీమా పరిహారం ఉపయోగపడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ తమ కుటుంబ భవిష్యత్తు, ఆర్థిక భద్రతను దృష్టిలో ఉంచుకొని జీవిత బీమా పాలసీలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో షీ టీం ఎస్సై ధర్మీయ రాథోడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ రాము గౌడ్, కౌన్సిలర్ మద్దెల శ్రీనివాస్, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ చేవెళ్ల బ్రాంచ్ మేనేజర్ ఎస్. హనుమంత్, సీనియర్ డీజీఎం నరేందర్, ఏజీఎం శ్రీనివాస్, బీడీఎం ఎం. హర్షవర్ధన్, సంస్థ సిబ్బంది కె. రమేష్, పి. వెంకటేష్, సి. సరిత, సి. కుమార్, బి. మాణిక్యం, డెవలప్‌మెంట్ ఆఫీసర్లు, సేల్స్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

# సచివాలయ ఉద్యోగుల బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**ఉప్పల్, అక్టోబర్ 12,(ప్రజాజ్యోతి):** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని సచివాలయ ఉద్యోగుల ఆధ్వర్యం లో నిర్వహించిన బతుకమ్మ సంబరాలు అసెంబ్లీ ప్రాంగణం లో ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ ముదిరాజ్, ఎమ్మెల్సీ సురభి వాణీ దేవి లతో కలిసి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బతుకమ్మ వేడుకల ప్రాముఖ్యతను చాటుతూ తెలంగాణ ఆడపడుచులు ఎంతో భక్తిశ్రద్ధ లతో జరుపుకునే ఈ పండుగ రాష్ట్ర సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. పూలతో బతుకమ్మలను పేర్చి, పాటలు పాడుతూ మహిళలు నిర్వహించే ఈ వేడుకలు తెలంగాణ ఆత్మగౌరవాన్ని, ఐక్యతను ప్రతిబింబిస్తాయని తెలిపారు.తెలంగాణ సంస్కృతిని, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో బతుకమ్మ పండుగ కీలక పాత్ర పోషిస్తుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# ఉప్పల్ మినీ శిల్పారామం లో అలరించిన భరతనాట్యశీ

మూడవరోజు మహిళా సిబ్బంది బతుకమ్మ ఆటల సందడి





**ఉప్పల్,అక్టోబర్ 12, ( ప్రజాజ్యోతి ):** ఉప్పల్ మినీ శిల్పారామం లో ఈరోజు బతుకమ్మ పండుగ మూడవ రోజు పురస్కరించు కొని శిల్పారామం మహిళా సిబ్బంది బతుకమ్మలను పేర్చి సాయంత్రం బతుకమ్మ ఆటను సందర్శకులతోటి ఆడుకున్నారు. సోమవారం భరతనాట్య ప్రదర్శనలో వైదేహి సుభాష్ శిష్య బృందం భరతనాట్య ప్రదర్శనలో సకల గణాధిప,దేవీస్తుతి,మహిషా సుర మర్దిని అంశాలను హిరణ్మయి, గాయత్రీ, తిస్య, శ్రేష్ఠ, సాన్విక, ఆజ్ఞ, నిహారిక, రక్షా, మేధా, జ్ఞాన త్రిపుర, శృతిక మొదలైన వారు ప్రదర్శించి మెప్పించారు.

# మేడ్చల్ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడిగా దయానంద్ ఏకగ్రీవ ఎన్నిక



**మేడ్చల్, అక్టోబర్ 12 (ప్రజాజ్యోతి):** మేడ్చల్ మండల ఎలక్ట్రానిక్ మీడియా నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఉషిగారి దయానంద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా ఏం.వి. శరత్ చంద్ర, ఉపాధ్యక్షులుగా నాగేష్, రాజశేఖర్, కోశాధికారిగా తాళ్లపల్లి విశ్వసాయి, గౌరవ అధ్యక్షుడిగా సత్యపాల్ రెడ్డి ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులుగా గోపాల్, మహేష్,వెంకట్, రాకేష్, నవీన్,ఖాజా మోహినుద్దీన్, ప్రభాకర్, నక్షత్రం ఎంపికయ్యారు. ఈ సందర్భంగా దయానంద్ మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమం, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. జర్నలిస్టుల హక్కుల పరిరక్షణతో పాటు మీడియా ఐక్యతను బలోపేతం చేస్తూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో సమన్వయంతో ముందుకు సాగుతామని పేర్కొన్నారు.

# వ్యక్తి అదృశ్యం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు



**యాచారం, అక్టోబర్ 12 (ప్రజాజ్యోతి):** మీర్ఖాన్ పేట గ్రామానికి చెందిన వరికుప్పల కుమార్ (30) అదృశ్యమైనట్లు హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ మీర్ఖాన్ పేట పోలీసులు తెలిపారు. కుమార్ భార్య ఫిర్యాదు మేరకు పోలీసుల వివరాలు ఇలా.. తన భర్త కుమార్ గత కొంతకాలంగా మద్యానికి అలవాటు పడి కుటుంబంలో తరచూ గొడవలు పడుతుండేవాడని అయితే ఈ క్రమంలో కుమార్ ఈనెల 11న తన భర్త లేఖ రాసి ద్విచక్ర వాహనంపై వెళ్లారని తెలిపారు. దీంతో కుటుంబ సభ్యులతో కలసి తెలిసిన అన్నిచోట్ల ఎంత వెతికినా లభించకపోవడంతో పోలీసుల్ని ఆశ్రయించినట్లు తెలిపారు. కుమార్ సుమారు 5 అడుగుల 6 అంగుళాలు ఉంటాడని నీలం రంగు టీ-షర్ట్, నలుపు రంగు ప్యాంట్ ధరించారని తెలిపారు. ద్విచక్ర వాహనం (టీఎస్ -07-బిహెచ్-9358) వెళ్లినట్లు తెలిపారు. సదరు వ్యక్తి గురించి ఆచూకీ తెలిసినవారు పోలీస్ స్టేషన్ కు సమాచారం ఇవ్వాలని పోలీసులు తెలిపారు.

# ఎం ఐ ఈ పి ఐ డి లో ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం

రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత: ఏసీపీ శంకర్ రాజు





**బోయిన్‌పల్లి, అక్టోబర్ 12, ప్రజాజ్యోతి:** రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా బోయిన్‌పల్లిలోని జాతీయ మేధో వైకల్యం గల వ్యక్తుల సాధికారత సంస్థ (ఎన్ఐఈ పి ఐ డి)లో సోమవారం ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు.మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి, ఐపీఎస్ ఆదేశాల మేరకు, ట్రాఫిక్ డీసీపీ-1 కె. రాహుల్ రెడ్డి పర్యవేక్షణలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.తిరుమలగిరి ట్రాఫిక్ డివిజన్ ఏసీపీ జి. శంకర్ రాజు, ట్రాఫిక్ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ ఐ.వి. రమణయ్య, ఎస్ఐ వి. దామోదర్ కార్యక్రమంలో పాల్గొని సుమారు 200 మంది విద్యార్థులకు రహదారి భద్రతపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఏసీపీ శంకర్ రాజు మాట్లాడుతూ రోడ్డు దాటేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాదచారుల భద్రత, ట్రాఫిక్ సిగ్నల్ల ప్రాముఖ్యత, రహదారి నిబంధనల పాటింపు గురించి వివరించారు. విద్యార్థులు తమ కుటుంబ సభ్యులు, స్నేహితులు, సమాజంలోని ఇతరులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించి విలువైన ప్రాణాలను కాపాడవచ్చని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో చీ×జూ×ణ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శ్రవణ్ రెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీనివాసులు, అకడమిక్స్ ఇన్‌చార్జి డాక్టర్ యతేంద్ర కుమార్, ప్రత్యేక విద్యా విభాగం అధ్యాపకులు డాక్టర్ అంబాడి, స్పీచ్ అండ్ హియరింగ్ విభాగం అధ్యాపకులు హిమాంశు వర్మ, వయోజన స్వయంప్రతిపత్త జీవన విభాగం అధ్యాపకులు రాజేందర్ తదితరులు పాల్గొన్నారు. ట్రాఫిక్ పోలీసుల మార్గదర్శకత్వాన్ని సంస్థ ప్రతినిధులు అభినందించారు.

# మల్లాపూర్ చాణక్యపురి కాలనీలో దుర్గా మల్లేశ్వరి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు



**శేరిలింగంపల్లి,అక్టోబర్ 12 (ప్రజాజ్యోతి):** శక్తి సాయి నగర్ డివిజన్ మల్లాపూర్ చాణిక్యపురి కాలనీలోని శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి ఆలయంలో నవరాత్రుల శ్రీ బాలా త్రిపుర సుందరి అమ్మవారిని దర్శించుకొని ప్రజలు ఉద్యోగులు అధికారులు చాణిక్యపురి కాలనీ వాసులు అమ్మవారి దయతో సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నాము టీజీవో హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు మన్య బోయిన కృష్ణ యాదవ్ కుటుంబ సమేతంగా అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించి మొక్కలు చెల్లించుకున్నారు ఈ కార్యక్రమంలో యాదవ సంఘం మల్కాజ్గిరి జిల్లా మహిళా అధ్యక్షురాలు ఎంబి శ్రీ దుర్గా మాధవి యాదవ్. ఏం గోపాల్ యాదవ్ ఎంబీ వినోదయాదవ్.. ఎంబి హేమలత యాదవ్. కాజా నాగమణి యాదవ్. ఏం సత్యనారాయణ పుష్పలత. జె అశోక్ బాబు వసంత యాదవ్. మారం మల్లికార్జున్ యాదవ్ ఉమా యాదవ్. రమేష్ యాదవ్ హేమలత యాదవ్.మంజుల యాదవ్. ప్రనిత యాదవ్. కల్పన యాదవ్. సతీష్ యాదవ్ మానస యాదవ్.శివ యాదవ్ మౌనిక యాదవ్. అజయ్ సంపూర్ణ యాదవ్. పునీత్ యాదవ్. ధనవి యాదవ్. రూల్ యాదవ్ కాజా సంధ్యారాణి యాదవ్.భార్గవ్ యాదవ్. వర్తిక యాదవ్. సునైనా యాదవ్ తదితరులు అమ్మవారిని దర్శించుకొని తీర్థ పద్ధతులు తీసుకొని అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నారు..

# ఓల్డ్ బోయిన్‌పల్లిలో వీధి దీపాల సమస్యలకు పరిష్కారం

పనిచేయని వీధి దీపాలకు మరమ్మతులు.. ప్రజలకు మెరుగైన వెలుతురు



**బోయిన్‌పల్లి, అక్టోబర్ 12, (ప్రజాజ్యోతి):** ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో పనిచేయని వీధి దీపాలకు మరమ్మతులు చేయించి, తిరిగి వెలిగేలా చర్యలు తీసుకున్నట్లు డివిజన్ మాజీ కార్పొరేటర్ ముద్దం నర్సింహా యాదవ్ తెలిపారు. రాత్రివేళల్లో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, రహదారులపై తగిన వెలుతురు ఉండేలా వీధి దీపాల సమస్యలను గుర్తించి పరిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ క్రమంలో విన్సిటీ లేన్, ఓల్డ్ బోయిన్‌పల్లిలోని మదర్సా ప్రాంతం, దుబాయ్ గేట్--వైష్ణవి మాత ఆలయం సమీపంలో, మల్లికార్జున కాలనీ--4, గ్రీన్ లహరి అపార్ట్‌మెంట్స్, అంజయ్య నగర్ మెయిన్ రోడ్ ప్రాంతాల్లో వీధి దీపాలకు మరమ్మతులు చేయించారు.ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనతో పాటు స్థానిక సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని ముద్దం నర్సింహా యాదవ్ తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి కొనసాగిస్తానని పేర్కొన్నారు.

# ఎన్ఎఫ్బిఎస్ పథకానికి దరఖాస్తు చేసుకోవాలి

ఎంపీడీవో రాధారాణి

కుటుంబ పెద్దను కోల్పోయిన వారికి ఆర్థిక సాయం

31 మందికి బ్యాంకు ఖాతాల్లో ఆర్థిక సహాయం జమ

పథకం ద్వారా లభించే ఆర్థిక సహాయాన్ని పొందాలి



**యాచారం, అక్టోబర్ 12 (ప్రజాజ్యోతి):** కుటుంబాలను పోషించే కుటుంబ పెద్దల్ని కోల్పోయిన అర్హులైన కుటుంబాలన్నీ జాతీయ కుటుంబ ప్రయోజన పథకం (ఎన్ఎఫ్బిఎస్) ద్వారా లభించే ఆర్థిక సహాయానికి దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో రాధా రాణి తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆర్థిక సహాయం అందించబడుతుందని తెలిపారు. ఇప్పటికే ఈ పథకం ద్వారా గ్రామాల్లో ఇప్పటివరకు మొత్తం 133 దరఖాస్తులు నమోదు అయ్యాయని దరఖాస్తులు అధికారుల పరిశీలనలో ఉన్నాయని చెప్పారు. ఎంపీడీవో స్థాయిలో 74 దరఖాస్తులు ఆమోదించబడ్డాయని వీటిలో 31 మంది లబ్ధిదారులకు ఆర్థిక సహాయం బ్యాంకు ఖాతాల్లో జమ చేయబడిందని తెలిపారు. 8 దరఖాస్తులు తిరస్కరించబడ్డాయని తెలిపారు. అర్హులంతా మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకొని పథకం ద్వారా లభించే ఆర్థిక సహాయాన్ని పొందాలని కోరారు

# డ్రగ్స్‌కు దూరంగా.. సంస్కృతికి చేరువగా!

**చేవెళ్ల వివేకానంద కళాశాలలో నిషా ముక్త్ యువ, బతుకమ్మ సంబరాలు**

**డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి విద్యార్థుల ప్రతిజ్ఞ**

**బతుకమ్మ వేడుకల్లో సందడి.. స్వచ్ఛ భారత్‌లో శ్రమదానం**





**చేవెళ్ల, అక్టోబర్ 12(ప్రజా జ్యోతి** యువతలో సామాజిక బాధ్యతను పెంపొందించడం.. మత్తు పదార్థాల మహమ్మారిపై అవగాహన కల్పించడం.. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను చాటిచెప్పడం.. పరిసరాల పరిశుభ్రతపై చైతన్యం నింపడం.. ఇలా ఒకే వేదికపై మూడు కార్యక్రమాలు సందడి చేశాయి. చేవెళ్లలోని ఇన్స్టిట్యూట్ ఆఫ్ వివేకానంద, జాగృతి, ధర్మసాగర కళాశాలల ప్రాంగణంలో 'నిషా ముక్త్ యువ', బతుకమ్మ సంబరాలు, స్వచ్ఛ భారత్ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాల్లో విద్యార్థులు, అధ్యాపకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

**డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం**

నిషా ముక్త్ యువ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎస్సైలు శిరీష, వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. మత్తు పదార్థాలకు అలవాటు పడితే యువత భవిష్యత్తుతో పాటు కుటుంబాలు కూడా తీవ్రంగా నష్టపోతాయని హెచ్చరించారు. డ్రగ్స్ వినియోగం ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని, విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. ఎక్కడైనా డ్రగ్స్ విక్రయాలు జరుగుతున్నా, ఎవరైనా వినియోగిస్తున్నట్లు తెలిసినా వెంటనే పోలీసులకు లేదా డయల్ 100కు సమాచారం అందించాలని కోరారు.కౌన్సిలర్ అనంత్ రెడ్డి, డాక్టర్ వైభవ్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉంటూ క్రమశిక్షణతో చదువుపై దృష్టి సారించాలని సూచించారు. యువతలో మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై అవగాహన పెంచేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు.

కళాశాల కరస్పాండెంట్ రాజు మాట్లాడుతూ.. నేటి యువతే రేపటి దేశ భవిష్యత్తు అని, వారిని సరైన మార్గంలో నడిపించాల్సిన బాధ్యత సమాజంపై ఉందన్నారు. అనంతరం విద్యార్థులు, అధ్యాపకులు డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.

**సంప్రదాయాలకు ప్రతీకగా బతుకమ్మ సంబరాలు**

అనంతరం వివేకానంద, జాగృతి బీఈడీ, డైట్ కళాశాలల విద్యార్థినులు బతుకమ్మ వేడుకలను వైభవంగా నిర్వహించారు. రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మల చుట్టూ సంప్రదాయ దుస్తుల్లో విద్యార్థినులు ఆడిపాడుతూ సందడి చేశారు. ఈ వేడుకలు కళాశాల ప్రాంగణంలో పండుగ వాతావరణాన్ని నింపాయి. ఈ సందర్భంగా జాగృతి కళాశాల ప్రిన్సిపాల్ అనంతరెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ విశిష్టతను భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కరస్పాండెంట్లు రాజు, షణ్ముఖ తదితరులు వేడుకల్లో పాల్గొన్నారు.

**పరిశుభ్రతపై అవగాహన**

కార్యక్రమాల ముగింపులో విద్యార్థులు, అధ్యాపకులు కలిసి కళాశాల ఆవరణలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన ఆవశ్యకతను చాటుతూ శ్రమదానం చేశారు. ఈ కార్యక్రమంలో జాగృతి కళాశాల కరస్పాండెంట్లు షణ్ముఖ, ప్రశస్త, ఏబీవీపీ పూర్వ నాయకులు సూర్యప్రకాశ్, ప్రవీణ్, శివ, హరికృష్ణ, మహేష్, తెలుగు అధ్యాపకుడు శ్రీను, విద్యార్థి నాయకులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# బి.ఎన్. రెడ్డి నగర్‌లో ఘనంగా పీవీకే డెంటల్ ప్రారంభోత్సవం

**దంత ఆరోగ్య పరిరక్షణపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలి:**

**ఆధునిక దంత వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి: నిర్వాహకులు**



**అబ్దుల్లాపూర్ మెట్టు/ అక్టోబర్ 12 (ప్రజా జ్యోతి):** ఎల్బీనగర్ నియోజకవర్గం పరిధిలోని బి.ఎన్. రెడ్డి నగర్ డివిజన్ టీచర్స్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన పీవీకే డెంటల్ ప్రారంభోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు హాజరయ్యారు. పీవీకే డెంటల్ నిర్వాహకులు డాక్టర్ అక్షయ్ (బీడీఎస్, ఎఫ్‌సీఈ), డాక్టర్ సాయిచంద్ (ఎండీఎస్), మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి లతో కలిసి ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి దంత వైద్యశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా రామచందర్ రావు మాట్లాడుతూ.. ఆరోగ్య పరిరక్షణలో దంత ఆరోగ్యం కూడా ఎంతో ముఖ్యమైన భాగమని పేర్కొన్నారు. పళ్లను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు సంరక్షించుకోవాలని సూచించారు. నోటి ఆరోగ్యం బాగుంటేనే రోజువారీ జీవనంలో ఆహారాన్ని సులభంగా తీసుకోవడంతో పాటు ఆరోగ్యంగా ఉండగలమని తెలిపారు. దంత సమస్యలు తలెత్తినప్పుడు నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని, ప్రజలకు నాణ్యమైన దంత వైద్య సేవలు అందించడంలో పీవీకే డెంటల్ మంచి సేవలు అందించాలని ఆకాంక్షించారు. అనంతరం పీవీకే డెంటల్ నిర్వాహకులు డాక్టర్ అక్షయ్, డాక్టర్ సాయిచంద్ మాట్లాడుతూ.. బి.ఎన్. రెడ్డి నగర్‌తో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు ఆధునిక దంత వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో పీవీకే డెంటల్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దంత సమస్యలకు తగిన వైద్య సలహాలు, చికిత్స అందించడంతో పాటు పళ్ల సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ప్రతిరోజూ ఉదయం, రాత్రి రెండుసార్లు పళ్లను శుభ్రం చేసుకోవడం, తీపి పదార్థాలు అధికంగా తీసుకోకుండా ఉండటం, ఆహారం తీసుకున్న తర్వాత నోటిని శుభ్రం చేసుకోవడం వంటి అలవాట్లు దంత ఆరోగ్యాన్ని కాపాడటంలో సహాయపడతాయని వివరించారు. దంత సమస్యలు కనిపించినప్పుడే కాకుండా క్రమం తప్పకుండా దంత వైద్య పరీక్షలు చేయించుకోవడం కూడా ముఖ్యమని సూచించారు. బి.ఎన్. రెడ్డి నగర్, టీచర్స్ కాలనీతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు పీవీకే డెంటల్ అందించే వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు,వైద్య సిబ్బంది,ఇతరులు పాల్గొన్నారు.

# ఉప్పల్ స్టేడియం రహదారి విస్తరణపై కమిషనర్ క్షేత్రస్థాయి పరిశీలన





**సర్వే ఆఫ్ ఇండియా భూముల సేకరణ, ఆక్రమిత నిర్మాణాల తొలగింపుపై సమీక్ష**

**ఉప్పల్,అక్టోబర్ 12,(ప్రజాజ్యోతి):** ఉప్పల్ ప్రాంతంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించి, రహదారి రాకపోకలను మెరుగుపరిచే లక్ష్యంతో చేపట్టనున్న ఉప్పల్ స్టేడియం రహదారి 120 అడుగుల (36 మీటర్ల) విస్తరణ పనులపై మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వినయ్ కృష్ణా రెడ్డి, ఐఏఎస్, సర్వే ఆఫ్ ఇండియా (ఎస్ఓఐ) సూపరింటెండింగ్ సర్వేయర్, సంబంధిత ఎం ఎం సి ఎస్ ఓ అధికారులతో కలిసి క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించారు. ఈ సందర్భంగా రహదారి విస్తరణకు అవసరమైన సర్వే ఆఫ్ ఇండియా భూములను, వాటిపై ఉన్న కాంపౌండ్ వాల్స్‌తో పాటు కేంద్రీయ విద్యాలయ పాఠశాలకు సంబంధించిన షెడ్లను అధికారులు కమిషనర్‌కు చూపించారు. రహదారి విస్తరణ పరిధిలోకి వస్తున్న సుమారు 0.78 ఎకరాల సర్వే ఆఫ్ ఇండియా భూమి ప్రభావితమవుతున్నట్లు అధికారులు వివరించారు. ఈ భూముల సేకరణకు సంబంధించి నిబంధనల ప్రకారం పరిహారం చెల్లింపు అంశాన్ని పరిశీలించి, తదుపరి చర్యలు చేపట్టాలని సూచించారు. అదేవిధంగా, రహదారి విస్తరణకు ఆటంకంగా ఉన్న ఎన్ఎస్ఎల్ భవనం వద్ద ఏర్పాటు చేసిన తాత్కాలిక బ్యారికేడింగ్ షీట్లను తొలగించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని చీఫ్ సిటీ ప్లానర్ ( సీసీపీ), సిటీ ప్లానర్ ( సిపి)లకు కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. రహదారి విస్తరణ పనులు ముందుకు సాగేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఉప్పల్ స్టేడియం రహదారి విస్తరణ పూర్తయితే ఈ ప్రాంతంలో ట్రాఫిక్ నిర్వహణ మెరుగుపడటంతో పాటు వాహనాల రాకపోకలకు మరింత సౌలభ్యం కలుగుతుందని కమిషనర్ పేర్కొన్నారు. భూసేకరణ, పరిహారం, రహదారి విస్తరణకు సంబంధించిన అంశాలను సమన్వయంతో పరిష్కరించి, అవసరమైన తదుపరి చర్యలను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

# అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవించాలి

**అబ్దుల్లాపూర్ మెట్టు సర్పంచ్ మందుగుల విజయ శ్రీశైలం గౌడ్**



**అబ్దుల్లాపూర్ మెట్టు/అక్టోబర్12 (ప్రజాజ్యోతి)** విజయదశమి, దేవీ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అబ్దుల్లాపూర్ మెట్టు మండల పరిధిలోని బీసీ కాలనీలో కొలువుదీరిన శ్రీ దుర్గామాత అమ్మవారిని గ్రామపంచాయతీ సర్పంచ్ మందుగుల విజయ శ్రీశైలం గౌడ్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి కృపతో ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు కలగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విజయ శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ.. బీసీ కాలనీలో కొలువైన శ్రీ దుర్గామాత అమ్మవారు ఎంతో మహిమాన్వితమైన దైవమని పేర్కొన్నారు. దేవీ నవరాత్రులలో భక్తిశ్రద్ధలతో అమ్మవారిని పూజించి, ఆరాధించడం వల్ల భక్తుల్లో ఆధ్యాత్మిక చింతన పెంపొందుతుందని అన్నారు. జగన్మాత అనుగ్రహంతో ప్రజలకు సుఖసంతోషాలు, భోగభాగ్యాలు, అష్టైశ్వర్యాలు కలగాలని ఆకాంక్షించారు. అమ్మవారి ఆశీస్సులు గ్రామ ప్రజలందరిపై ఉండాలని, గ్రామం సుభిక్షంగా అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని కోరుకున్నారు. నవరాత్రి ఉత్సవాలు భక్తిభావాన్ని, ఆధ్యాత్మిక ఐక్యతను పెంపొందించడంతోపాటు ప్రజల మధ్య సోదరభావాన్ని మరింత బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ దైవభక్తితో పాటు సమాజ శ్రేయస్సుకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అనంతరం అర్చకులు సర్పంచ్‌కు తీర్థప్రసాదాలు అందజేశారు. దుర్గామాత మండపం నిర్వాహకులు మందుగుల విజయ శ్రీశైలం గౌడ్‌ను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అమ్మవారి భక్తులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

# బతుకమ్మ వేడుకలకు వెలుగులు

**మహిళల సౌకర్యార్థం పుష్కరిణి వద్ద లైట్ల ఏర్పాటు**



**చేవెళ్ల అక్టోబర్ 14(ప్రజా జ్యోతి):** బతుకమ్మ వేడుకలకు వచ్చే మహిళలకు ఇబ్బందులు కలగకుండా మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమతా వెంకట్‌రెడ్డి, స్థానిక కౌన్సిలర్ పైండ్ల మధుసూదన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. శ్రీ లక్ష్మీవెంకటేశ్వర స్వామి పుష్కరిణి వద్ద రాత్రి వేళలో మహిళలు బతుకమ్మ ఆడుకునేందుకు వీలుగా లైట్లు ఏర్పాటు చేయించారు. పండుగ సమయంలో మహిళలకు తగిన వెలుతురు సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతో ఈ ఏర్పాట్లు చేపట్టారు. దీంతో రాత్రి వేళ బతుకమ్మ వేడుకలకు వచ్చే మహిళలకు సౌకర్యంగా ఉండనుంది. ఈ కార్యక్రమంలో నాయకులు ఖదీర్, మోహన్‌రెడ్డి, దర్శన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# రూ.2 కోట్ల నిధులతో బీరప్పగడ్డ గౌడ శ్మశాన వాటిక అభివృద్ధి

**ఎంఎంసీ కమీషనర్ తో మాట్లాడి నిధులు మంజూరు చేయించిన పరమేశ్వర్ రెడ్డి??**

**పరమేశ్వర్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపిన ఉప్పల్ గౌడ సంఘం ప్రతినిధులు**



**ఉప్పల్,అక్టోబర్ 12, (ప్రజా జ్యోతి):** ఉప్పల్ బీరప్పగడ్డ లోని గౌడ శ్మశాన వాటికను రూ.2 కోట్ల నిధులతో అభివృద్ధి చేయనున్నట్లుగా ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. ఉప్పల్ లోని గౌడ కులస్తులు, సంఘం ప్రతినిధులతో కలిసి సోమవారం ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి ని కలిశారు. బీరప్పగడ్డ లోని గౌడ శ్మశాన వాటిక అభివృద్ధికి నిధులను కేటాయించాలని కోరారు.వెంటనే కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి రూ.2 కోట్ల నిధులను మంజూరు చేశారు. సకాలంలో టెండర్ ప్రక్రియను సైతం పూర్తి చేసి పనులను కూడా చేపట్టేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో కమిషనర్ కు, పరమేశ్వర్ రెడ్డికి గౌడ సంఘం ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.గతంలో ఇదే శ్మశాన వాటిక అభివృద్ధికి రూ.48 లక్షల నిధులు మంజూరు అయినట్టుగా పరమేశ్వర్ రెడ్డి చెప్పారు. అయినప్పటికీ పూర్తి స్థాయిలో అభివృద్ధి పనులకు ఈ నిధులు సరిపోయే అవకాశం లేదన్నారు. ఇదే విషయాన్ని ఎంఎంసీ కమీషనర్ దృష్టికి తీసుకెళ్లి మొత్తం రూ.2 కోట్ల నిధులు మంజూరు చేయించినట్లుగా పరమేశ్వర్ రెడ్డి తెలిపారు.కార్యక్రమంలో బజారు జగన్నాథ్ గౌడ్,వర్కాల మదన్ గౌడ్,బజారు నవీన్ గౌడ్,బింగి జగదీష్ గౌడ్ బుత్కూరి మదన్ గౌడ్,బింగి బుచ్చి గౌడ్,వంశీ గౌడ్ పాల్గొన్నారు.

# నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

**నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి**

**హెచ్ఎండీఏ లేఅవుట్ కాలనీ అసోసియేషన్ డిమాండ్**





**మేడిపల్లి (ప్రజా జ్యోతి) :** మున్సిపల్ కార్పొరేషన్ నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న నిర్మాణాలపై అధికారులు చర్యలు తీసుకోవాలని మేడిపల్లి హెచ్ఎండీఏ లేఅవుట్ కాలనీ అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో కాలనీ అధ్యక్షురాలు ఎంపల్ల పద్మారెడ్డి మాట్లాడారు.

హెచ్ఎండీఏ లేఅవుట్‌లో కొందరు నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారంగా నిర్మాణాలు చేపడుతున్నారని, దీనివల్ల భవిష్యత్తులో కాలనీకి ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నిర్మాణాలపై 30 రోజుల క్రితమే ప్రజావాణిలో ఫిర్యాదు చేసినప్పటికీ, అధికారుల నుంచి స్పందన లేదని తెలిపారు.సదరు నిర్మాణం వల్ల భవిష్యత్తులో ఏదైనా ప్రమాదం జరిగితే మున్సిపల్ కార్పొరేషన్ అధికారులే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన నిర్మాణాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో కాలనీవాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సమీకృత మార్కెట్ నిర్మాణం పూర్తయ్యేది ఎప్పుడూ!

**శంకుస్థాపన చేసి నాలుగు సంవత్సరాలైన ఇంకా పిల్లర్ల దశలోనే**

**త్వరగా పూర్తి చేసి ప్రజా వినియోగంలోకి తేవాలని భగత్ సింగ్ యువజన మండలి డిమాండ్**



**మేడిపల్లి (ప్రజా జ్యోతి):** బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని బోడుప్పల్ డివిజన్ లో నిర్మించ తలపెట్టిన సమీకృత మార్కెట్ నిర్మాణం పనులకు మోక్షం ఎప్పుడని భగత్ సింగ్ యువజన మండలి అధ్యక్షుడు సాయిని నవీన్ కుమార్ అధికారులను ప్రశ్నించారు. ఈ మేరకు సోమవారం బోడుప్పల్ సర్కిల్ కార్యాలయంలో ప్రజా వాణిలో డిప్యూటీ కమిషనర్ ఏ.శైలజకు వినతిపత్రం అందించారు. అనంతరం నవీన్ మాట్లాడుతూ రూ.100 కోట్ల వ్యయంతో 2002 లో అప్పటి మంత్రి ప్రస్తుత ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి చేతులమీదుగా శంకుస్థాపన చేసిన సమీకృత మార్కెట్ భవనం ఇప్పటికీ నాలుగు సంవత్సరాలు గడిచిన నిర్మాణం కేవలం పిల్లర్ల వరకే జరిగిందని ఉన్నారు.హడావుడిగా ప్రారంభించిన మార్కెట్ నిర్మాణ పనులను ఇప్పుడు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు.కేవలం అధికారం కోసమే తాపత్రయపడే ఈ నియోజకవర్గం ఎమ్మెల్యేకు ప్రజా సమస్యలపై పట్టింపు లేదా ప్రశ్నించారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే చొరవ తీసుకుని మార్కెట్ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజా వినియోగంలోకి తీసుకురావాలని కోరారు.

# మల్ రెడ్డి యువశక్తి నేతృత్వంలో బతుకమ్మ సంబరాలు

**పట్నంలో ఈనెల 14న బతుకమ్మ సంబరాలు**
**ముఖ్యఅతిథిగా హాజరుకానున్న ఎమ్మెల్యే రంగారెడ్డి**
**పెద్ద ఎత్తున హాజరు కానున్న మహిళలు నాయకులు**
**కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షులు మొహమ్మద్ గౌస్ పాషా**

**ఇబ్రహీంపట్నం అక్టోబర్ 12 ప్రజాజ్యోతి:** తెలంగాణ ఆడబిడ్డల ఆత్మీయతకు, ఐక్యతకు, ప్రకృతి ఆరాధనకు ప్రతీక బతుకమ్మ పండుగ అని మహమ్మద్ గౌస్ పాషా అన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకొని ఇబ్రహీంపట్నం అంబేద్కర్ చౌరస్తాలో, మల్ రెడ్డి యువశక్తి కన్వీనర్, మల్ రెడ్డి స్నేహఅభిషేక్ రెడ్డి నేతృత్వంలో ఈ నెల 14వ తేదీన బుధవారం సాయంత్రం, బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించనున్నట్లు, కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షులు మొహమ్మద్ గౌస్ పాషా తెలిపారు.. ఈ యొక్క బతుకమ్మ సంబరాల కార్యక్రమానికి ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, ముఖ్యఅతిథిగా హాజరుకానున్నట్లు గౌస్ పాషా తెలిపారు. ఈ వేడుకల్లో భాగంగా ఆడబిడ్డలకు ప్రత్యేకంగా బతుకమ్మ పోటీలను ఏర్పాటు చేయనున్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు, ప్రథమ బహుమతిగా రూ.25,000, ద్వితీయ బహుమతిగా రూ.15,000, తృతీయ బహుమతిగా రూ.10,000 భారీ నగదు బహుమతులను, శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి చేతుల మీదుగా అందించటం జరుగుతున్నది గౌస్ పాషా చెప్పారు. మహిళల్లో పండుగ ఉత్సాహాన్ని పెంపొందించడంతో పాటు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు పరిచయం చేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని వెల్లడించారు. ఈ వేడుకలను మరింత ఉత్సాహభరితంగా నిర్వహించేందుకు ప్రముఖ జానపద కళాకారులు కూడా పాల్గొననున్నారు. మహిళలు, యువతులు పెద్ద సంఖ్యలో



పాల్గొని బతుకమ్మ సంబురాలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. తెలంగాణ ఆడబిడ్డల ఆత్మీయతకు, ఐక్యతకు, ప్రకృతి ఆరాధనకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగను అందరూ కలిసి ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షిస్తున్నామని అన్నారు.

# మిర్జాగూడలో యువతిపై దాడి కలకలం!

**తలపై తీవ్ర గాయాలు.. పొలంలో రక్తగాయాలతో గుర్తింపు**
**తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు**





**చేవెళ్ల, అక్టోబర్ 12(ప్రజా జ్యోతి):** మిర్జాగూడ గేట్ సమీపంలోని పొలంలో ఓ యువతి రక్తగాయాలతో పడి ఉండటం కలకలం రేపింది. గుర్తుతెలియని వ్యక్తులు పదునైన ఆయుధంతో తన కుమార్తెపై దాడి చేశారని తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటన సోమవారం ఉదయం వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల ప్రకారం.. సోమవారం ఉదయం సుమారు 6 గంటలకు పర్వేద శంకరయ్య 100కు ఫోన్ చేసి మిర్జాగూడ గేట్ వద్ద ఓ మహిళ రక్తగాయాలతో పడి ఉన్నట్లు సమాచారం ఇచ్చారు. దీంతో పెట్రోలింగ్ సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. చేవెళ్ల నుంచి వికారాబాద్ వెళ్లే రహదారిలో మిర్జాగూడ గేట్‌కు ఎడమవైపు సుమారు 100 మీటర్ల దూరంలోని పొలంలో గాయాలతో ఉన్న యువతిని గుర్తించారు. వెంటనే ఆమెను చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం పట్టణంలోని పట్నం మహేందర్ ఆసుపత్రిలో చేర్పించారు. బాధితురాలిని శేరిలింగంపల్లి పరిధి హాఫీజ్‌పేట్‌లోని ప్రేమ్‌నగర్ కాలనీకి చెందిన కల్సాని వీణ (26)గా గుర్తించారు. చిన్నప్పటినుంచి మానసిక స్థితి సరిగాలేదని గతంలోనూ అప్పుడప్పుడు ఇంటి నుంచి వెళ్లి మూడు, నాలుగు రోజుల తర్వాత తిరిగి వచ్చేదని వివరించారు. వీణ అక్టోబర్ 3న ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగి రాలేదని ఆమె తండ్రి కల్సాని ఇంద్రారెడ్డి పోలీసులకు తెలిపారు. ఈ క్రమంలో మిర్జాగూడ సమీపంలోని పొలంలో ఆమె గాయాలతో కనిపించింది. తన కుమార్తెపై గుర్తుతెలియని వ్యక్తులు పదునైన ఆయుధంతో దాడి చేసి తలపై గాయాలు చేశారని తండ్రి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు చేవెళ్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. యువతికి గాయాలు ఎలా అయ్యాయి? దాడి జరిగితే దాని వెనుక కారణాలేమిటి? అనే కోణాల్లో విచారణ జరుపుతున్నారు. బాధితురాలు ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో వెల్లడికావాల్సి ఉంది.

# శంకర్ పల్లి పి.ఏ.సీ.ఎస్ చైర్మన్ పీఠంపై బొల్లారం వెంకట్ రెడ్డి - ఘనంగా బాధ్యతల స్వీకరణ





**వైస్ చైర్మన్ గా పార్శి బాలకృష్ణ - 13 మంది డైరెక్టర్లతో నూతన పాలకవర్గం ప్రమాణ శ్రీకారం..**
**జీవో ఎంఎస్ నెం. 68 ప్రకారం నియామకం - సహకార శాఖ కార్యదర్శి ఉత్తర్వులు**

**శంకర్ పల్లి, అక్టోబర్ 12 ( ప్రజా జ్యోతి ):** శంకర్ పల్లి మండల వ్యవసాయ రంగంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. శంకర్ పల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పి.ఏ.సి.ఎస్) నూతన చైర్మన్ గా బొల్లారం వెంకట్ రెడ్డి సోమవారం ఘనంగా బాధ్యతలు చేపట్టారు. తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన జీవో ఎం.ఎస్. నం. 68 ప్రకారం ఆయన నియామకం జరిగింది. శంకర్ పల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో జరిగిన ఈ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి సహకార శాఖ అధికారులు, రైతులు, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. శంకర్ పల్లి మండలంలో సీనియర్ రైతు నాయకుడిగా, అన్ని వర్గాల ప్రజలతో సన్నిహిత సంబంధాలు ఉన్న నాయకుడిగా బొల్లారం వెంకట్ రెడ్డి గారికి మంచి పేరు ఉంది. రైతుల సమస్యలపై ఆయనకు ఉన్న అవగాహనతోనే ప్రభుత్వం ఆయనను ఈ కీలక బాధ్యతలకు ఎంపిక చేసింది.

13 మంది డైరెక్టర్ల బలమైన కమిటీ: ఈ కమిటీలో మొత్తం 13 మంది సభ్యులు ఉన్నారు. ఇందులో మహిళలు, ఎస్సీ,ఎస్టీ, బీసీ, ఓసీ వర్గాలకు చెందిన నాయకులకు ప్రాతినిధ్యం కల్పించారు. 1. పార్శి బాలకృష్ణ (వైస్ చైర్మన్)2. కర్కనగారి మాణిక్య రెడ్డి3. మామిడిపల్లి జనార్ధన్ రెడ్డి,4. బుచ్చనోళ్ల ఇంద్రమ్మ5. కొలన్ శ్రీనివాస్ రెడ్డి6. గుండ్ర లచ్చి రెడ్డి7. వడ్డె మల్లికార్జున్8. గుంతల ప్రశాంత్ రెడ్డి 9. బూరిగల్ల సమయ్య10. పాత్లోత్ శంకర్11. వొగ్గు చంద్రకళ12. కొంగల శ్రీధర్ మరియు చైర్మన్ బొల్లారం వెంకట్ రెడ్డి గారితో కలిపి మొత్తం 13 మంది,బాధ్యతలు స్వీకరించారు. స్వీకరణ అనంతరం చైర్మన్ బొల్లారం వెంకట్ రెడ్డి మాట్లాడుతూ..."నాపై నమ్మకం ఉంచి పి.ఏ.సి.ఎస్ చైర్మన్ గా నియమించిన తెలంగాణ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, జిల్లా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకి, స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్య,స్థానిక నాయకులకు నా కృతజ్ఞతలు. శంకర్ పల్లి పి.ఏ.సీ.ఎస్ అంటేనే వేలాది మంది రైతుల నమ్మకం. ఆ నమ్మకాన్ని వమ్ము చేయను. రైతులకు పంట రుణాలు, ఎరువులు, విత్తనాలు సకాలంలో, అవినీతి లేకుండా అందేలా చూస్తా. పి.ఏ.సి.ఎస్ ని లాభాల బాటలో నడిపి, రైతులకు అండగా ఉంటా. ప్రతి రైతు సమస్యను నా సొంత సమస్యగా భావించి పరిష్కరిస్తా" అని హామీ ఇచ్చారు. అనంతరం నూతన పాలకవర్గాన్ని శంకర్ పల్లి మండలంలోని వివిధ గ్రామాల రైతులు, నాయకులు శాలువాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

# శిల్పారామములు బతుకమ్మ ఆట పాటలు కూచిపూడి నృత్య ప్రదర్శన

**శేరిలింగంపల్లి,అక్టోబర్ 12 (ప్రజాజ్యోతి):** మాదాపూర్ శిల్పారామం లో సోమవారం బతుకమ్మ పండుగ మూడవ రోజు పురస్కరించుకొని శిల్పారామం మహిళా సిబ్బంది బతుకమ్మలను పేర్చి సాయంత్రం బతుకమ్మ ఆటను సందర్శకులతోటి ఆడుకున్నారు. సోమవారం యంపీ థియేటర్ లో తాల్ తరంగ్ వారి కూచిపూడి నృత్య ప్రదర్శన అలరించింది. ఎన్ఎస్ఎల్ ప్రవీణ శిష్య బృందం ఆద్య నవరూపిణి కూచిపూడి నృత్య ప్రదర్శన ఎంతగానో అలరించింది. అమ్మవారి నవరూపాలను వర్ణిస్తూ నృత్య రూపక ప్రదర్శనలో కళాకారులూ అమృత,సంజన, శాన్వి, శ్రేష్ఠ, సుష్మ, కళ్యాణి,చక్రికా, తన్విక,సౌమ్య, గ్రీష్మ, మానస మొదలైన వారు ప్రదర్శించి మెప్పించారు.





# ప్రజావాణికి రెండు ఫిర్యాదులు

**ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి**
**ఆర్డీవో పార్థసింహారెడ్డి**



**చేవెళ్ల అక్టోబర్ 14(ప్రజా జ్యోతి):** ప్రజల సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చేవెళ్ల ఆర్డీవో పార్థసింహారెడ్డి సూచించారు. బుధవారం చేవెళ్ల పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో ఆయన అధ్యక్షతన నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి రెండు ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. ఈ రెండు దరఖాస్తులు రెవెన్యూ శాఖకు సంబంధించినవని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ.. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణిలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. అందిన ఫిర్యాదులను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు సత్వర న్యాయం జరిగేలా అధికారులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ స్థాయి అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత

**గ్రామంలో స్వచ్ఛత కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ శాంతమ్మ యాదయ్య**



**షాబాద్ అక్టోబర్ 12 ( ప్రజా జ్యోతి )** గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని హైతాబాద్ గ్రామ సర్పంచ్ శాంతమ్మ యాదయ్య అన్నారు. గ్రామంలో నిర్వహించిన పారిశుద్ధ్య కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు కలిసి వీధులను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామంలోని వీధుల్లో చెత్తాచెదారం పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని, తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి నిర్దేశించిన చెత్త బుట్టల్లో వేయాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా అనారోగ్య సమస్యలను నివారించవచ్చని తెలిపారు. గ్రామాభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వాములై పారిశుద్ధ్య కార్యక్రమాలకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు. షాబాద్ మండల్ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్, సత్యం వార్డు మెంబర్లు గ్రామ సెక్రెటరీ గ్రామస్తులు పాల్గొన్నారు.

# సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి




ఢిల్లీలో కాంగ్రెస్ నేతల నిరసన పాదయాత్రలో పాల్గొన్న భీమ్ భరత్

**చేవెళ్ల అక్టోబర్ 12(ప్రజా జ్యోతి):** కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఢిల్లీలో నిర్వహించిన నిరసన పాదయాత్రలో చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పామేన భీమ్ భరత్ పాల్గొన్నారు. ఏఐసీసీ, టీపీసీసీ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు సత్యనారాయణ రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి గౌరి సతీష్, క్రాంతి తదితర పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. ఎన్నికల వ్యవస్థలో పారదర్శకతను కాపాడాలని, ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల కమిషన్ వ్యవహారశైలిపై నిరసన వ్యక్తం చేస్తూ సీఈసీ జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని నినాదాలు చేశారు.

# కంది సాగుపై ప్రత్యేక శిక్షణ... శాస్త్రీయ పద్ధతులు పాటించాలి






**కందుల ఉత్పాదకత పెంపునకు రైతులు కృషి చేయాలి**

**షాబాద్, అక్టోబర్ 12 ( ప్రజా జ్యోతి )** షాబాద్ మండలంలోని షాబాద్, చెర్లగూడెం గ్రామాల్లో మిషన్ ఫర్ ఆత్మనిర్భరత ఇన్ పల్సెస్ (ఎంఏఎన్పీ) 2026--27 పథకంలో భాగంగా కంది పంట బ్లాక్ డెమాన్‌స్ట్రేషన్లపై రైతులకు శిక్షణ కార్యక్రమం, క్షేత్ర సందర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి దండెం విజయచంద్ర రైతులకు కంది సాగులో శాస్త్రీయ పద్ధతులు, సమగ్ర పోషక యాజమాన్యం, పంట దిగుబడి పెంపునకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. కంది సాగులో సిఫారసు చేసిన పద్ధతులను పాటించాలని, సమతుల్య ఎరువులతో పాటు జింక్ సల్ఫేట్, బోరాన్ వంటి సూక్ష్మపోషకాలను అవసరానికి అనుగుణంగా వినియోగించాలని సూచించారు. పంటకు ఆశించే ప్రధాన పురుగులు, తెగుళ్లను ముందుగానే గుర్తించి, పర్యవేక్షిస్తూ సకాలంలో నివారణ చర్యలు చేపట్టాలని తెలిపారు. వ్యవసాయ శాఖ సూచించిన సస్యరక్షణ పద్ధతులను అనుసరించడం ద్వారా పంట నాణ్యత, దిగుబడిని మెరుగుపరచవచ్చని వివరించారు.

అనంతరం రైతులు సాగు చేస్తున్న కంది పంట క్షేత్రాలను సందర్శించి పంట ఎదుగుదల, ప్రస్తుత పరిస్థితులను పరిశీలించారు. రైతులతో ముఖాముఖి నిర్వహించి సాగులో ఎదురవుతున్న సమస్యలు, పంట నిర్వహణ, దిగుబడి పెంపు మార్గాలపై చర్చించారు. బ్లాక్ డెమాన్‌స్ట్రేషన్లలో భాగంగా అందిస్తున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులు సద్వినియోగం చేసుకొని కంది ఉత్పత్తిని పెంచాలని వ్యవసాయ అధికారి సూచించారు. పప్పుధాన్యాల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించేందుకు రైతులు ఆధునిక సాగు పద్ధతులను అవలంబించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు శివతేజ, రాజేశ్వరి, శైలజ, ఉద్యాన విస్తరణ అధికారి బలరాం, చెర్లగూడెం సర్పంచ్ మల్కాపురం పెంటయ్య, మన్మర్రి సర్పంచ్ బందెయ్య, షాబాద్ రైతు ఫెడ్ ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ సీఈఓ కందివనం చంద్రశేఖర్ రెడ్డి, మహిళా రైతులు అమృత, రేణుక, భారతమ్మతో పాటు రైతులు యట్టయ్య, మల్లేష్, హైతబాద్ జంగయ్య, వెంకటయ్య గౌడ్, యాదగిరి గౌడ్, మహేశ్వర్ రెడ్డి, పాండయ్య, రాజేందర్ రెడ్డి, స్వప్న, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

# తారా నగర్ తుల్జా భవాని అమ్మవారి గడపకు ప్రత్యేక పూజలు





**ఈ కార్యక్రమంలో పి ఎస్ సి చైర్మన్ గాంధీ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్**

**శేరిలింగంపల్లి,అక్టోబర్ 12 (ప్రజాజ్యోతి):** తారానగర్ శ్రీశ్రీశ్రీ తుల్జా భవాని అమ్మవారి ఆలయ పునర్నిర్మాణ మహోత్సవం.. అమ్మవారి గర్భగుడి గడపకు ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ,కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్.శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని తారానగర్ లోని శ్రీశ్రీశ్రీ తుల్జా భవాని అమ్మవారి ఆలయ పునర్నిర్మాణ మహోత్సవంలో భాగంగా నిర్వహించిన ప్రత్యేక పూజ కార్యక్రమాలు ఘనంగా జరిగాయి.దేవీ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని అమ్మవారి గర్భగుడి గడపకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ పూజ కార్యక్రమంలో పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి శాసనసభ్యులు అరెకపూడి గాంధీ,తెలంగాణ యాదవ కురుమ కో ఆపరేటివ్ చైర్మన్ రఘునాథ్ యాదవ్ తో కలిసి శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ ముఖ్య అతిథులుగా పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి కృపకు పాత్రులయ్యారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు,స్థానిక నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి ఆలయ పునర్నిర్మాణ విధివిధానాలు,అభివృద్ధి పనులపై చర్చించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ మాట్లాడుతూ... ఆలయ పునర్నిర్మాణానికి తన వంతుగా సంపూర్ణ సహకారం అందిస్తానని, ఆలయ అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.తుల్జా భవాని అమ్మవారి ఆలయాన్ని భక్తులకు మరింత సౌకర్యవంతంగా, అన్ని సదుపాయాలతో అభివృద్ధి చేసి.. శేరిలింగంపల్లి ప్రాంతానికి ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ ఎండోమెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సత్యచంద్ర రెడ్డి, సీనియర్ నాయకులు బీకే రాఘవరెడ్డి,ఆలయ కమిటీ చైర్మన్ బీకే రాజశేఖర్ రెడ్డి,డివిజన్ అధ్యక్షులు రాజు యాదవ్,గౌరవ అధ్యక్షులు వీరేశం గౌడ్,రఘునాథ్ రెడ్డి, కార్పొరేటర్లు ఉప్పలపాటి శ్రీకాంత్,కే రాంచందర్, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, ప్రధాన కార్యదర్శి రవీందర్ గౌడ్, గోవింద్ చారీ, పాండు,నటరాజ్, సత్యనారాయణ,ప్రకాష్, మహేష్, సంపత్, శశాంక్,చందు,ఆలయ కమిటీ సభ్యులు శిరీష, పవన్, సత్యనారాయణ,ే ణుక,శ్రీనాథ్ స్థానిక నాయకులు,భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# నీళ్లు లేక ఎండుతున్న వరి పైరు .. ట్యాంకర్లతో నీరు పోస్తున్న రైతు!





**రోజుకు రూ.1,000 అద్దెతో ట్యాంకర్ల ద్వారా పంటకు నీరు**

**వర్షాభావం.. తగ్గిన భూగర్భ జలాలు.. అప్రకటిత విద్యుత్ కోతలతో అన్నదాతకు కష్టాలు**

**20 రోజులు నీరు పోస్తేనే పంట బతుకుతుందంటూ రైతు ఆవేదన**

**షాబాద్ అక్టోబర్ 12 ( ప్రజా జ్యోతి )** షాబాద్ మండలం తిమ్మారెడ్డి గూడ గ్రామం వర్షాలు లేక.. భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో వరి పంటను కాపాడుకునేందుకు ఓ రైతు నానా అవస్థలు పడుతున్నాడు. పొలంలో నీరు లేక వరి పంట ఎండిపోతుండటంతో ట్యాంకర్ల ద్వారా నీటిని తెప్పించి పంటకు అందిస్తున్నాడు. రోజుకు రూ.1,000 అద్దె చెల్లిస్తూ పంటను కాపాడుకునేందుకు ప్రయత్నిస్తున్న ఈ రైతు పరిస్థితి అన్నదాతల కష్టాలకు అద్దం పడుతోంది. ఈ ఘటన షాబాద్ మండలం తిమ్మారెడ్డిగూడ గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రైతు రాజు సాగు చేసిన వరి పంటకు నీరు అందక ఎండిపోతుండటంతో ట్యాంకర్లను ఆశ్రయించాల్సి వచ్చింది. వర్షాభావ పరిస్థితులతో భూగర్భ జలాలు తగ్గిపోయి బోరుబావుల్లో నీటి మట్టం పడిపోవడంతో సకాలంలో నీరు అందడం లేదని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. దీనికి తోడు విద్యుత్ సరఫరా కూడా సక్రమంగా లేకపోవడంతో పంటకు నీరు పెట్టలేని పరిస్థితి నెలకొందని వాపోతున్నాడు. గత వారం రోజులుగా రోజుకు 10 నుంచి 15 ట్యాంకర్ల నీటిని పొలానికి తరలిస్తూ పంటను బతికించుకునేందుకు శ్రమిస్తున్నట్లు రైతు తెలిపాడు. మరో 20 రోజులపాటు ఇదే విధంగా నీటిని అందిస్తేనే పంట చేతికి వచ్చే అవకాశం ఉంటుందని, లేదంటే తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశాడు. ఇప్పటికే అర ఎకరం వరి పంట పూర్తిగా ఎండిపోవడంతో ఆ భూమిలో పశువులను మేపాల్సిన దుస్థితి ఏర్పడిందని తెలిపాడు.ఇంతటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ ఇప్పటివరకు వ్యవసాయ శాఖ అధికారులు కానీ, ఇతర సంబంధిత అధికారులు కానీ స్పందించలేదని రైతు వాపోయాడు. పంట సాగు చేసే సమయంలో నీటి లభ్యత, విద్యుత్ సరఫరా వంటి సమస్యలపై రైతులకు తగిన సూచనలు అందించాలని కోరాడు.ఇప్పటికే కరెంట్ కష్టాలు ఎక్కువగా ఉన్నపటికీ పట్టపగలే లైట్స్ వెలుగుతున్నాయి ఎన్నిసార్లు చెప్పినా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు వారిపై కూడా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని రైతు విజ్ఞప్తి

వరి పంటను కాపాడుకునేందుకు అప్పులు చేసి మరీ నీటిని కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని రైతు రాజు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ప్రభుత్వం స్పందించి వ్యవసాయానికి సకాలంలో విద్యుత్ సరఫరా చేయడంతోపాటు, పంటలకు నీటి కొరత ఏర్పడిన ప్రాంతాల్లో పరిస్థితిని పరిశీలించి రైతులకు అవసరమైన సహాయం అందించాలని విజ్ఞప్తి చేశాడు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పంటల పరిస్థితిని అంచనా వేసి తగిన సలహాలు, సూచనలు అందించాలని కోరుతున్నాడు. పంటను కాపాడుకునేందుకు రైతు పడుతున్న ఈ కష్టాలు వ్యవసాయ రంగంలో నీటి కొరత తీవ్రతను తెలియజేస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తమను ఆదుకోవాలని రైతు రాజు కోరుతున్నాడు

# అక్టోబర్ 14న భారత్--వెస్టిండీస్ టీ 20 క్రికెట్ మ్యాచ్

**2200 మంది పోలీస్ లతో పటిష్ట బందోబస్త్- 408 సీసీ కెమెరాలు, రెండు డ్రోన్ల ద్వారా నిరంతర నిఘా,సీపీ సుమతి**




**ఉప్పల్,అక్టోబర్ 11, (ప్రజాజ్యోతి):** భారత్--వెస్టిండీస్ క్రికెట్ మ్యాచ్ నేపథ్యంలో ఉప్పల్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం వద్ద పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ సుమతి తెలిపారు.ఈ నెల 14న జరగనున్న మ్యాచ్‌ను వీక్షించేందుకు సుమారు 40 వేల మంది ప్రేక్షకులు వచ్చే అవకాశం ఉండటంతో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు సోమవారం ఉప్పల్ స్టేడియం లో నిర్వహించిన మీడియా సమావేశంలో భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ ఏర్పాట్ల వివరాలను ఆమె వెల్లడించారు.

**"2,200 మంది పోలీసులతో బందోబస్తు"**

మ్యాచ్ ప్రశాంతంగా జరిగేలా మొత్తం 2,200 మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు నిర్వహించనున్నారు. ఇందులో ఐదుగురు డీసీపీలు, ఐదుగురు అదనపు డీసీపీలు, 15 మంది ఏసీపీలు, 50 మంది ఇన్‌స్పెక్టర్లు, 90 మంది సబ్ ఇన్‌స్పెక్టర్లతో పాటు ఇతర పోలీసు సిబ్బంది విధుల్లో పాల్గొంటారు. ఉప్పల్ డీసీపీ నోడల్ అధికారిగా వ్యవహరించనున్నారు. స్టేడియం పరిసరాలు, ప్రధాన రహదారులు, పార్కింగ్ ప్రాంతాలపై 408 సీసీ కెమెరాలు, రెండు డ్రోన్ల ద్వారా నిరంతరం నిఘా ఉంచుతారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే పోస్టులను కూడా పరిశీలిస్తూ, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అప్రమత్తంగా వ్యవహరిస్తామని సీపీ తెలిపారు.

# పండుగ సాయన్న విగ్రహ ఆవిష్కరణకు కొత్తపల్లి గ్రామ ప్రజలకు ఆహ్వానం

**కొత్తపల్లికి విచ్చేసిన నవాబుపేట మండల నాయకులు**



**చౌడాపూర్ మండలల్ (ప్రజా జ్యోతి) అక్టోబర్ 12 :** వికారాబాద్ జిల్లా చౌడాపూర్ మండల కేంద్ర పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో పండగ సాయన్న విగ్రహావిష్కరణ వాల్పోస్టర్ ఆవిష్కరించడం జరిగింది.నవాబుపేట మండలంలో ఈ నెల 14వ తేదీ,బుధవారం పండుగ సాయన్న విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించనున్నారు.ఈ కార్యక్రమానికి కొత్తపల్లి గ్రామ ప్రజలను ఆహ్వానించేందుకు నవాబుపేట మండల నాయకులు చౌడాపూర్ మండలం కొత్తపల్లి గ్రామానికి విచ్చేశారు.ఈ సందర్భంగా కొత్తపల్లి గ్రామ సర్పంచ్ జంబుల రజిత నర్సింలు ఆధ్వర్యంలో గ్రామ ప్రజలు నాయకులకు సాదర స్వాగతం పలికారు.అనంతరం పండుగ సాయన్న విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి సంబంధించిన వివరాలను నాయకులు గ్రామ ప్రజలకు తెలియజేస్తూ,కార్యక్రమానికి హాజరుకావాలని ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ముదిరాజ్ సంఘం అధ్యక్షులు మారెమోని నర్సింహులు,నవాబుపేట మండల నాయకులు ప్రతాప్,కృష్ణయ్య,భాను ప్రకాష్,నర్సింలు,బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ,పండుగ సాయన్న విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి కొత్తపల్లి గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. గ్రామ ప్రజలందరూ ఐకమత్యంతో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

# పరిగిలో అండర్-17 తైక్వాండో పోటీలు

**క్రీడలతో క్రమ శిక్షణ, సమాజ సేవకు ప్రోత్సాహం: మీర్ తాహేర్ అలీ**





**పరిగి, అక్టోబర్ 12 (ప్రజాజ్యోతి):** పది జిల్లాలకు చెందిన అండర్-17 బాలబాలికల తైక్వాండో పోటీలను సోమవారం మధ్యాహ్నం పరిగి పట్టణంలోని నంబర్ వన్ స్కూల్ సమీపంలో ఉన్న స్టేడియం మైదానంలో ప్రారంభించారు. ఈ పోటీల్లో వివిధ జిల్లాలకు చెందిన బాలబాలికలు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ సందర్భంగా పరిగి మున్సిపాలిటీ 13వ వార్డు కౌన్సిలర్ మీర్ సమీనా తాహేర్ అలీ పాల్గొని విజేతలకు అభినందించారు. పరిగి పట్టణంలో ఇటువంటి క్రీడా పోటీలు నిర్వహించడం గొప్ప విషయమని వారు అన్నారు. తైక్వాండో వంటి యుద్ధకళల శిక్షణతో విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెరగడంతో పాటు దేహదారుఢ్యం మెరుగుపడుతుందని అన్నారు. క్రీడలు యువతలో సేవాభావాన్ని పెంపొందించడానికి కూడా దోహదపడతాయని తెలిపారు.

అనంతరం నిర్వాహకులు అతిథులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో తైక్వాండో శిక్షకులు, పట్టణ ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s Sai Krishna Publications, Owned by M/s Sai Krishna Publications Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at Plot No. 3, Flat No.13, Surya Saroj Apartments, HUDA Complex, Saroornagar Ranga Reddy District.(Hyd) - 500 035, Telangana. Editor : V. SRINIVAS REDDY, cell:9440231967 RNI No. APTEL/2010/36516, prajajyothiadilabad@gmail.com

# ఎస్కీలో శిక్షణ పొందిన ఇంజినీర్లు వికసిత్ భారత్ నిర్మాణానికి కృషి చేయాలి




**శేరిలింగంపల్లి, అక్టోబర్ 12 (ప్రజాజ్యోతి):** భారతదేశంలో సుమారు 25 కోట్ల విద్యుత్ మీటర్లను అయిదారు సంవత్సరాల వ్యవధిలో స్మార్ట్ మీటర్లుగా మార్చేసే అవకాశం ఉందని, దేశ విద్యుత్ రంగంలో డిజిటల్ మార్పునకు ఇది ఒక ముఖ్యమైన ముందడుగని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఇంజనీర్స్ వికసిత్ భారత్ సాధనకు కృషి చేయాలని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ డైరెక్టర్ కల్నల్ హర్పాల్ సింగ్ గ్రేవాల్ పిలుపునిచ్చారు.ఎస్కీలోని పవర్ అండ్ ఎనర్జీ, వాటర్ రిసోర్సెస్ డెవలప్మెంట్ డివిజన్స్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఐదు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని కల్నల్ హెచ్.ఎస్. గ్రేవల్ సోమవారం 12, అక్టోబర్ 2026 న ప్రారంభించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి 122 మంది పాల్గొంటున్నారు.సాంకేతిక విద్య, నైపుణ్యాభివృద్ధిలో ఎస్కీ పోషిస్తున్న పాత్రను ప్రస్తావిస్తూ, దేశంలోనే తొలిసారిగా ఎస్కీలో స్మార్ట్ మీటర్ ప్రయోగశాలను ఏర్పాటు చేసినట్లు డైరెక్టర్ తెలిపారు. స్మార్ట్ మీటరింగ్ సాంకేతిక పరిజ్ఞానంపై ప్రత్యేక శిక్షణ అందించడంలో ఈ ప్రయోగశాల కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.మినిస్ట్రీ ఆఫ్ పవర్ లోని పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా శిక్షణకు నామినేట్ చేయబడిన అభ్యర్థులు స్మార్ట్ మీటర్ల ప్రయోజనాలను సమగ్రంగా తెలుసుకోవాలని ఆయన సూచించారు. మధ్యప్రదేశ్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్మెంట్ నామినేట్ చేయబడిన అభ్యర్థులకు కాంపాక్ట్ సబ్‌స్టేషన్లు, భూగర్భ హైటెన్షన్ కేబుల్ వ్యవస్థలు, లైటింగ్ సంబంధిత అంశాలపై శిక్షణ అందించనున్నారు. అదేవిధంగా, భారత కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) ద్వారా నామినేట్ చేయబడిన అభ్యర్థులకు ఇంజినీరింగ్ ప్రాజెక్టు పనులకు సంబంధించిన అంచనాల తయారీ, సమగ్ర ప్రాజెక్టు నివేదికల రూపకల్పనపై శిక్షణ ఇవ్వనున్నారు. ఇందులో ఆనకట్టలు, కాలువలు వంటి నీటిపారుదల ప్రాజెక్టులు, జాతీయ రహదారులు, తాగునీటి సరఫరా వ్యవస్థ, మురుగునీటి పారుదల, డ్రైనేజీ వ్యవస్థలకు సంబంధించిన డీపీఆర్‌ల తయారీ అంశాలు ఉన్నాయి. ఎస్కీలో శిక్షణ పొందిన ఇంజినీర్లు కేవలం సాంకేతిక పరిజ్ఞానాన్ని సంపాదించడానికే పరిమితం కాకుండా, తమ తమ రంగాల్లో నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలని కల్నల్ గ్రేవల్ సూచించారు. దేశ నిర్మాణంలో తమ వంతు పాత్ర పోషించాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎస్కీకి చెందిన వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

# సహజ వజ్రాభరణాల జూరీ విస్తరణ ప్రణాళికలు





**ఏడాదిలో 25 కొత్త స్టోర్ల ఏర్పాటు లక్ష్యం**
**మొదటి స్టోర్ ఈనెల 18న రాజ్ భవన్ రోడ్‌లో..**
**'ఫ్రాంచైజ్ ఓన్డ్, కంపెనీ ఆపరేటెడ్' మోడల్‌తో విస్తరణ**

**శేరిలింగంపల్లి,అక్టోబర్ 12 (ప్రజాజ్యోతి):** నైపుణ్యం, పారదర్శకత,కస్టమర్ల నమ్మకానికి ప్రతీకగా నిలిచి సహజ ఆభరణాలకు ప్రసిద్ధి చెందిన జూరీ దేశవ్యాప్తంగా తన కార్యకలాపాలు విస్తరించేందుకు సిద్ధమైంది.వచ్చే ఏడాది కాలంలో దేశవ్యాప్తంగా 25 కొత్త స్టోర్లను ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకుంది.ఈ వివరాలు తెలిపేందుకు మాదాపూర్‌లో ఉన్న డిస్ట్రిక్ట్ 150 బై క్వోరం హోటల్లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జూరీ వ్యవస్థాపకుడు మహేష్ చౌదరి మాట్లాడుతూ... ఫ్యాక్టరీ స్థాయి నుంచి వినియోగదారులకు సేవలందించే దిశగా అడుగులు వేస్తున్నామన్నారు.రాబోయే మూడు నెలల్లో హైదరాబాద్‌లో నాలుగు స్టోర్లను ప్రారంభించనున్నామని చెప్పారు. వీటిలో మొదటి స్టోర్ రాజ్ భవన్ రోడ్‌లో ఈనెల 18వ తేదీన ప్రారంభం కానుందన్నారు.దేశవ్యాప్తంగా ప్రధాన నగరాలకు విస్తరిస్తున్న క్రమంలో ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌ను కూడా ప్రారంభించాలని యోచిస్తున్నామన్నారు.దీని ద్వారా ఆన్‌లైన్-ఆఫ్‌లైన్ సమగ్ర రిటైల్ సేవలు అందిస్తూ.. తమ రోజువారీ కలెక్షన్లను దేశవ్యాప్తంగా ఉన్న వినియోగదారులకు అందుబాటులోకి తేనున్నామన్నారు. ఆభరణాల తయారీలో రెండు దశాబ్దాలకు పైగా అనుభవం ఉందన్నారు. ఆధునిక లైఫ్‌స్టైల్ డిజైన్లు, సర్టిఫైడ్ సహజ వజ్రాలు, అసలైన రత్నాలు, బీఐఎస్ హాల్‌మార్క్ 18, 14, 9 క్యారెట్ల కలిగిన నాణ్యమైన బంగారు ఆభరణాలు అందిస్తున్నామన్నారు. విభిన్న శైలులు, వివిధ సందర్భాలకు సరిపోయేలా ప్రత్యేకమైన కలెక్షన్లు కలవన్నారు. ఆభరణాలు చిరకాలం మన్నికగా ఉండేలా ఎలా తయారు చేయాలో తెలుసన్నారు. జూరీలోని ప్రతి డిజైన్ ఆ అనుభవంతోనే రూపుదిద్దుకుంటుందన్నారు. ఆభరణాల కొనుగోలు అనేది కేవలం అమ్మకాలపై కాకుండా విశ్వాసంపై ఆధారపడి ఉండాలని నమ్ముతున్నామన్నారు. కస్టమర్లు మా స్టోర్‌కు వచ్చిన సారే కాకుండా భవిష్యత్తులో కూడా సేవలు అందించడమే మా లక్ష్యమన్నారు.

# రైతు నేస్తం ప్రత్యక్ష ప్రసారానికి మిశ్రమ స్పందన





**తాండూరులో వెలవెల బోయిన రైతు వేదికలు**
**ఉన్నతాధికారుల సూచనలు గాలి మూటలేనా..!**

**తాండూరు అక్టోబర్ 12 ప్రజా జ్యోతి :-** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు నేస్తం ప్రత్యక్ష ప్రసారానికి రైతులు ఎవరు కూడా హాజరుకాలేని పరిస్థితి నెలకొంది. సోమవారం రోజు జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఏర్పాటుచేసిన రైతు నేస్తం 110వ ఎపిసోడ్ లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొని రైతులతో ముఖాముఖిగా మాట్లాడే విధంగా అధికారులు ఏర్పాటు చేశారు. దీంతో తాండూరు మండలంలోని బెల్కటూరు, అంతారం రైతు వేదికలలో ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించే ఏర్పాట్లు చేశారు. ఇట్టి కార్యక్రమం అధికారుల నిర్లక్ష్యం కారణంగా కొంతమేరకు రద్దు చేసినట్లు చెప్పిన ఉన్నతాధికారులు తిరిగి కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నట్లు ప్రకటించడంతో రైతులెవ్వరు కూడ పాల్గొన లేక పోయినప్పటికీ వ్యవసాయ అధికారులు హాజరు కాక తప్పలేదు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం (పిజేటిఏయు)ఎలక్ట్రానిక్ వింగ్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ సహకారం తో నిర్వహిస్తున్న "రైతు నేస్తం" ప్రత్యక్ష ప్రసారంలో భాగంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సురేంద్రమోహన్, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సర్ ఆల్ దాస్ జానయ్యలు రైతులకు పలు సూచనలు చేశారు. ప్రస్తుతం ఎల్ నీనో ప్రభావంతో వర్షపాతం తక్కువగా ఉండడంతో రానున్న రవి సీజన్లో రైతులు నీటి ఉపయోగం తక్కువగా వాడే పంటలనే సాగు చేయాలని సూచించారు. అదేవిధంగా వరి కొనుగోలు కేంద్రాలు రైతు భరోసా ఉచిత విద్యుత్తు, వంటి సంక్షేమ పథకాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో తాండూర్ వ్యవసాయ అధికారి కొమరయ్య, ఏ ఈ ఓ లు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమకారుల రిలే నిరాహార దీక్షలు 26వ రోజుకు

**ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలి.. ఉద్యమకారులకు న్యాయం చేయాలి**




**అల్వాల్, అక్టోబర్ 12 (ప్రజా జ్యోతి):** తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అల్వాల్‌లో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 26వ రోజుకు చేరుకున్నాయి. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కీలక పాత్ర పోషించి, ఎన్నో త్యాగాలు చేసిన ఉద్యమకారులకు న్యాయం చేయాలని దీక్షా శిబిరం వేదికగా నాయకులు ప్రభుత్వాన్ని కోరారు.తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమకారులు ముందుండి పోరాడారని, ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొని ప్రత్యేక రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించారని నాయకులు పేర్కొన్నారు. అలాంటి ఉద్యమకారుల సేవలను ప్రభుత్వం గుర్తించి, వారికి తగిన గౌరవం కల్పించడంతో పాటు సంక్షేమానికి అవసరమైన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఉందని అన్నారు.ఉద్యమకారుల సంక్షేమానికి సంబంధించిన విధివిధానాలను త్వరితగతిన ఖరారు చేసి, అర్హులైన వారందరికీ న్యాయం చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇచ్చిన హామీలను అమలు చేయడంలో జాప్యం చేయకుండా, ఉద్యమకారుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ఈరోజు రిలే నిరాహార దీక్షలో పాసుల ముత్యాలు, అంబర్‌పేట విద్యార్థి నాయకుడు నిఖిల్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పటోళ్ల సురేందర్ రెడ్డి, పుట్నాల కృష్ణ, మంద శోభన్, అనంతుల సంతోష్, శేరుపల్లి మల్లేష్, సంఘమేశ్వర్, సత్తయ్య తదితరులు పాల్గొని దీక్షకు సంఘీభావం తెలిపారు.
తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేసి, వారి సంక్షేమానికి తగిన చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా నాయకులు మరోసారి డిమాండ్ చేశారు.

# బషీరాబాద్ మండలంలో వైభవంగా దేవీ నవరాత్రి ఉత్సవాలు

**కులమత భేదాలు లేకుండా ప్రశాంతంగా నిర్వహించాలి: ఎస్ఐ విఠల్**



**బషీరాబాద్, అక్టోబర్ 12 (ప్రజాజ్యోతి):** వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలంలో వైభవంగా దేవీ నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. బషీరాబాద్, మైల్వార్, దామర్‌చెడ్, ఎక్మాయి, కంసాన్పల్లి (బి),రెడ్డిఘణపూర్, కాశీంపూర్, బాద్లాపూర్, గొట్టిగకలాన్ తదితర గ్రామాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఉత్సవాలు జరుగుతున్న పలు గ్రామాలను ఎస్ఐ విఠల్ సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ కులమత భేదాలు లేకుండా సామరస్యంతో, ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో దేవీ నవరాత్రి ఉత్సవాలను నిర్వహించుకోవాలని సూచించారు. దేవి నవరాత్రుల ఉత్సవాల మండపాలకు పోలీసుల అనుమతులు తీసుకోవాలని ఎస్ఐ సూచించారు. ఈ కార్యక్రమంలో గోట్టిగ కాలాన్ సర్పంచ్ సాబేర్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటి మేడపైనుండి కిందపడి వ్యక్తి మృతి



**దోమ అక్టోబర్ 12 ( ప్రజాజ్యోతి ) :** వికారాబాద్ జిల్లా దోమ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో విషాదకర ఘటన చోటుచేసుకుంది.బంధువుల ఇంట్లో శుభకార్యానికి వచ్చిన ఓ వ్యక్తి ఇంటి మేడపై నిద్రిస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.వివరాల్లోకి వెళితే..వికారాబాద్ జిల్లా కొడంగల్ మండలం గుండ్లకుంట గ్రామానికి చెందిన గొల్ల కృష్ణయ్య (32), వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవాడు.తన అక్క ఇంట్లో జరిగిన శుభకార్యానికి హాజరయ్యేందుకు కొత్తపల్లి గ్రామానికి వచ్చాడు.ఈ క్రమంలో రాత్రి సమయంలో ఇంటి మేడపై నిద్రిస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడటంతో తీవ్ర గాయాలై మృతి చెందినట్లు సమాచారం. ఈ ఘటనపై మృతుడి భార్య గొల్ల కాశమ్మ (28) పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి ఘటనకు సంబంధించిన వివరాలను సేకరిస్తున్నారు. కృష్ణయ్య మృతికి దారితీసిన పరిస్థితులపై విచారణ జరుపుతూ ప్రమాదం జరిగిన తీరును తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు.వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న కృష్ణయ్య ఆకస్మిక మృతితో కుటుంబంలో విషాదం నెలకొంది. కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. పోలీసులు దర్యాప్తు పూర్తిచేసిన అనంతరం ఘటనకు సంబంధించిన మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

# అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛన్ అందేలా చూస్తాం జడ్పీ సీఈవో సుధీర్





**ధారూర్, అక్టోబర్ 12( ప్రజా జ్యోతి):** అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛన్ అందేలా చేస్తామని జెడ్పి సీఈఓ సుధీర్ అన్నారు. సోమవారం మండలం పరిధిలోని చింతకుంట, హరిదాసు పల్లి, ధారూర్ స్టేషన్ గ్రామాలలో ఆయన సందర్శించి పింఛన్ లబ్ధిదారుల ఇంటికి వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అప్లికేషన్ చేసిన ప్రతి ఒక్కరికి పింఛన్ అందుతుందని వారికి భరోసానిచ్చారు. అనంతరం ఎల్ నినో ప్రభావం వల్ల ముందు ముందు గ్రామాలలో నీటి సమస్య ఎక్కువ ఉందని దీనికి గాను ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని గ్రామ పంచాయతీ కార్యదర్శులను పలు సూచనలు చేశారు. గ్రామాలలో వివిధ సమస్యలపై అడిగి తెలుసుకున్నారు.

**నేడు నాగసమందర్ లో**

పింఛన్ వెరిఫికేషన్ లో భాగంగా మంగళవారం నాగసమందర్ లో జడ్పీ సీఈవో సుధీర్ గ్రామాన్ని సందర్శించి పింఛన్ లబ్ధిదారులను నేరుగా వివరాలు అడిగి తెలుసుకున్నారని గ్రామ సర్పంచ్ వెంకటేశ్వర్ ఓ ప్రకటనలో తెలిపారు.

# బంట్వారం నూతన ఎస్ఐ గా పుండ్లిక్




**బంట్వారం, అక్టోబర్ 12 (ప్రజా జ్యోతి):** బంట్వారం మండల నూతన ఎస్ఐ గా పుండ్లిక్ సోమవారం పదవి బాధ్యతలు చేపట్టారు, అనంతరం ఆయన వికారాబాద్ టౌన్ లో సమర్థవంతంగా వీధులు నిర్వహించి బదిలీపై బంట్వారం మండలానికి రావడం జరిగింది, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,,,, మండలంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం తన వంతు కృషి చేస్తానని, ఇక్కడ కూడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూస్తానని, మారక ద్రవ్యల పై ఉక్కు పాదం మోపుతానని, గ్రామాలలో ఎక్కడ కూడా రోడ్లపై మద్యం సేవించుట గానీ చేసినట్లయితే తక్షణమే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు.

# క్షణాత్మక డ్రైవింగ్ అలవాటు చేసుకోవాలి...

**చెల్లుబాటయ్యే సరైన పత్రాలు కలిగి ఉండాలి**
**ఇబ్రహీంపట్నం ట్రాఫిక్ సిఐ జితేందర్ రెడ్డి**



**ఇబ్రహీంపట్నం అక్టోబర్ 12 ప్రజాజ్యోతి:** విద్యార్థులకు, ఆటో డ్రైవర్లకు, రోడ్డు భద్రత ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని, సీఐ జితేందర్ రెడ్డి వెల్లడించారు. సోమవారం ఫ్యూచర్ సిటీ కమిషనరేట్, ఇబ్రహీంపట్నం ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం శాస్త్రగార్డెన్ సమీపంలో ఏమైంది రా అరేయ్ వాహన తనిఖీలు చేపట్టారు. విద్యార్థులకు ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రత ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ట్రాఫిక్ సిఐ జితేందర్ రెడ్డి మాట్లాడుతూ... ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ వేసుకోవాలని, వాహనాలను అతివేగంగా వాహనాలు నడపకూడదని, రాంగ్ రూట్‌లో వాహనాలు నడిపి ఇతరులకు ఇబ్బందులు కలిగించవద్దని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించకూడదని, ప్రయాణికుల ప్రాణాలకు ప్రమాదం వాటిల్లుతుందని అన్నారు. వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు రక్షణాత్మక డ్రైవింగ్ అలవాటు చేసుకోవాలని వాహనదారులకు సిఐ సూచించారు. ప్రజలందరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని, ఇబ్రహీంపట్నం ట్రాఫిక్ జితేందర్ రెడ్డి, వాహనదారులకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్ఐ సురేష్, ఇతర సిబ్బంది, వాహనదారులు తదితరులు పాల్గొన్నారు.

# శంకర్ పల్లి మండలం మోకిలా పిఎసిఎస్ చైర్మన్ గా గౌంగ్ర సత్యం ఘనంగా బాధ్యతల స్వీకరణ..





**శంకర్ పల్లి: అక్టోబర్ 12 (ప్రజా జ్యోతి)** రంగారెడ్డి జిల్లా శంకర్ పల్లి మండలం మోకిలా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పిఎసిఎస్ చైర్మన్ గా గౌంగ్ర సత్యం సోమవారం ఘనంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో పిఎసిఎస్ డైరెక్టర్లు, సభ్యులు, స్థానిక రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. పలువురు నాయకులు ఆయనకు పూలమాలలు వేసి, శాలువాతో సత్కరించి శు భాకాంక్షలు తెలిపారు. అనంతరం గౌంగ్రా సత్యం మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో పిఎసిఎస్ చైర్మన్ గా అవకాశం కల్పించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. రైతుల సంక్షేమమే తన ప్రధాన లక్ష్యమని, సంఘాన్ని మరింత బలోపేతం చేసి రైతులకు అన్ని విధాలా అండగా ఉంటానని పేర్కొన్నారు. ముఖ్యంగా చిన్న, సన్నకారు రైతులకు సకాలంలో పంట రుణాలు, ఎరువులు, విత్తనాలు అందేలా చర్యలు తీసుకుంటానని, పిఎసిఎస్ ద్వారా రైతులకు అందుతున్న సేవలను మరింత విస్తరిస్తానని హామీ ఇచ్చారు.రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పిఎసిఎస్ మాజీ చైర్మన్ గోపాల్, డైరెక్టర్లు, సహకార సంఘ సభ్యులు, గ్రామ పెద్దలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# కుషాయిగూడ డివిజన్ లో మొత్తం ప్రతిపాదిత నిధులు: ?3 కోట్ల 94 లక్షలు

**ప్రజా మౌలిక వసతుల అభివృద్ధికి పెద్దపీట**

**పలు కాలనీల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**



**ఉప్పల్,అక్టోబర్ 12, ( ప్రజా జ్యోతి ):** ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని కుషాయిగూడ డివిజన్ లో వివిధ కాలనీల్లో ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శంకుస్థాపన చేశారు. కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థలు, ఆర్‌సీసీ పైప్‌లైన్ వంటి మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం ద్వారా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

ఈ సందర్భంగా పలు కాలనీల్లో చేపట్టనున్న అభివృద్ధి పనుల వివరాలు, వాటికి కేటాయించిన నిధులు:

1. వైష్ణవి ఎన్‌క్లేవ్ -- ?36 లక్షలు
2. ఆదర్శ్ నగర్ -- ?20 లక్షలు
3. చక్రిపురం -- ?22 లక్షలు
4. లక్ష్మీనరసింహ కాలనీ -- ?26 లక్షలు
5. కుషాయిగూడ గ్రామం -- ?30 లక్షలు
6. భారత్ నగర్ -- ?29.70 లక్షలు
7. ధోబీఘాట్ -- ?19.80 లక్షలు
8. హనుమాన్ నగర్ -- ?17 లక్షలు
9. శివ సాయి నగర్ -- ?42 లక్షలు
10. మారుతి నగర్ -- ?25 లక్షలు
11. నాగార్జున నగర్ -- ?35 లక్షలు
12. సోనియా గాంధీ నగర్ -- ఆర్‌సీసీ పైప్‌లైన్ పనులకు ?25 లక్షలు
13. శ్రీనివాస్ ఎన్‌క్లేవ్ -- ?40 లక్షలు
14. ఇందిరా నగర్ -- యూజీడీ పనులకు ?27.50 లక్షలు

ఈ అభివృద్ధి పనుల ద్వారా కాలనీల్లో మౌలిక సదుపాయాలు మరింత మెరుగుపడటంతో పాటు, స్థానిక ప్రజలకు సౌకర్యవంతమైన జీవన పరిస్థితులు అందుబాటులోకి రానున్నాయి. ముఖ్యంగా డ్రైనేజీ సమస్యల పరిష్కారం, మురుగునీటి పారుదల వ్యవస్థ మెరుగుదల, పైప్‌లైన్ సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనం చేకూరనుంది. ఉప్పల్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి, కాలనీల వారీగా అభివృద్ధి పనులు చేపడుతూ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు,బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# హిమాయత్‌నగర్‌లో ప్రభుత్వ భూమిపై సమగ్ర విచారణ జరపాలి





**సర్వే నం. 4/21లో 3 ఎకరాల 34 గుంటల భూమిపై అనుమానాలు**

**మెలుహా ఇంటర్నేషనల్ స్కూల్ నిర్మాణంపై అధికారుల దృష్టి సారించాలి**

**భూమి బదిలీ, రిజిస్ట్రేషన్ రికార్డులను పరిశీలించాలి**

**నిష్పక్షపాత విచారణ జరిపి వాస్తవాలు వెల్లడించాలి**

**మొయినాబాద్ :అక్టోబర్ 12 (ప్రజా జ్యోతి)** రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం హిమాయత్‌నగర్ గ్రామ పరిధిలోని సర్వే నం. 4/21లో ఉన్నట్లు పేర్కొంటున్న 3 ఎకరాల 34 గుంటల భూమి బదిలీ, రిజిస్ట్రేషన్, ప్రస్తుత వినియోగంపై సమగ్ర విచారణ జరిపించాలని స్థానిక నివాసి కంజర్ల శేఖర్ సంబంధిత అధికారులను కోరారు. ఈ భూమికి సంబంధించిన అసలు రికార్డులను పరిశీలించి వాస్తవాలను వెలికితీయాలని విజ్ఞప్తి చేశారు. తమ తాతగారికి చెందినదిగా, ప్రభుత్వ లేదా అసైన్డ్ భూమిగా కేటాయించబడినట్లు తమ కుటుంబం పేర్కొంటోందని శేఖర్ తెలిపారు. తమ తాతగారు షెడ్యూల్డ్ కులాల (ఎస్సీ) సామాజిక వర్గానికి చెందినవారని పేర్కొంటూ, భూమికి సంబంధించిన అసైన్మెంట్ రికార్డులు, పట్టా పత్రాలు, రెవెన్యూ నమోదులు, యాజమాన్య వివరాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలని కోరారు.

**రిజిస్ట్రేషన్‌పై విచారణ అవసరం**

సదరు భూమికి సంబంధించి సేల్ డీడ్ డాక్యుమెంట్ నం. 6829/2017 చెవెళ్ల సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో నమోదైనట్లు పేర్కొంటూ, ప్రభుత్వ లేదా అసైన్డ్ భూమి బదిలీకి చట్టపరమైన అనుమతులు ఉన్నాయా అనే అంశాన్ని పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. భూమి స్వభావం, బదిలీకి సంబంధించిన నిబంధనలు, రిజిస్ట్రేషన్‌కు ఆధారమైన పత్రాలను ధ్రువీకరించాలని కోరారు. పాఠశాల నిర్మాణ అనుమతులపై దృష్టి సర్వే నం. 4/21లో ఉన్నట్లు పేర్కొంటున్న మెలుహా ఇంటర్నేషనల్ స్కూల్ నిర్మాణం, భూమి వినియోగం, నిర్మాణ అనుమతులు, సంబంధిత రెవెన్యూ రికార్డులను పరిశీలించాలని శేఖర్ కోరారు. ఈ అంశంపై గతంలో వినతిపత్రాలు సమర్పించినట్లు పేర్కొంటూ, జిల్లా కలెక్టర్, రెవెన్యూ శాఖ, రిజిస్ట్రేషన్ శాఖ, సంబంధిత ప్రణాళికా అధికారులు స్పందించాలని విజ్ఞప్తి చేశారు.

**రికార్డుల ఆధారంగా చర్యలు తీసుకోవాలి**

సదరు భూమి ప్రభుత్వ లేదా అసైన్డ్ భూమిగా నిర్ధారణ అయితే, దాని బదిలీ చట్టబద్ధతను పరిశీలించి నిబంధనలకు విరుద్ధంగా చర్యలు జరిగినట్లు తేలితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. అసలు రికార్డుల ఆధారంగా నిష్పక్షపాత విచారణ జరిపి భూమి స్థితిగతులను ప్రజలకు స్పష్టం చేయడంతో పాటు, చట్టప్రకారం అర్హత ఉంటే తమ కుటుంబ హక్కులను పరిరక్షించాలని కంజర్ల శేఖర్ విజ్ఞప్తి చేశారు.

# మేడ్చల్ బెంగళూరు బేకరీలో ఎస్ఓటీ సోదాలు!

**కాలం చెల్లిన సింథటిక్ కలర్స్, పిండి వంటలు లభ్యం**

**ఫుడ్ సేఫ్టీ అధికారులు ఏం చేస్తున్నట్లు?**





**మేడ్చల్, అక్టోబర్ 12 (ప్రజాజ్యోతి):** బేకరీలు, స్వీట్ హౌస్‌లపై ఎస్ఓటి అధికారులు తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేస్తున్నా, నిర్వాహకుల తీరు మారడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మేడ్చల్ పట్టణంలోని బెంగళూరు బేకరీలో సోమవారం మధ్యాహ్నం ఎస్ఓటీ అధికారులు తనిఖీలు నిర్వహించగా, కాలం చెల్లిన సింథటిక్ కలర్స్, పిండి వంటలు లభ్యమైనట్లు సమాచారం. ఈ ఘటన ఆహార భద్రతా ప్రమాణాల అమలుపై మరోసారి ప్రశ్నలు లేవనెత్తుతోంది.

గతంలో మేడ్చల్‌లోని కృష్ణ బేకరీతో పాటు ఎల్లంపేట మున్సిపాలిటీ పరిధిలోని డబిల్‌పూర్‌లో ఉన్న బాలాజీ స్వీట్ హౌస్‌పైనా ఎస్ఓటీ అధికారులు దాడులు నిర్వహించారు. అక్కడ కూడా ఇలాంటి ఉల్లంఘనలు వెలుగుచూసినట్లు సమాచారం. గతంలో తనిఖీలు, కేసుల నమోదు జరిగినప్పటికీ మళ్లీ ఇలాంటి ఘటనలు వెలుగులోకి రావడం వ్యాపార సంస్థల నిర్వహణ తీరుపై విమర్శలకు తావిస్తోంది.

ఫుడ్ సేఫ్టీ అధికారులు ఏం చేస్తున్నట్లు? బేకరీలు, స్వీట్ హౌస్‌లలో ఎస్ఓటీ అధికారులు తనిఖీలు నిర్వహించి కాలం చెల్లిన పదార్థాలను గుర్తిస్తున్నప్పుడు, ఆహార భద్రతను నిరంతరం పర్యవేక్షించాల్సిన ఫుడ్ సేఫ్టీ అధికారులు ఏం చేస్తున్నారనే ప్రశ్నలు ప్రజల్లో తలెత్తుతున్నాయి. ఆహార పదార్థాల నాణ్యతను ముందుగానే తనిఖీ చేసి, నిబంధనల ఉల్లంఘనలను అడ్డుకోవాల్సిన అధికారులు ఎక్కడున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇతర శాఖల తనిఖీల్లో ఉల్లంఘనలు బయటపడిన తర్వాతే స్పందిస్తారా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. తనిఖీలు ఎన్ని చేసినా మార్పు లేదా? ప్రజల ఆరోగ్యంతో ముడిపడిన ఆహార పదార్థాల విషయంలో నిర్లక్ష్యాన్ని సహించకూడదని ప్రజలు కోరుతున్నారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు ముమ్మరం చేసి, నిబంధనలు ఉల్లంఘించే సంస్థలపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. తనిఖీలు, కేసులకే పరిమితం కాకుండా ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతున్నారు.

# సీఈసీ రాజీనామా చేయాలని కాంగ్రెస్ ధర్నా

**ఢిల్లీలో నిరసన తెలిపిన చేవెళ్ల నేతలు**



**చేవెళ్ల అక్టోబర్ 12(ప్రజా జ్యోతి):** కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో కాంగ్రెస్ నిర్వహించిన ధర్నాలో చేవెళ్ల నాయకులు పాల్గొన్నారు. టీపీసీసీ ఉపాధ్యక్షుడు జనార్దన్ రెడ్డి, చేవెళ్ల మున్సిపల్ అధ్యక్షుడు బి. శ్రీనివాస్ గౌడ్, మాజీ మండల అధ్యక్షుడు వీరేందర్ రెడ్డి తదితరులు నిరసన తెలిపారు. ఎన్నికల వ్యవస్థలో పారదర్శకతను కాపాడాలని, ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించాలని డిమాండ్ చేశారు.

# రామంతపూర్ అయ్యప్ప స్వామి ఆలయంలో కరపత్రాల పంపిణీ

**కల్లాడి ఆదిశంకరాచార్య మఠం అద్వైత సంఘం, ఉన్నికృష్ణన్ నంబూద్రి**

**డిసెంబర్ 12న కోటి నామార్చన కార్యక్రమం**



**ఉప్పల్,అక్టోబర్12,( ప్రజా జ్యోతి ):** కల్లాడి ఆదిశంకరాచార్య మఠం ఉన్నికృష్ణ నంబూద్రి ఆధ్వర్యం లో అద్వైత సంఘం తేదీ 12 డిసెంబర్ 2026 రెండవ శనివారం నాడు అద్వైత సంఘశీ కోటి నామార్చన కార్యక్రమం జరగబోతుంది. ఈ యొక్క కార్యక్రమానికి గాను నేడు రామంతాపూర్ అయ్యప్ప స్వామి గుడిలో తెలంగాణ రాష్ట్ర మొత్తం ఆహ్వాన యాత్ర నేడు ప్రారంభమైంది. నవంబర్ 21 నుంచి తెలంగాణ మొత్తం రథయాత్ర జరగబోతుంది దీనికి అంకురార్పణగా నేడు మన రామంతపూర్ అయ్యప్ప స్వామి టెంపుల్ లో ఆహ్వాన యాత్ర కాలడి ఆది శంకరాచార్య మఠం సభ్యులతో కలిసి విక్రం రెడ్డి, ఉమాకాంత్ రామంతపూర్ గుడి సభ్యులు మురళీధర్ గురుస్వామి ఆధ్వర్యంలో ఫణి కుమార్ ప్రహల్లాద,ఏం రాజేష్ ప్రజాపతి,రాజి రెడ్డి,రేవు నరసింహ, నగేష్ గుప్తా,అరుణ్ సాయి,రాము తదితర గురుస్వాములు అయ్యప్ప భక్తులు పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం డిసెంబర్ 12న జరిగే కోటి నామార్చిన కార్యక్రమాన్ని దిగ్విజం చేయవలసిందిగా ప్రతి ఒక్క గురుస్వాములను అయ్యప్ప స్వామి మాలధారణ చేసే భక్తులను కోరుకుంటున్నాము.

# మైలార్దేవుపల్లిలో గంజాయి పట్టివేత

**ఇద్దరు నిందితులు షేక్ ఇర్ఫాన్, షేక్ ఇమ్రాన్ అరెస్ట్**

**1.268 కిలోల గంజాయి స్వాధీనం**





**రాజేంద్రనగర్, అక్టోబర్ 12 (ప్రజా జ్యోతి)** అక్రమంగా గంజాయి విక్రయిస్తూ పోలీసులకు పట్టుపడ్డ ఘటన మైలార్దేవుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని వట్టేపల్లి రైల్వే బ్రిడ్జ్ వద్ద చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మైలార్దేవుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని వట్టేపల్లి రైల్వే బ్రిడ్జ్ కింద గంజాయి అక్రమ విక్రయం జరుగుతోందనే పక్కా సమాచారంతో పోలీసులు సోమవారం ఉదయం దాడులు నిర్వహించారు.పోలీసులను చూడగానే పారిపోయేందుకు యత్నించిన ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు.హైదరాబాద్ ఫలక్‌నుమా పాతిమానగర్ కు చెందిన షేక్ ఇర్ఫాన్,వట్టేపల్లి నూర్ కాలనీకి చెందిన షేక్ ఉమ్రాన్ అనే ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి వారి వద్ద నుండి తెల్ల కవర్ ఉండగా, పంచనామా సాక్షులు, క్లూస్ టీమ్ సమక్షంలో తనిఖీ చేయగా గంజాయి బయటపడింది. వారి నుండి ఎండు గంజాయి – 1.268 కిలోలు (ఒక బండిల్, 10 చిన్న ప్యాకెట్లు ఒక్కొక్కటి 8–10 గ్రాములు) రెండు సెల్ ఫోన్లు,ప్యాకింగ్ మెటీరియల్ స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు.

# బుద్వేల్‌లో వైభవంగా దేవి నవరాత్రి ఉత్సవాలు

**గాయత్రీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు**



**రాజేంద్రనగర్, అక్టోబర్ 12 (ప్రజా జ్యోతి)** రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ నియోజకవర్గం అత్తాపూర్ సర్కిల్ పరిధిలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో, వైభవంగా కొనసాగుతున్నాయి. బుద్వేల్ రైల్వే స్టేషన్‌లోని కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన అమ్మవారు నవరాత్రి ఉత్సవాల్లో రెండో రోజు గాయత్రీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. గాయత్రీ దేవి రూపంలో కొలువుదీరిన అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా ఉదయం వేదపండితుల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. వేదమంత్రాల నడుమ జరిగిన పూజా కార్యక్రమాలతో ఆలయ ప్రాంగణం భక్తిమయంగా మారింది. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, తమ కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించారు.నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తుండటంతో భక్తుల్లో ఆధ్యాత్మిక ఉత్సాహం నెలకొంది. ఉత్సవాల సందర్భంగా కమ్యూనిటీ హాల్ పరిసరాలు సందడిగా మారగా, అమ్మవారి దర్శనంతో భక్తులు ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందారు. భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్న ఈ ఉత్సవాలతో బుద్వేల్ ప్రాంతంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో కమిటీ యువకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

అవగాహన కార్యక్రమంలో మేడిపల్లి సీఐ జలంధర్ రెడ్డి



**మేడిపల్లి (ప్రజా జ్యోతి):** సమాజాన్ని పట్టిపీడిస్తున్న డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మేడిపల్లి సీఐ డి. జలంధర్ రెడ్డి కోరారు. సోమవారం మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని చెంగిచెర్ల డివిజన్ వెంకటేశ్వర కాలనీ, కరుణప్రియ కాలనీల్లో విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు.అనంతరం కాలనీవాసులతో మాట్లాడిన సీఐ, యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గుర్తుతెలియని ఫోన్ నంబర్ల నుంచి వచ్చే కాల్స్‌కు స్పందించకుండా అప్రమత్తంగా ఉండాలని, సైబర్ నేరాల బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ ఎస్ఐ ఉదయ్ భాస్కర్, పోలీసు సిబ్బంది, కాలనీవాసులు పాల్గొన్నారు.

# గ్రాడ్యుయేషన్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల నమోదు కార్యక్రమం పై ప్రత్యేక సమావేశం



**ఉప్పల్,అక్టోబర్ 12,( ప్రజా జ్యోతి ):** భారతీయ జనతా పార్టీ ఉప్పల్ డివిజన్ అధ్యక్షులు మార్నెని ఫణీంద్ర ఆధ్వర్యం లో కన్వీనర్ అడపు రమేష్ అధ్యక్షతన మహబూబ్నగర్ రంగారెడ్డి హైదరాబాద్ జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల నమోదు కార్యక్రమం పై ముఖ్య సమావేశం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ కార్పొరేటర్ బండారు శ్రీవాణి నియోజవర్గం కన్వీనర్ గోనె శ్రీకాంత్ జిల్లా కోఆర్డినేటర్ శివకుమార్ నియోజవర్గం కో కన్వీనర్ గీత సాదినేని హాజరై ఓటర్ ఎన్రోల్మెంట్ గురించి సమావేశం లో మాట్లాడడం జరిగింది ఈ కార్యక్రమానికి సీనియర్ నాయకులు షామీర్పేట్ ధర్మారెడ్డి,డివిజన్ ప్రధాన కార్యదర్శి తీగ విఠల్ రావు ముదిరాజ్,నామ శ్రవణ్ అంజి రెడ్డి తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్ శ్రీధర్ గుప్తా,పి నర్సిరెడ్డి పద్మ ఆకుల రిషికేష్, బానోత్ రాజు నాయక్,మమత, బుర్ర జ్యోతి,నవత,కే అంజి రెడ్డి శ్రీనివాస్,గురువయ్య అభిరామ్ తదితరులు పాల్గొన్నారు

# ధారూర్ నూతన ఎస్ఐ గా సురేష్ బాధ్యతల స్వీకరణ




**ధారూర్, అక్టోబర్ 12 (ప్రజా జ్యోతి):** ధారూర్ మండల నూతన ఎస్ఐ గా సురేష్ సోమవారం పదవి బాధ్యతలు స్వీకరించారు. వికారాబాద్ పట్టణ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించిగా బదిలీపై ధారూర్ కు వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహించినా ఎస్ఐ సున్నం రాఘవేందర్ వీఆర్‌కు బదిలీ అయ్యారు. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం తన వంతు కృషి చేస్తానని, డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించి ప్రత్యేక దృష్టి సాధించి రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటానాని ఎస్సై తెలిపారు.

# బీఆర్ఎస్‌కు "భూమి" భారం

**హైదరాబాద్ :** తెలంగాణలో బీఆర్ఎస్ ఒకింత ఇబ్బంది కరమైన పరిస్థితులను ఎదుర్కొంటుంది. అధికారంలో ఉన్న సమయంలో భూముల కొనుగోళ్ల ఇప్పుడు కాంగ్రెస్ చర్చ పెట్టడంతో ఒకింత ఆత్మరక్షణలో పడినట్లయింది. కేసీఆర్ నుంచి ఆయన కుటుంబ సభ్యులపై భూ ఆక్రమణల ఆరోపణలను కాంగ్రెస్ చేయడంతో దీనిని అధిగమించేందుకు ఎదురుదాడికి దిగుతున్నప్పటికీ అనుకున్న ఫలితం లభించడం లేదు. రాజకీయంగా మరియు న్యాయపరంగా చూస్తే, బీఆర్ఎస్ పార్టీ భూముల వ్యవహారంలో తీవ్రమైన ఆత్మరక్షణలో పడిందనే చర్చ గట్టిగా నడుస్తోంది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన భూ కేటాయింపులు, పార్టీ కార్యాలయాల నిర్మాణాలు, మరియు కీలక నేతల వ్యక్తిగత భూములపై గట్టి నిఘా పెట్టడం ఇందుకు ప్రధాన కారణంగా చెప్పాలి.తెలంగాణలో భూములన్నీ... బీఆర్ఎస్ నేతలు, వారి కుటుంబ సభ్యులకు సంబంధించిన భూ అక్రమాలు, 22-ఎ కేటాయింపులపై తెలంగాణ ప్రభుత్వం సెప్టెంబర్ 2026లో ఒక నలుగురు సభ్యుల ఉన్నత స్థాయి విచారణ కమిటీని ఏర్పాటు చేసింది. ఇది పార్టీ నేతలను ఇరకాటంలోకి నెట్టింది. జిల్లా కేంద్రాల్లో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాల కోసం ప్రభుత్వ భూములను అతి తక్కువ ధరలకు కేటాయించుకున్నారని, కొన్ని చోట్ల అనుమతులు లేకుండా అక్రమంగా నిర్మించారనే ఆరోపణలపై న్యాయపరమైన చర్యలు నడుస్తున్నాయి. ఇప్పటికే నల్గొండ వంటి ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా కట్టిన పార్టీ ఆఫీస్ భవనాలపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ విషయంలో బీఆర్ఎస్ నేతలు పెద్ద సంఖ్యలో భూములను తమ సొంతం చేసుకున్నారన్న అభిప్రాయం ప్రజల్లో బలపడేందుకు దోహదపడింది. రాజకీయాలు కేసీఆర్ కుటుంబానికి చెందిన గజ్వేల్ ఫామ్‌హౌస్ భూములు, అలాగే కేటీఆర్‌కు లింక్ ఉన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న జన్వాడ ఫామ్‌హౌస్ పరిసర భూములపై కాంగ్రెస్ ప్రతినిధుల బృందాలు స్వయంగా వెళ్లి క్షేత్రస్థాయి పరిశీలనలు జరిపాయి. కేసీఆర్ కుటుంబానికి 9 జిల్లాల్లో దాదాపు 440 ఎకరాల భూములు ఉన్నాయని అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఆరోపించి విచారణకు ఆదేశించారు. ఈ ఆరోపణలన్నింటినీ రాజకీయ కక్ష సాధింపు చర్యలుగా బీఆర్ఎస్ కొట్టిపారేస్తోంది. ప్రభుత్వ భూముల తాకట్టుపై కాంగ్రెస్‌ను నిలదీస్తూ, సీఎం రేవంత్ రెడ్డి కుటుంబ భూములపై కూడా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని హరీశ్ రావు, కేటీఆర్ లాంటి అగ్రనేతలు ఎదురుదాడికి దిగుతున్నారు. అయినప్పటికీ, అధికారికంగా ప్రభుత్వ విచారణలు, కోర్టుల నోటీసులు ఎదుర్కొంటుండటం వల్ల భూముల విషయంలో ప్రస్తుతానికి బీఆర్ఎస్ కొంత ప్రతికూల పరిస్థితుల్లోనే ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



# ఘనంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏనుగుల తిరుపతి యాదవ్ జన్మదిన వేడుకలు



**బోయిన్‌పల్లి, అక్టోబర్ 12 (ప్రజాజ్యోతి):** ఓల్డ్ బోయిన్‌పల్లి 262వ డివిజన్‌కు చెందిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏనుగుల తిరుపతి యాదవ్ జన్మదిన వేడుకలను సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యువకులు, డివిజన్ అధ్యక్షులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని తిరుపతి యాదవ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వేడుకలతో ఆ ప్రాంతంలో సందడి నెలకొంది. అభిమానులు, పార్టీ శ్రేణులు ఉత్సాహంగా పాల్గొని జన్మదిన వేడుకలను ఘనంగా జరిపారు.

# అబ్దుల్లాపూర్మెట్ ఇన్స్పెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలుసుకున్న పబ్బతి బాల కిషన్ గౌడ్




**అబ్దుల్లాపూర్ మెట్టు అక్టోబర్ 12 (ప్రజాజ్యోతి)** అబ్దుల్లాపూర్ మెట్టు పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన రాజును చిన్న రావిరాల గ్రామపంచాయతీ సర్పంచ్ పబ్బతి బాలకిషన్ గౌడ్ సోమవారం అబ్దుల్లాపూర్మెట్ పోలీస్ స్టేషన్ లో మర్యాదపూర్వకంగా కలుసుకొని శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు బండారు సత్యనారాయణ, రాపోలు మల్లేష్, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు చింతల మోహన్ రెడ్డి, సత్తుపల్లి శ్రవణ్ రెడ్డి, గండికోట అశోక్ పాల్గొన్నారు.

# గంజాయి కేసులో పరారీలో ఉన్న నిందితుడి అరెస్ట్




**బోడుప్పల్ (ప్రజా జ్యోతి ప్రతినిధి):** గంజాయి కేసులో గత తొమ్మిది నెలలుగా పరారీలో ఉన్న సిరిమల్ల సాయి కుమార్ అలియాస్ చింటు (20)ను మేడిపల్లి పోలీసులు సోమవారం మల్లాపూర్‌లో అరెస్ట్ చేశారు. హాజీపూర్‌కు చెందిన నిందితుడిపై క్రైమ్ నంబర్ 109/2026, ఎన్‌డీపీఎస్ చట్టం సెక్షన్ 20(బి)(2)(ఎ) కింద కేసు నమోదైంది. నిందితుడు తన సహచరుడు రౌతు భాస్కర్ రావు అలియాస్ భూటాన్‌తో కలిసి ధూల్‌పేట్‌లో గంజాయి కొనుగోలు చేసి, బోడుప్పల్‌లో విక్రయించేందుకు ప్రయత్నించినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. గతంలో పోలీసులకు చిక్కకుండా తప్పించుకున్న నిందితుడిని తాజాగా అరెస్ట్ చేసి తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టారు.

# పాత నేరస్థుడి అరెస్టు

గంజాయి కేసులో పరారీలో ఉన్న నిందితుడి అరెస్ట్




మేడిపల్లి (ప్రజా జ్యోతి) : గంజాయి కేసులో నమోదైన కేసు నుంచి తప్పించుకుని సుదీర్ఘకాలంగా పరారీలో ఉన్న నిందితుడిని మేడిపల్లి పోలీసులు అరెస్టు చేశారు.

మేడిపల్లి సీఐ జలంధర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా హాజీపూర్ గ్రామానికి చెందిన సిరిమల్ల సాయికుమార్ అలియాస్ చింటు (20)ను మల్లాపూర్ ప్రాంతంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణలో, తన సహచరుడు రౌతు భాస్కర్‌రావు అలియాస్ భూటాన్‌తో కలిసి ధూల్‌పేటలో గుర్తుతెలియని వ్యక్తుల వద్ద గంజాయి కొనుగోలు చేసినట్లు సాయికుమార్ వెల్లడించాడు. అందులో కొంత సేవించి, మిగిలినదాన్ని బోడుప్పల్‌లోని హెచ్‌ఎండీఏ వెంచర్ ప్రాంతంలో విక్రయించేందుకు ప్రయత్నించినట్లు తెలిపాడు.

గతంలో నిందితులను పట్టుకునేందుకు పోలీసులు ప్రయత్నించగా, భాస్కర్‌రావు పట్టుబడ్డాడు. ఆ సమయంలో సాయికుమార్ అక్కడి నుంచి తప్పించుకుని పరారయ్యాడు. తాజాగా అతడిని అరెస్టు చేసిన పోలీసులు, తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టారు.

# ఎల్లంపేటలో అక్రమ నిర్మాణంపై ఫిర్యాదు

అధికారుల నిర్లక్ష్యంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన తలారి చందర్



**ఎల్లంపేట, అక్టోబరు 12 (ప్రజాజ్యోతి):** ఎల్లంపేట్ మున్సిపాలిటీ పరిధిలోని ఎల్లంపేట్ గ్రామ రెవెన్యూ సర్వే నంబర్లు 70, 71లో ప్రభుత్వ అనుమతులు లేకుండా కొందరు వ్యక్తులు అక్రమ నిర్మాణం చేపడుతున్నారని ఆర్‌టీఐ చట్టం--2005 టీం ఫర్ గుడ్ గవర్నెన్స్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు తలారి చందర్ ఆరోపించారు. ఈ నిర్మాణం వల్ల ప్రభుత్వ ఆదాయానికి నష్టం వాటిల్లుతోందని పేర్కొన్నారు. ఈ విషయంపై గతంలో మున్సిపల్ కమిషనర్, జిల్లా కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదులు చేసినప్పటికీ తగిన చర్యలు తీసుకోలేదని ఆయన తెలిపారు. గ్రామాల్లో అక్రమ నిర్మాణాలు జరగకుండా అధికారులు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యటించి పర్యవేక్షించాలని సూచించారు. అయితే, సంబంధిత అధికారులు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వహించడం లేదని ఆరోపించారు. గతంలో రాష్ట్ర లోకాయుక్త, ఉపలోకాయుక్త న్యాయస్థానం జారీ చేసిన ఉత్తర్వులను సైతం అధికారులు ఉల్లంఘించారని పేర్కొంటూ, ఈ నెల 12న పురపాలక పరిపాలన సంచాలకుడికి ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. అక్రమ నిర్మాణంపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

# ఏపీఎల్‌లో మైటీ మరాఠాస్‌కు హ్యాట్రిక్ విజయం




**హైదరాబాద్, అక్టోబర్ 12 (ప్రజా జ్యోతి):** ఆర్చరీ ప్రీమియర్ లీగ్(ఏపీఎల్)లో మైటీ మరాఠాస్ హ్యాట్రిక్ విజయాన్ని నమోదు చేసింది. సోమవారం పీపుల్స్ ప్లాజాలో జరిగిన పోరులో చేరో ఆర్చర్స్‌తో 4-4తో సమమైన అనంతరం 'హిట్-ఆర్-మిస్' షూటాఫ్‌లో 2-1తో గెలిచింది. అమన్ సైని, బొమ్మదేవర ధీరజ్ షూటాఫ్‌లో సత్తాచాటగా, అమన్ ఆరు బాణాలతో 60/60 పాయింట్లు సాధించాడు. చేరో తరఫున మథియాస్ ఫుల్లర్టన్ మాత్రమే షూటాఫ్‌లో హిట్ సాధించాడు. తొలి సెట్‌లో చేరోకు ఆధిక్యం లభించగా, యశ్దీప్ భోగే, ధీరజ్, ఆసియాడ్ డబుల్ గోల్డ్ మెడలిస్ట్ కుంకుమ్ మోహోద్, అమన్ సైని కీలక పాత్ర పోషించారు. ఈ విజయంతో మైటీ మరాఠాస్, చేరో ఆర్చర్స్ చెరో 6 పాయింట్లతో నిలిచాయి.

# శ్రీ సంజీవని ఆంజనేయస్వామి ఆలయంలో భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన

నవరాత్రుల రెండో రోజు ప్రత్యేక పూజలు.. పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు



**అల్వాల్, అక్టోబర్ 12(ప్రజా జ్యోతి)** మచ్చబొల్లారం హనుమాన్ టేకిడిలోని శ్రీ సంజీవని ఆంజనేయస్వామి దేవాలయంలో నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. సోమవారం, అక్టోబర్ 12న నవరాత్రుల రెండో రోజు సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించి, భక్తులు భక్తిపారవశ్యంతో పూజల్లో పాల్గొన్నారు.ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనగా, పూజా కార్యక్రమాలు ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఈ సందర్భంగా కాలనీకి చెందిన పలువురు సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులు అందరికీ కలగాలని భక్తులు ప్రార్థించారు.నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయంలో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో కాలనీ వాసులు ఉత్సాహంగా పాల్గొనడంతో ఆలయ ప్రాంగణం భక్తిమయంగా మారింది.

# జూబ్లీహిల్స్ లో కాస్మోస్ డైమండ్స్ కొత్త స్టోర్ ప్రారంభం



**జూబ్లీహిల్స్,అక్టోబర్12(ప్రజాజ్యోతి) :** పారదర్శక విధానం, సంప్రదాయాన్ని తలపించే డిజైన్లతో పేరుగాంచిన బెంగళూరుకు చెందిన ల్యాబ్ గ్రోన్ డైమండ్ ఆభరణాల బ్రాండ్ 'కాస్మోస్ డైమండ్స్' హైదరాబాద్ లోని జూబ్లీహిల్స్ లో తన తొలి ఫ్లాగ్‌షిప్ స్టోర్‌ను ప్రారంభించిందని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నవరాత్రుల తొలి రోజున తమ కాస్మోస్ స్టోర్‌ను ప్రారంభించడం ఎంతో సార్థకతను చేకూర్చిందన్నారు. బెడ్‌రూమ్ స్టార్టప్ స్థాయి నుంచి అంతరిక్షంలోకి డైమండ్‌ను పంపే వరకు మా ప్రయాణం ఎప్పుడూ సంప్రదాయాలను సవాలు చేయడం, మహిళలకు కొత్త అవకాశాలను సృష్టించడం చుట్టూనే సాగింది " అని కాస్మోస్ డైమండ్స్ ఫౌండర్, సంజన త్రిపురమల్లు తెలిపారు. కాస్మోస్ డైమండ్స్ 100 శాతం బైబ్యాక్, ఎక్స్ఛేంజ్ పాలసీని అందిస్తోందన్నారు. ల్యాబ్ గ్రోన్ డైమండ్ రంగంలో ఈ విధమైన హామీని ఇస్తున్న ఏకైక బ్రాండ్ తామేనని కంపెనీ పేర్కొంది. ఈ సేవలకు సంబంధించిన నిబంధనలు మరియు షరతులను స్టోర్‌లో పరిశీలించవచ్చని సూచించిందన్నారు. ప్రస్తుతం కాస్మోస్ ల్యాబ్ గ్రోన్ డైమండ్స్ బెంగళూరులోని హెచ్‌ఎస్‌ఆర్ లేఅవుట్, విజయవాడలోని గవర్నర్‌పేటలో రెండు రిటైల్ స్టోర్లను నిర్వహిస్తోందన్నారు. భారతీయ మార్కెట్లో తన ఉనికిని మరింత విస్తరిస్తున్న ఈ బ్రాండ్, కీలక నగరాలు మరియు అభివృద్ధి చెందుతున్న మార్కెట్లలో తమ స్టోర్లను విస్తరించడానికి ప్రణాళికలు రూపొందించిందన్నారు.

# విజయదశమి వేడుకలకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

**ధ్వజారోహణం, శమీపూజ, రావణ దహన కార్యక్రమం ఖరారు.. అక్టోబర్ 15న బతుకమ్మ వేడుకలు**



**పరిగి, అక్టోబర్ 12 (ప్రజాజ్యోతి):** పరిగి పట్టణంలో విజయదశమి, బతుకమ్మ పండుగలను శాంతియుత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు హిందూ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో కార్యక్రమాల షెడ్యూల్‌ను ఖరారు చేశారు. హిందూ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు సోమ రమేష్ కుమార్, ప్రధాన కార్యదర్శి ముకుంద నాగేశ్వర్, కోశాధికారి మీదిగడ్డ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పుర ప్రముఖులు, దుర్గామాత మండపాల నిర్వాహకులు, పోలీసు, మున్సిపల్ శాఖల అధికారులు, హిందూ బంధువులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు సూచనలు, సలహాలు స్వీకరించి పండుగల నిర్వహణపై నిర్ణయాలు తీసుకున్నారు.
విజయదశమి సందర్భంగా సాయంత్రం 5 గంటలకు ధర్మశాల శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయ ప్రాంగణంలో ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించనున్నారు. అనంతరం సాయంత్రం 5.30 గంటలకు శమీపూజ, 6.30 నుంచి 7 గంటల మధ్య రావణ దహన కార్యక్రమం చేపట్టనున్నారు. ఈ కార్యక్రమాలకు హిందూ బంధువులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కమిటీ సభ్యులు కోరారు.

**అక్టోబర్ 15న బతుకమ్మ వేడుకలు...**

పరిగి పట్టణంలో బతుకమ్మ పండుగ వేడుకలను అక్టోబర్ 15, గురువారం నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు. అనంతరం బతుకమ్మ నిమజ్జన కార్యక్రమాన్ని పట్టణంలోని కొత్తచెరువు కుంటలో నిర్వహించనున్నారు.

**దుర్గామాత మండపాల నిర్వాహకులకు సూచనలు...**

దుర్గామాత నవరాత్రుల సందర్భంగా విగ్రహాలను ఏర్పాటు చేసి పూజలు నిర్వహిస్తున్న మండపాల నిర్వాహకులు తమ మండపాల వద్ద అధ్యక్షుడు, కార్యదర్శి పేర్లు, ఫోన్ నంబర్లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పూజా కార్యక్రమాలు, విగ్రహాల నిమజ్జనాన్ని శాంతియుత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని కోరారు. విజయదశమి వేడుకల సందర్భంగా అవసరమైన ఏర్పాట్ల కోసం మున్సిపల్, పోలీసు, విద్యుత్, నీటిపారుదల శాఖల అధికారులు సహకరించాలని కమిటీ సభ్యులు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో పరిగి మున్సిపల్ చైర్‌పర్సన్ కుడుముల రజిత వెంకటేష్, వైస్ చైర్మన్ కే. హనుమంతు, మున్సిపల్ కౌన్సిలర్లు మీదిగడ్డ శ్రీనివాస్, భాస్కర్, నరేష్, శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ మల్లేష్, పీఏసీఎస్ చైర్మన్ పార్థసారథి, డీఎస్పీ శ్రీనివాస్, సీఐ కొండల్ రెడ్డి, ఎస్ఐ మోహన్ కృష్ణ, పుర ప్రముఖులు ప్రవీణ్ రెడ్డి, ముకుంద అశోక్, చిన్న నర్సింహులు, ఆకారపు రాజు, సురేష్, శ్రీశైలం, నవీన్, మేతరి శ్రీనివాస్, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ ఎన్నికల్లో ఓటమి.. కాంగ్రెస్ సీరియస్!



**హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) గుర్తింపు సంఘం ఎన్నికలు అధికార కాంగ్రెస్ పార్టీలో తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. అక్టోబర్ 9న ముగిసిన ఆర్టీసీ ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతు తెలిపిన తెలంగాణ ఆర్టీసీ వర్కర్స్ యూనియన్ (టీడబ్ల్యూ) ఓటమి పాలైనట్లు సమాచారం. దీంతో ఈ అంశంపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర ఆగ్రహంతో ఉంది. ముఖ్యంగా ఏఐటీయూసీ మద్దతుతో బరిలోకి దిగిన ఎంప్లాయిస్ యూనియన్ (ఈయూ) విజయం సాధించడం, అధికార పార్టీకి మింగుడుపడడం లేదు. ఈ పరిణామంపై టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ప్రజాప్రతినిధుల ఉదాసీనత వల్లే ఆర్టీసీ ఎన్నికల్లో ఓడిపోయినట్లు కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. కార్మికులను తమ వైపు తిప్పుకోవడానికి, అధికారంలో ఉన్నామనే ధీమాతో టీడబ్ల్యూయూని గెలిపించుకోవాలని కాంగ్రెస్ పార్టీ వ్యూహాత్మకంగా వ్యవహరించింది. ఇందులో భాగంగానే రాష్ట్రంలోని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, సంబంధిత మంత్రులు, ఎమ్మెల్యేలు క్షేత్రస్థాయిలో సమన్వయం చేసుకుంటూ యూనియన్ గెలుపు కోసం కృషి చేయాలని పార్టీ అధిష్టానం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. అయితే, క్షేత్రస్థాయిలో పార్టీ ఎమ్మెల్యేలు ఈ ఎన్నికలను సీరియస్‌గా తీసుకోలేదని, ఆర్టీసీ కార్మికుల సమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల వేళ కార్మికులను మమేకం చేయడంలో, స్థానిక సమస్యలపై స్పందించడంలో ప్రజాప్రతినిధులు విఫలమయ్యారంటూ టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పార్టీ అధికారంలో ఉండి కూడా కార్మిక సంఘం ఎన్నికల్లో ఓడిపోవడం పట్ల ఆయన నేతల తీరును తప్పుబట్టారు. అక్టోబర్ 17న అధికారికంగా వెలువడనున్న ఈ ఎన్నికల తుది ఫలితాలు కాంగ్రెస్ పార్టీకి రాబోయే కాలంలో ఎదురుకాబోయే సవాళ్లకు అద్దం పడుతున్నాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. త్వరలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ, జీహెచ్ఎంసీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ తరుణంలో ఆర్టీసీ కార్మిక యూనియన్ ఎన్నికల్లో ఎదురుదెబ్బ తగలడం పార్టీ వర్గాలను ఆందోళనకు గురిచేస్తోంది. కార్మిక రంగంలో పట్టుకోల్పోవడం భవిష్యత్తు రాజకీయాలపై ప్రభావం చూపుతుందనే ఆందోళన పార్టీ అధిష్టానంలో వ్యక్తమవుతోంది. క్షేత్రస్థాయిలో పార్టీ యంత్రాంగానికి, ప్రజాప్రతినిధులకు మధ్య సమన్వయం కొరవడుతోందనడానికి ఈ ఘటనే నిదర్శనమనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎమ్మెల్యేలు కేవలం పదవులకే పరిమితమై పార్టీ బలోపేతంపై దృష్టి పెట్టకపోతే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని పార్టీ గట్టి సంకేతాలు పంపుతోంది. ఈ పరిణామాల నేపథ్యంలో పార్టీ అధిష్టానం అంతర్గత ప్రక్షాళనకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల్లో పార్టీ ఆదేశాలను బేఖాతరు చేసిన వారిపై, బాధ్యతారహితంగా వ్యవహరించిన ఎమ్మెల్యేలపై జిల్లాల వారీగా నివేదికలు తెప్పించుకుని చర్యలు తీసుకునే అవకాశాలున్నాయి. ఏది ఏమైనప్పటికీ, ఆర్టీసీ ఎన్నికల వేడి తెలంగాణ కాంగ్రెస్‌లో వర్గపోరును, నాయకుల పనితీరులోని లోపాలను బట్టబయలు చేసిందనే చెప్పాలి.

**కాంగ్రెస్ ప్రభుత్వానికి వార్నింగ్ బెల్స్!?**

తెలంగాణలో ఆర్టీసీ ఉద్యోగ సంఘాల ఎన్నికల ఫలితాలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఊహించినదానికి భిన్నంగా ఈ ఎన్నికల ఫలితాలు వచ్చాయి. కాంగ్రెస్ పార్టబలపరిచిన యూనియన్లకు ఈ ఎన్నికల్లో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రభావం చూపించే ఆర్టీసీ కార్మిక సంఘాల ఎన్నికల్లో అధికార పార్టీ ఓటమి చవిచూడడం పట్ల పార్టీ శ్రేణులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీకి ఇవి వార్నింగ్ బెల్స్ లాంటివని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రజా వ్యతిరేకతకు ఇవి అద్దం పడుతున్నాయని, అప్రమత్తం కాకపోతే కాంగ్రెస్ పార్టీకి ఇబ్బందులు తప్పవనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అక్టోబర్ 9న ఆర్టీసీ కార్మిక సంఘాల ఎన్నికలు జరిగాయి. వీటిని కాంగ్రెస్ పార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. తాము మద్దతు ఇచ్చిన తెలంగాణ వర్కర్స్ యూనియన్ , స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ వర్కర్స్ యూనియన్ కూటమి విజయం సాధించాలని భావించింది. అయితే? సీపీఐ బలపరిచిన ఎంప్లాయిస్ యూనియన్ , తెలంగాణ మజ్దూర్ యూనియన్ నేషనల్ మజ్దూర్ యూనియన్ కూటమి ఈ ఎన్నికల్లో ఘన విజయం సాధించింది. రాష్ట్ర స్థాయిలో క్లాస్-3 విభాగంలో సీపీఐ అనుబంధ యూనియన్ అయిన ఎంప్లాయిస్ యూనియన్ 18,250 ఓట్లను సాధించగా, కేవలం 13,670 ఓట్లతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. దీంతో ఎంప్లాయిస్ యూనియన్ సుమారు 4,580 ఓట్ల భారీ ఆధిక్యాన్ని నమోదు చేసింది. అలాగే ప్రాంతీయ స్థాయిలో క్లాస్-6 విభాగంలో 13,907 ఓట్లను సాధించింది. ఈ ఎన్నికల ఫలితాలు కేవలం యూనియన్లకే పరిమితం కాలేదు.. రాజకీయంగా ఇది అధికార పార్టీకి పెద్ద హెచ్చరికగా మారింది. ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కాంగ్రెస్ మద్దతు కూటమి కేవలం 3 యూనిట్లను మాత్రమే గెలవడం పార్టీ నేతలను విస్మయానికి గురిచేసింది. పలు జిల్లాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ ఇన్‌చార్జ్‌లు ఎన్నికల ప్రచారంలో చురుగ్గా పాల్గొనకపోవడం, కొందరు నేతలు ప్రత్యర్థి యూనియన్లకు మద్దతు ఇవ్వడం వంటి ఆరోపణలు పార్టీలో అంతర్గత విభేదాలను బయటపెడుతున్నాయి. అక్టోబర్ 14, 15 తేదీల్లో పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ జరగనుండగా, అక్టోబర్ 17న అధికారిక తుది ఫలితాలు వెలువడనున్నాయి. అయితే మొత్తం 900 లోపే ఉన్న పోస్టల్ బ్యాలెట్లు ఇప్పటికే ఉన్న 4,580 ఓట్ల భారీ ఆధిక్యాన్ని మార్చలేవని స్పష్టమవుతోంది. ఈ పరిణామాలు కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలను పునరాలోచనలో పడేశాయి. అనుబంధ సంఘాలతో సమన్వయం, ఆర్టీసీ ఉద్యోగులతో నిరంతర సంప్రదింపులపై పార్టీ నాయకత్వం ఇప్పుడు ప్రత్యేక దృష్టి సారించింది. క్షేత్రస్థాయిలో పార్టీ పట్టు సడలుతుందనే సంకేతాలు వెలువడుతున్న నేపథ్యంలో, రాబోయే రాజకీయ సవాళ్లను ఎదుర్కొనేందుకు కాంగ్రెస్ పార్టీ తన యంత్రాంగాన్ని సరిదిద్దుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# ఐటీ ఉద్యోగులకు పాడ్ ట్యాక్సీ సదుపాయం..

**హైదరాబాద్ :** హైదరాబాద్‌లో ప్రయాణికుల రవాణా వ్యవస్థను మరింత ఆధునికంగా మార్చేందుకు తెలంగాణ సర్కార్ కీలక ప్రణాళికను సిద్ధం చేస్తోంది. మెట్రో రైలు దిగిన ప్రయాణికులు స్టేషన్ నుంచి బయటకు రాకుండానే డ్రైవర్ అవసరం లేని 'పాడ్ ట్యాక్సీ'లోకి మారి నేరుగా తమ కార్యాలయాలకు చేరుకునేలా కొత్త రవాణా వ్యవస్థను ప్రతిపాదించింది. ఐటీ కారిడార్, నాలెడ్జ్ సిటీ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, సచివాలయం పరిసరాలను అనుసంధానిస్తూ మొత్తం 40.82 కిలోమీటర్ల మేర పర్సనల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ (పీఆర్‌టీ) నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేయాలని అధికారులు ప్రణాళిక రూపొందించారు. దీనికి సంబంధించిన సాంకేతిక, ఆర్థిక సాధ్యాసాధ్యాల నివేదికను హైదరాబాద్ మెట్రో రైల్ అధికారులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వివరించారు. ప్రాజెక్టు కోసం లీ అసోసియేట్స్ సంస్థ మూడు నెలల పాటు అధ్యయనం చేసింది. తొలుత 44.62 కిలోమీటర్లు, 56.88 కిలోమీటర్ల నెట్‌వర్క్ ప్రతిపాదనలను పరిశీలించి, వాటి ఆధారంగా 40.82 కిలోమీటర్ల హైబ్రిడ్ నెట్‌వర్క్‌ను అనుకూలంగా సూచించి నట్లు నివేదికలో పేర్కొన్నారు. ఇందులో కూకట్‌పల్లి రాయదుర్గం మార్గంలో 7.62 కిలోమీటర్లు, రాయదుర్గం నాలెడ్జ్ సిటీ మార్గంలో 12.83 కిలోమీటర్లు, రాయదుర్గం/హైటెక్ సిటీ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ మార్గంలో 14.01 కిలోమీటర్లు, సచివాలయం ఎన్టీఆర్ మార్గ్ కారిడార్‌లో 6.36 కిలోమీటర్ల మేర నెట్‌వర్క్ ఉండనుంది. ఈ మార్గాల ద్వారా ఐటీ ఉద్యోగులు, కార్యాలయాలకు వెళ్లే ప్రయాణికులకు చివరి దశ రవాణా సదుపాయం కల్పించాలన్నది ప్రధాన లక్ష్యం. ఈ పాడ్ ట్యాక్సీ నెట్‌వర్క్‌ను దశలవారీగా అభివృద్ధి చేయాలని ప్రతిపాదించారు. 2030 నాటికి 34.66 కిలోమీటర్లు, 2040 నాటికి 39.36 కిలోమీటర్లు, 2050 నాటికి పూర్తి నెట్‌వర్క్‌ను అందుబాటులోకి తీసుకురావాలన్నది ప్రణాళిక. ఈ వ్యవస్థ ద్వారా రోజువారీ ప్రయాణికుల సంఖ్య 2030లో 5.42 లక్షలు, 2040లో 15.47 లక్షలు, 2050 నాటికి 20.31 లక్షలకు చేరవచ్చని నివేదిక అంచనా వేసింది. ప్రస్తుతం హైదరాబాద్ మెట్రోలోని 69 కిలోమీటర్ల మార్గంలో రోజుకు



సుమారు ఐదు లక్షల మంది ప్రయాణిస్తున్నారు. ఈ నేపథ్యంలో పాడ్ ట్యాక్సీలు అందుబాటులోకి వస్తే మెట్రో స్టేషన్ల నుంచి కార్యాలయాలకు చేరుకునే ప్రయాణం మరింత సులభమయ్యే అవకాశం ఉంది. అయితే, ఈ ప్రాజెక్టును ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్య (పీపీపీ) విధానంలో చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. దేశంలో ముంబైలోని బాంద్రా?కుర్లా కాంప్లెక్స్ ప్రాంతంలోనూ పాడ్ ట్యాక్సీ ప్రాజెక్టును అభివృద్ధి చేస్తున్నారు. హైదరాబాద్ ప్రాజెక్టుకు సంబంధించి మొత్తం వ్యయం, ప్రయాణికుల టికెట్ ధరలు, నిర్మాణ పనుల ప్రారంభ తేదీ, పూర్తి చేసే గడువు ఇంకా వెల్లడికాలేదు. ఇవి ఖరారైన తర్వాతే ప్రాజెక్టు అమలు తీరుపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ప్రతిపాదిత నెట్‌వర్క్ కార్యరూపం దాల్చితే ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్ రద్దీని తగ్గించడంతో పాటు మెట్రో నుంచి కార్యాలయాలకు చేరుకునే ప్రయాణికులకు ప్రత్యామ్నాయ రవాణా సదుపాయం అందుబాటులోకి రావచ్చు

## కాకినాడ జీజీహెచ్లో వైద్యుల నిర్లక్ష్యం

**ప్రసవం చేసారు..కడుపులో క్యానులా, దూది వుంచేసారు**

**కాకినాడ:** కాకినాడ జీజీహెచ్ లో వైద్యుల నిర్లక్ష్యం ఒక బాలిత ప్రాణాలపైకి తెచ్చింది. బాలింత కడుపులో మెటల్ పరికరం, దూది ఉంచి కుట్లు వేసిన వైనం కలకలం రేపింది. గాడిమొగకు చెందిన అరదాడి లలిత, రెండవ కాన్పు కోసం గత నెల 23న జీజీహెచ్ గైనకాలజీ వార్డులో చేరింది. 26న లలితకు సహజ ప్రసవం జరిగింది. ప్రసవ సమయంలో వ్యర్థాలు బయటకు పోయేందుకు గర్భశయ ముఖ ద్వారం వద్ద ఎస్.ఆర్ కాన్యులా అనే స్టీల్ పరికరం, దూది అమర్చారు. ప్రసవం అనంతరం స్టీల్ పరికరం, దూది అలానే ఉంచి వైద్యులు గర్భశయ ముఖ ద్వారానికి కుట్లు వేసి ఆపరేషన్ చేసారు. ఆసుపత్రి నుండి డిశ్చార్జ్ అయిన తరువాత బాలిత 15 రోజుల పాటు మల మూత్రాలు నిలిచి తీవ్ర అనారోగ్యానికి గురైయింది. మళ్ళీ జీజీహెచ్కు తీసుకురావడంతో వైద్యులు గర్భశయ ముఖ ద్వారం నుండి స్టీల్ పరికరం, దూది తొలగించారు. ఘటనపై పిర్యాదు అందడంతో ఇద్దరు వైద్యులు సస్పెన్షన్ అయ్యారు. మరో ఇద్దరు పీజీ విద్యార్థులపై చర్యలకు డీఎంఈ ఆదేశాలు జారీ చేసారు..

## రేవంత్ పాలమూరు బిడ్డ కాదు..పాలమూరు ద్రోహి

**హైదరాబాద్ :** రైతులు ఇబ్బందులు పడుతుంటే రేవంత్ రెడ్డి, మంత్రులు గోవా, ఢిల్లీ అని ట్రిప్పులు వేస్తున్నారని మాజీ మంత్రి హరీష్ రావు మండిపడ్డారు. ఎల్ నినో పరిస్థితులపై సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు ఉదయం 11 గంటలకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతారని, రైతు వేదికల వద్దకు రావాలని ఎమ్మెల్యేలకు, రైతులకు అధికారులు సర్క్యులర్ ఇచ్చారు. ఉదయం 9:52 గంటలకు వీడియో కాన్ఫరెన్స్ క్యాన్సిల్ అని మెసేజ్ పెట్టారు. మళ్లీ 11:15 గంటలకు వీడియో కాన్ఫరెన్స్ ఉంది రండి అని చెప్పి, మళ్లీ కాసేపటికి 1:00 గంటలకు సీఎం రాడు, డిప్యూటీ సీఎం, వ్యవసాయ శాఖ మంత్రి వస్తారని చెప్పారు. అంటే రాష్ట్ర రైతులు ఇబ్బందులు పడుతుంటే వీళ్లు చిన్న పిల్లల ఆటలు ఆడుతున్నారని ఆరోపించారు. ఆటు ఏపీలో లేని కరువు తెలంగాణలో ఎందుకు ఉందని అయన ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేకనే ఈరోజు తెలంగాణలో కరువు పరిస్థితులు ఉన్నాయి. తెలంగాణ నుంచి కృష్ణా, గోదావరి నదులు పారుతుంటే రేవంత్ రెడ్డి నీటిని వదిలిపెడుతున్నాడు, చంద్రబాబు ఒడిసిపడుతున్నాడని అన్నారు. గురు దక్షిణ చెల్లిస్తున్నావా రేవంత్ రెడ్డి? 700 కిలోమీటర్ల దూరంలో ఉన్న తన కుప్పం నియోజకవర్గానికి నీళ్లు తీసుకెళ్తున్నానని చంద్రబాబు నాయుడు చెప్తున్నాడు. పట్టిసీమ ద్వారా 500 టీఎంసీల నీళ్లు లిఫ్ట్ చేశానని చంద్రబాబు ట్వీట్ వేశాడు. రేవంత్ రెడ్డి పాలమూరు బిడ్డ కాదు, పాలమూరు ద్రోహి అని విమర్శించారు. రేవంత్ ప్రభుత్వానికి లిక్కర్ మీద ధ్యాస ఉంది కానీ రైతుల మీద లేదు. సింగూరులో ఉన్న రెండు టీఎంసీల నీళ్లను తాగునీటి కోసం వాడకుండా, లిక్కర్ ఫ్యాక్టరీలకు సప్లై చేస్తున్నారు. రాబోయే రోజుల్లో మెదక్, సంగారెడ్డి, కామారెడ్డి జిల్లాల్లో తాగునీటి కష్టాలు వస్తే ఎలా అని నిలదీసారు. హైదరాబాద్ నగరంలో కంపెనీలకు, ప్రజలకు 50% నీళ్లు మాత్రమే సప్లై చేస్తామని నోటీసులు ఇస్తున్నారు. కానీ బీర్లు తయారు చేయడానికి ఎలాంటి కొరత లేదు, పుష్కలంగా సప్లై చేస్తామని మంత్రి జూపల్లి కృష్ణారావు చెప్తున్నాడని అన్నారు.

## పెండింగ్ దరఖాస్తులపై:

## జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా సమీక్ష

**కరీంనగర్ :** ప్రజావాణి కార్యక్రమానికి 138 దరఖాస్తులు వచ్చాయి. పెండింగ్ దరఖాస్తులపై జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా శాఖల వారీగా సమీక్షించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం ఐడిఓసి సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ హాజరై ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. మొత్తంగా 138 దరఖాస్తులు ప్రజల నుండి అందగా వాటి పరిష్కారానికి వివిధ శాఖల అధికారులకు బదిలీ చేశారు. కార్యక్రమానంతరం జిల్లా కలెక్టర్ వివిధ శాఖల వారీగా పెండింగ్ లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులపై సమీక్షించారు. ముఖ్యంగా పోలీస్, పంచాయతీ, ల్యాండ్ సర్వే, రిజిస్ట్రేషన్, ఎలక్ట్రిసిటీ, కార్పొరేషన్ శాఖల్లో పెండింగ్ లో ఉన్న దరఖాస్తులు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అదేవిధంగా ముఖ్యమంత్రి ప్రజావాణి కార్యక్రమం ద్వారా జిల్లాలోని వివిధ కార్యాలయాలకు వచ్చిన దరఖాస్తుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, డిఆర్ఓ స్వామి, ఆర్డీవో షర్మిల వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మంగంపల్లిలో కోటి రూపాయలతో

## ఆధునిక ఆలయ నిర్మాణానికి ప్రత్యేక పూజలు

**భక్తిశ్రద్ధలతో హోమంలో పాల్గొన్న ఎమ్మెల్యేదంపతులు.**

**వనపర్తి :** వనపర్తి నియోజకవర్గంలోని పెద్దమందడి మండలం మంగంపల్లి గ్రామంలో భక్తుల ఆధ్యాత్మిక ఆకాంక్షలకు అనుగుణంగా పాత ఆంజనేయస్వామి, శివాలయాల స్థానంలో రూ.కోటి వ్యయంతో ఆధునిక ఆలయాన్ని నిర్మించేందుకు ఎశ్రీజీ మేఘారెడ్డి, శారదరెడ్డి దంపతులు సోమవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దంపతులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, హోమ కార్యక్రమంలో భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే దంపతులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. గ్రామాల్లో ఆధ్యాత్మిక సంప్రదాయాలను పరిరక్షిస్తూ, భక్తులకు మెరుగైన ఆలయ సౌకర్యాలు కల్పించేందుకు చేపడుతున్న ఈ నిర్మాణ కార్యక్రమం మంగంపల్లి గ్రామ ప్రజలకు, భక్తులకు ప్రాధాన్యత సంతరించుకుంది. నూతన ఆలయ నిర్మాణంతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం మరింత విస్తరించనుంది. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులను వారి కర్మానికి వదిలేసి ఢిల్లీకి యాత్రలా ?

## మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి.

**వనపర్తి :** ఎల్‌నినో మీద కీలక క్యాబినెట్ సమావేశం, రైతువేదికల్లో రైతులతో వీడియో కాన్ఫరెన్స్ అని ప్రకటించి దానిని వాయిదా వేసి కాంగ్రెస్ సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు అంతా ఢిల్లీకి వెళ్లడం వారి బాధ్యతా రాహిత్యానికి నిదర్శనం. అబద్దాలతో అధికారంలోకి వచ్చి, అబద్దాలతో పాలన కొనసాగిస్తున్నారు. మొన్నటిదాకా ఆరుతడి పంటలు వేసుకొమ్మని ప్రచారం చేసి ఇప్పుడు అసలు రెండో పంట వేయనే వద్దంటూ సీఎం, మంత్రులు రైతులను హెచ్చరించడం దుర్మార్గం. సాగునీళ్లు మాత్రమే కాదు కనీసం తాగునీళ్లు కూడా దొరకవు, కరంటు కూడా ఇవ్వలేం అని ప్రకటించడం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను, వ్యవసాయాన్ని, ప్రజల విషయంలో చేతులు ఎత్తేసిందని స్పష్టమవుతుందిసాగునీళ్లు ఎత్తిపోసుకునే అవకాశం ఉన్నా ఎత్తిపోతల మోటార్లను బందుపెట్టి ఈ ప్రభుత్వం రైతాంగం, వ్యవసాయం నడ్డి విరిచింది. రాష్ట్రంలో కరంటు రాక పంటలు ఎండి, లో ఓల్టేజీతో మోటార్లు కాలిపోయి రైతులు ఆవేదనతో రోడ్లెక్కుతుంటే, కాంగ్రెస్ నేతలు విమానాలు ఎక్కి ఢిల్లీకి పోతున్నారుజాతీయ పార్టీలను నమ్ముకుంటే అధోగతి అని కేసీఆర్ అనేకమార్లు చెప్పారు. వారికి తెలంగాణ ప్రయోజనాలు, తెలంగాణ ప్రజల ప్రయోజనాల కన్నా వ్యక్తిగత ప్రయోజనాలు, వారి పార్టీ ప్రయోజనాలే ముఖ్యమని, ఒక్క బీఆర్ఎస్ పార్టీకి మాత్రమే ముందు తెలంగాణ ప్రయోజనాలు, తర్వాతే ఇతర ప్రయోజనాలు అని స్పష్టంగా చెప్పారు. కేసీఆర్ పాలనలో పండగలా ఉన్న వ్యవసాయం, రాజులా బతికిన రైతు కాంగ్రెస్ పాలనలో తిరిగి వెనకటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు

## బనవాసి ఫారంలో ప్రభుత్వ హై స్కూల్, కాలేజీ,

## ప్రభూత్వ వసతిగృహం ఏర్పాటు చేయాలి

**ఎమ్మిగనూరు :** ఎమ్మిగనూరు మండలం బనవాసి ఫారం లో చుట్టుపక్క గ్రామాల విద్యార్థుల కోసం ప్రభుత్వ హైస్కూల్,కాలేజ్,విద్యార్థి సంక్షేమ వసతి గృహం నిర్మించాలని రాయలసీమ విద్యార్థి పోరాట సమితి రాష్ట్ర సహాయ కార్యదర్శి జి నల్లారెడ్డి యాదవ్ ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షులు రాయలసీమ రవికుమార్,రాయలసీమ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు సుంకన్న జిల్లా కలెక్టర్ డాక్టర్ సిరి ని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మిగనూరు మండలం బనవాసి ఫారంలో దాదాపు 3500 ప్రభుత్వ భూమి కలదు అందులో ప్రభుత్వం అనేకకార్యాలయాలు,పరిశ్రమలు ఏర్పాటు చేయనుంది అయితే ఫారం చుట్టు పక్కన 15గ్రామాలు కలవు ఆయా గ్రామాలలో హై స్కూల్స్ లేకపోవడంతో వేలాది మంది విద్యార్థులు ఎమ్మిగనూరుకు వెళ్లిరావాల్సిన పరిస్థితి ఉంది అయితే గ్రామాలకు సమయానికి బస్సులు లేక విద్యార్థులు మధ్య లోనే చదువుకు దూరమవుతున్నాం